RSRao.

123

జనవరి 1982

సృజన

ఆధునిక సాహిత్య వేదిక

మాస పత్రిక

గద్దర్ పాటల సమీక్షావ్యాసం :

భూమితల్లి కడుపుపంట

నడుస్తున్న చరిత్రపుటల్లోంచి :

తమిళనాడులో పోలీసు రాజ్యం

భూమయ్య కిష్టాగౌడ్ స్మారక ఉపన్యాసం :

ప్రభుత్వ హింస

నిర్వహణ

'సాహితీ మిత్రులు'

సంవత్సర చందా రు. 20　　ఈ సంచిక రు. 2

ఆదిలాబాద్ గిరిజన సహాయనిధి

C/o సృజన, హనుమకొండ, వరంగల్ 506 00'.

గత సంచికలో ప్రకటించిన విరాళాలు :

ఒక బంగారు ఉంగరం, 4 వెండిమట్టెలు, 1500 రూపాయిల మందులు

	+ 18006
శ్రీశాయి, వరంగల్	10
శాంత, అరుణ, హైదరాబాద్	20
కరుణ, విజయవాడ	100
రైతుకూలీ సంఘంపక్ష, గోరంట్ల	35
టెలికాం కార్మికులు, తెనాలి	13
ఉపాధ్యాయబృందం, గ్రామస్థులు, కంబాలపల్లి	113
మొత్తం రు.	18297

+ ఒక బంగారు ఉంగరం, 4 వెండిమట్టెలు, 1500 రూపాయల మంద

...దిలాబాద్ గిరిజన సహాయనిధి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైదరాబాద్, వరంగల్
పి. వరవరరావు పేరఉంది. అకౌంట్ నంబర్ 2730

SRJANA is commended for use in Public Libraries in th
State by the Director of Public Libraries, Andhra Pradesh, Hy
Vide Ref. No. 182/A4/67, dated 22-9-1967.

Edited, Printed & Published by P. Hemalatha for 'Sahithee Mithrul
Printed at Navatha Printers J. P. N. Road, Warangal - 506 00
for Venkataramana Mudranalayam, Warangal
Working Editor: Varavararao

సృజన

ఆధునిక సాహిత్య వేదిక

123 మాసపత్రిక జనవరి 1982

సంవత్సర చందా రు. 20 ఈ సంచిక రు. 2

కేసలాపూర్ జాతరా

డిసెంబర్ నెలలో పత్రికా రచయితలు ఆదిలాబాదుజిల్లా ఆదివాసుల ప్రాంతాలు తిరిగివచ్చి అక్కడి పరిస్థితుల గురించి రాసినప్పటినుంచీ, దాదాపు రెండు మూడు వారాలుగా గిరిజన సమస్యలపై వార్త లేనిరోజు లేదు. పాలక పార్టీలోని నాయకులే గిరిజన సమస్యలపై ప్రభుత్వం నిద్రపోతున్నదని ఆరోపణలు, ప్రత్యారోపణలు చేసుకుంటున్నారు. ఇంద్రవెల్లి పోలీసుకాల్పుల తర్వాత ప్రకటించిన దాదాపు రెండు కోట్లరూపాయల సహాయం అసలు ఏమాత్రం గిరిజనులకు అందవేలేదని అందరూ ఒప్పుకుంటున్నారు. గిరిజన అభివృద్ధిపథకాలను అమలుచేయాల్సిన ప్రభుత్వ అధికారి ఒక్కరూ పత్రికారచయితలకు ఆ పరిసరప్రాంతాల్లోనే కనిపించలేదు. తన చేతిలో వున్న కాగితాలు బయటపెడితే ఈ ప్రభుత్వం తక్షణం కుప్పలా కూలిపోతుందని మంత్రి సుధాకరరావు బెదరించాడు- ప్రైవేట్‌గా కాదు- ఎందరో ప్రభుత్వ కార్యదర్శుల ముందర - పబ్లిగ్గా. మంత్రి రవీంద్రనాయక్ స్వయంగా గిరిజనులను రెచ్చగొడుతున్నాడని మరికొందరు శాసనసభ్యులు ఆరోపించారు. మొత్తంమీద తమ సమస్యలను చర్చించుకోవడానికి ఇంద్రవెల్లిలో గిరిజన రైతుకూలీ సంఘం పిలుపుపై కదిలివచ్చిన వేలాదిమంది గోండులపై తుపాకీ గుండ్లవర్షం కురిపించడంతప్ప ఈ ప్రభుత్వం గోండుల జీవన స్థితిగతులను మెరుగుపరచడానికి ఏమీ చేయలేదన్నది ప్రభుత్వంలో వున్న మంత్రుల, అధికారుల, శాసనసభ్యుల ప్రకటన ద్వారానే స్పష్టమవుతున్నది.

ఈ సమస్యను సందడిగానో సంబరంగానో మార్చడానికి ఇప్పుడు ప్రభుత్వం ప్రయత్నిస్తున్నది. ఎన్నికల ప్రతిపక్షాలకన్న ముందే హరిజన, గిరిజన సమస్యలను వాడుకొని మొసలికన్నీళ్ళు పెట్టుకోవడానికి కాంగ్రెస్ ఐ కి కావలసినంత అంగబలం, అర్థబలం వున్నది. దివోలీ, సాధుపూర్‌లలో హరిజనులపై హత్యాకాండ జరిపి హైదరాబాదులో అనుచిత సమ్మేళనం జరుపగల ధూర్తత్వం, ఇంద్రవెల్లిలో గోండులపై కాల్పులుజరిపి హైదరాబాదులో ఆదివాసుల సమ్మేళనం జరపగల నయవంచన ఇందిరా కాంగ్రెస్‌కే చెల్లింది. నాగావేషం కట్టుకొని నాగాల మధ్యకు, మణిపూర్‌నృత్యంచేస్తూ మణిపూర్ ప్రజలమధ్యకు వెళ్ళగల నైపుణ్యం నెహ్రూ, ఇందిరాలకే చెల్లింది. ఇపుడు ఆవంశాంకురమే ఆదివాసుల సమ్మేళనాలకి వస్తున్నాడు, అవసరమయితే ఆయన కేసలాపూర్ దర్బార్‌కుకూడ వెళ్తాడు. రాజీవ్‌రాజాగారు దర్బార్‌కు వెళ్ళకపోతే మరెవరు వెళ్తారు? అడవిలో వేటాడిన ప్రభువుగారు మైదానంలో కొలువుదీరుతాడు, సేదతీరుతాడు, దర్బార్‌చేసి జల్సాచేస్తాడు.

ఈసారి కేసలాపూర్ జాతరను ప్రభుత్వం ఒక తమాషాగా మారుస్తున్నది. నలభైయేభై వేల మంది గోండులు తరలివచ్చే జాతరకు ఈసారి స్వయంగా ముఖ్యమంత్రి వెళ్తున్నాడు. ఇదివరలో కొంరం భీం అమరత్వం తర్వాత హేమన్‌డార్ఫ్ నివేదిక ఆధారంగా నైజాంకాలంలో ఇక్కడ జాతర సందర్భంగా ఏర్పాటయ్యే దర్బార్‌కు గోండులు తరలివచ్చి ప్రభుత్వ అధికారుల ముందు తమ సమస్యలు చెప్పుకునేవారు. ఇది వరకు కనీసం వినేవారు. ఇప్పుడు ప్రభుత్వంలో ఎవరికీ గోండుల సమస్యలు చెవినోకడం లేదు అని హేమన్‌డార్ఫ్ స్వయంగా వాపోయారు.

గిరిజనుల్లో అసంతృప్తి జ్వాలలు, గిరిజనుల సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు, గిరిజనసదస్సు, దర్బార్‌కు ముఖ్యమంత్రి, రాజీవ్‌ల ఆగమనాలు, మంత్రుల, నాయకుల పర్యటనల పేరుతో నిజంగా జరుగుతున్నదేమిటి? 'బందోబస్తు' ఏర్పాట్లు, గోండు గూడాల్లోకి పోలీసు పటాలాల తరలింపు. అడవి మూరుమూలల్లోకి దోపిడీదార్ల, పోలీసుల వాహనాలు సులభంగా వేగంగా చొచ్చుకపోవడానికి రోడ్లువేసే ఆలోచనలు. 'అభివృద్ధి కార్యక్రమం గురించి మాట్లాడే ప్రతివాడు ఆదివాసుల ఆవాసాలకు రోడ్లు వేయాలంటున్నారు. ఆదివాసుల ఆర్థిక జీవనవిధానానికి రోడ్లతోపనిలేదు. రోడ్లు కేవలం వాళ్ళను దోచుకునేవాళ్ళకే రహదారి. ఆదిలాబాదుజిల్లాలో ఏ మేరకు రోడ్లు పడ్డాయో ఆ మేరకు ఆదివాసులు తమ భూమికి తాము కాకుండాపోయారు. తమ జీవన సంస్కృతుల నుంచి తాము పరాయి 'వాళ్ళయిపోయారు'. అని నలభై సంవత్సరాలుగా ఆదివాసుల జీవనస్థితిగతులను అధ్యయనం చేస్తున్న హేమన్‌డార్ఫ్ అన్నారు.

ఆదిలాబాదుజిల్లా ఆదివాసుల్లో ఐక్యమైపోయి విప్లవకారులు, గిరిజన రైతుకూలీ సంఘం పనిచేస్తున్న విషయం ప్రభుత్వానికి తెలుసు. పౌరకలసార్లు ప్రభుత్వంపై గిరిజనుల పక్షాన పీపుల్స్‌వార్ ప్రకటించారని ముఖ్యమంత్రి బెదరిపోయి స్వయంగా చెప్పుకున్నాడు. ఇంద్రవెల్లిలో పోలీసుకాల్పులు జరిగిన కొద్దిరోజులకే పరిసర ప్రాంతాల్లో నూటాయేభై గూడాల్లో గిరిజనులు తునికాకు పోరాటంజరిపి విజయం సాధించిన సంగతి ప్రభుత్వానికి తెలుసు. అందుకే గిరిజన సమస్యల పరిష్కారం పేరుతో అక్కడ ప్రభుత్వం చేస్తున్నదల్లా 'శాంతి భద్రతల' చర్యలే. ఆదిలాబాదు గిరిజన రైతుకూలీ సంఘం అధ్యక్షుడు కామ్రేడ్ పెద్దిరాజును, రైతుకూలీ సంఘం సభ్యులైన మరో పదిమంది గిరిజనులను ఇంద్రవెల్లి సమీపాన 'తిప్ప' అనే గూడెంలో జనవరి ఒకటిన అరెస్టుచేసి ఇప్పటివరకూ ఏ కోర్టులోనూ హాజరుపరచలేదు. కామ్రేడ్

పెద్దిరాజును ఇంద్రవెల్లి కాల్పుల కేసులో ప్రధాన నిందితుడుగా పోలీసులు పేర్కొన్నారు. కనుక ఆయనను పోలీసులు పట్టుకొని కాల్చివేసి వుంటారని అనుకోవడానికి అస్కారమున్నది. రైతాంగంలో, గిరిజన రైతాంగంలో, చైతన్యాన్ని రగిలించి పోరాటానికి సన్నద్ధంచేస్తున్న విప్లవకారులను 'బందిపోటులు'గా, 'హంతకులు'గా చిత్రిస్తున్నది ఈ ప్రభుత్వం. 'భయంకరమైన' 'ప్రమాదకరమైన' వ్యక్తులుగా చిత్రిస్తున్నది.

గిరిజనులను చైతన్యవంతంచేస్తూ, సంఘటితంచేస్తున్న వారిపై, గిరిజనులపై ఒకవంక దమనకాండ కొనసాగిస్తూ మరొకవంక సదస్సులు, దర్బారులు అనే 'పైపూత' కార్యక్రమాన్ని చేపట్టింది ప్రభుత్వం. అయితే నలభైఏళ్ళుగా కేసలాపూర్ జాత్రకు వస్తున్న ఆదివాసులు నలభైఏళ్ళ క్రితం వున్నట్లేలేరు 'రగల్ జెండా' రగిలేజెండాగా ఇంద్రవెల్లి సంఘటనతో రుజువైంది కేసలాపూర్ జాతరా శ్రీకాకుళ జాతరాగా శ్రీకారం చుట్టుకుంటుంది.

11 జనవరి 1982

— సంపాదకుడు

సమీక్షావ్యాసం

గద్దర్ పాటలు, వర్గీస్ పాటలు

భూమితల్లి కడుపుపంట

జె. సి.

శ్రమ ఉత్పత్తి చేసేది సరుకుల్నే కాదు. అది తననూ శ్రామికుణ్ణీగూడ ఒక సరుకుగా ఉత్పత్తి చేస్తుంది. దీన్ని సాధారణంగా సరుకుల్ని ఉత్పత్తి చేసే వేగంతోనే చేస్తుంది.

శ్రమ ఉత్పత్తి చేసిన వస్తువు శ్రమనుండి శ్రమజీవినుండి వేరుపడి స్వయంశీలమైన వస్తువుగా ఒక భౌతిక వాస్తవికతగా మారుతుంది. ఈ వాస్తవీకరణ శ్రమ యొక్క సాఫల్యాన్ని సూచిస్తుంది. ఈ వాస్తవికతకు రూపమే మనకు అవగతమయ్యే భౌతికప్రపంచం. ఈ భౌతిక ప్రపంచం మనిషి పుట్టకముందున్నటువంటిదికాదు. మనిషిపుట్టి తనశ్రమవల్ల భౌతిక వాస్తవికతలో తీసుకువచ్చిన మార్పులు, అనగా నాగరికత, విజ్ఞానశాస్త్రం వంటివి మరియు వాటివల్లకల్గినఫలితాలు. ఇప్పటి సామాజిక ఆర్థికపరిస్థితులు ఆ వాస్తవికతలో భాగాలు.

ఇప్పుడున్న సామాజిక ఆర్థిక పరిస్థితులకు కారణం స్థూలంగాచెప్పాలంటే, భౌతిక వాస్తవికతగామారిన శ్రమరూపాన్ని లేక ఫలితాన్ని స్వంతఆస్తికల్గిన కొద్ది మంది దోచుకోవడమే.

శ్రమజీవి తన ఉత్పత్తికృషిలో భాగంగానే బాహ్యప్రపంచాన్ని, ఇంద్రియానుభూతమయిన ప్రకృతిని తనదిగా చేసుకుంటాడు. అవి అతని శ్రమపరమౌతాయి. ఎంతఎక్కువగా అవిఅతని శ్రమపరమైతే, అంతహెచ్చుగానే అతడు ఉత్పత్తి చేసిన వస్తువుతోబాటు అతనితో విడిపోయి పరాధీనమవుతాయి. అందువల్లనే మార్క్స్ చెప్పినట్లు శ్రమజీవియొక్క పరాధీనత (Alienation or estrnagement) అతని ఉత్పత్తిశక్తి ఎంతఎక్కువైతేఅంతఎక్కువగా పరిణమిస్తుంది.

అయితే ఉత్పత్తిక్రమంలో శ్రమశక్తియొక్కపాత్ర ఏ మోతాదులో ఉంటుందో బాహ్యప్రపంచం, ఇంద్రియానుభూతమయిన ప్రకృతి ఆ మోతాదుతోనే ఉంటాయి. ఈ విధంగా అవి శ్రమజీవిశక్తిలో ఒక భాగమైనప్పటికీ ఉత్పత్తియైన వస్తువుతోబాటు అవీ దూరమౌతాయి.

బాహ్యప్రపంచాన్ని, ఇంద్రియానుభూతమయిన ప్రకృతిని శ్రమజీవి తనశ్రమ శక్తిలోభాగంగా చేసుకొనే మౌలికక్రమంలోనే కవిత్వం ఆవిర్భవించినట్లు చెప్పుకో

వచ్చు. అందువల్లనే కవిత్వంకూడా శ్రమశక్తిలో భాగమే. ఈ మౌలికసూత్రాన్ని తనమాటల్లో క్రిస్టఫర్ కాడ్వెల్ ఈ క్రిందివిధంగా వివరిస్తాడు.

"కవిత్వమనేది స్వభావరీత్యాపాట. ఆపాట సహజంగానే నిర్దిష్టమైన Rhythm ను కట్టి సామూహికంగా పాడబడుతుంది. అందుచేత సామూహిక భావోద్రేకాన్ని (collective emotion) వ్యక్తంచేసే సామర్థ్యం కవిత్వానికుంటుంది. ఇదే "heightened" భాష (కవిత్వం)కున్న రహస్యాల్లో ఒకటి "కవిత్వం స్వభావరీత్యా పాటఅనేది చాలా మౌలికమైనలక్షణం. ఈ లక్షణం ఆదిమజాతుల కవిత్వంలో స్పష్టంగా కన్పించే చారిత్రికసత్యం. అయితే, ఆదిమజాతుల్లో సాముదాయిక భావోద్రేకం యొక్క అవసరమేమిటి? ఏ పులో, శత్రువో, వర్షమో, భూకంపమో పైన బడ్డపుడు అందరూ నైసర్గికంగా నియమితమైన (instinctively conditioned) విధంగానే ప్రవర్తిస్తారు. అందరిలోనూ ప్రమాదం గురించిన భయంకల్గుతుంది. అయితే ఈ రకమయిన సాముదాయిక భావోద్రేకాన్ని ప్రమాదపూరితమయిన సందర్భాల్లో కలిగించడానికి ఏసాధనముయొక్క అవసరమూలేదు. అటువంటపుడు జాతికి జాతే భయవిహ్వలమైన జింకలగుంపుకు మల్లే ప్రవర్తిస్తుంది. కాని చక్షుస్పర్శల నైసర్గిక అనుభవానికి రాకుండా సంభవమయ్యే (Potential) కారణమున్నపుడు అటువంటి సాధనంయొక్క అవసరముంటుంది. జీవశాస్త్రపరిధిలోకిరాని ఆర్థికోద్దేశ్యం సస్యఫలం (Harrest). అటువంటికారణం. పంటసెక్కువగా రాబట్టటంకోసం అందరిలోని నైసర్గికగుణాల్ని ఒక సామాజిక ప్రక్రియద్వారా సన్నద్ధపరచాల్సి ఉంటుంది. ఆ సామాజిక ప్రక్రియలో ప్రధానమైనపాత్రని నిర్వహించేది సామూహిక ఉత్సవం (Group festival) అనే కవిత్వానికి మూలం. అది భావోద్రేకపు నిల్వల్ని వెలికితీసి సాముదాయిక మార్గాన్నిపట్టిస్తుంది. ఈప్రక్రియలో నిజమైనవస్తువు (real object) అయిన సస్యఫలం మొదట ఊహాత్మకవస్తువు. నాట్యం, సంగీతం, పాటదరువులవడి, వేగంలోపడి ప్రస్తుత వాస్తవికతనుండి దూరమయిన (alienated) మనిషి ఊహా ప్రపంచంలోకి విసిరివేయబడతాడు. ప్రస్తుత వాస్తవికతలో సస్యం, అంటేపొలం, ఇంకా నాటబడలేదు. కాని ఊహాప్రపంచంలో అది అద్భుతమైన నిజం. ఇంకా ఉత్కృష్టమైన వాస్తవికత. సంగీతం, పాట ఆగిపోయిన తర్వాతగూడ ఇంకా నాటబడనప్పటికీ అద్భుతప్రపంచంలో ఉత్కృష్ట వాస్తవికతగా నిలచిపోయిన ఆ సస్యఫలం, దాన్ని సాధించేందుకు కావలసిన శ్రమశక్తిని శ్రమజీవికిస్తుంది. ఈవిధంగా శ్రమశక్తియొక్క ఉత్పాదకక్రియలో సాధనమయిన ఒక సామాజిక ప్రక్రియగా ఆవిర్భావం చెందేదే

కవిత్వం దీనికి ప్రధానమయిన లక్షణాలు రెండు: 1. ఇది ముఖ్యంగాపాట 2 ఇది ఒక సామాజిక ప్రక్రియ

ఈ రెండులక్షణాలు మనకీనాడు కన్పించేవి శివసాగర్, గద్దర్, వంగపండు మొదలగు విప్లవకవుల కవితల్లో. అయితే, గద్దర్, వర్గీస్‌ల పాటలగురించి మాట్లాడే ముందు కవిత్వంగురించి ఇంకోమాట చెప్పాల్సిన అవసరం ఉందనుకుంటాను.

శ్రమశక్తి శ్రమశక్తిగా రూపొందేక్రమంలో బాహ్యప్రపంచం, ప్రకృతి ప్రధానపాత్ర వహిస్తాయని అనుకున్నాం. అవి అన్నీ కలిసి శ్రమఫలంగా పరిణమిస్తాయి. శ్రమజీవికీ, శ్రమఫలానికిమధ్య సంబంధం కళాకారుడికీ అతడి సృజనకూ మధ్యగల సంబంధమే అయితే ఆ శ్రమఫలం శ్రమజీవినుండి పరాయీకరణచెందే క్రమంలోనే బాహ్యప్రపంచం, ప్రకృతికూడా శ్రమజీవినుండి పరాకృతమౌతాయి. శ్రమజీవి సంఘజీవి (Species - leup) గా తనచుట్టూఉన్న ప్రపంచం, నాగరికత, ప్రకృతిలో భాగమే, అంటే ఉత్పత్తిక్రమంలోనే తన శ్రమఫలం తననుండి స్వంత ఆస్తి కారణంగా దూరమౌతున్నపుడు శ్రమజీవి తననుండితానే పరాయీకృతమయ్యి పరాధీనమవుతాడు. దీన్నే మార్క్స్ ఈవిధంగాచెప్తారు.

"శ్రమజీవి తన శ్రమశక్తిద్వారా ఎంతఎక్కువగా బాహ్యప్రపంచాన్ని, ఇంద్రియానుభూతమయిన ప్రకృతిని తన అధీనంచేసుకుంటే అంతఎక్కువగా జీవనోపాయాలను (memo of life) రెండు విషయాలలో పోగొట్టుకుంటాడు: ఒకటి, ఇంద్రియానుభూతమైన బాహ్యప్రపంచం తన శమశ్రక్తికి సంబంధించిన వస్తువుగాకుండా పోతుంది. అంటే అది అతని శ్రమ శక్తియొక్క జీవిత సాధనం కాకుండా అవుతుంది. రెండు అతని తక్షణ జీవితావసరాలకు సంబంధించినంతవరకు భౌతిక జీవికగాకుండా పోతుంది."

అంటే శ్రమజీవి ఎంతఎక్కువగా ఉత్పత్తిచేస్తే అంతఎక్కువగా అదనపు విలువ స్వంతఆస్తిపరులకుచెంది, విరామకాలం ఎక్కువగాగల వర్గాన్నిసృష్టించి ఆ వర్గానికి తాను ఉత్పత్తిచేసిన నాగరికప్రపంచాన్ని దత్తంచేసి తానుమాత్రం భుక్తికి కూడా నోచుకోకుండా అయిపోతాడు. ఈ క్రమంలోనే కవిత్వంకూడా అతనినుండి పరాయీకృతమయ్యి అధికారవర్గాలకు ఊడిగంచేసేస్థితి వస్తుందన్నమాట

అయితే ఈవిషయంనుండి తప్పించుకొనే మార్గమేలేదా? అన్న ప్రశ్నవచ్చినపుడు మార్క్సు కమ్యూనిజానికి యిచ్చిన వివరణలను గమనిస్తే సమస్యకు పరిష్కారం లభిస్తుందనిపిస్తుంది: "కమ్యూనిజమంటే మనిషి తనకుతాను పరాయీకరణ చెంద

చెందటానికి కారణమయిన స్వంతఅస్తిని గుణాత్మకంగా అధిగమించడం (Positive transceudente) అనగా మానవసారాంశాన్ని (Human Essence) మనిషిచేత మనిషికొరకు అయత్తం చేసుకోవడం. అంటే, మనిషి ఒక సంఘ (అంటే, మానవ) జీవిగా తనను తాను పూర్తిగా చేసుకొనడం. ఈ పునరాగమనం గడచిన కాలంలో సాధించిన అభివృద్ధిని స్వంతంచేసుకుని ఉన్నత చైతన్యంతో (consciously) జరుగవలసినపని. అప్పుడే ఈ కమ్యూనిజం సంపూర్ణంగా అభివృద్ధిచెందిన ప్రకృతి శాస్త్రంగా (naturalism) మానవధర్మానికి (humanism) సమాన మౌతుంది. సంపూర్ణంగా అభివృద్ధిచెందిన మానవధర్మంగా అది ప్రకృతి శాస్త్రానికి సమాన మౌతుంది. అప్పుడే, మనిషికి ప్రకృతికీమధ్య మరియు మనిషికి మనిషికి మధ్యగల సంఘర్షణ నిజంగా పరిష్కారమౌతుంది." ఈ విధంగా జరిగినప్పుడే కవిత్వం దాని సహజరూపంలో నిజమైన కవిత్వంగా ఆవిర్భావమౌతుంది. శ్రమజీవితో కలిసి శ్రమ ఫలాన్ని అతడినుండి దూరంకాకుండా, ప్రస్తుత నికృష్టసమాజంలో శ్రమజీవి తన నుండి తానుదూరమై అధికారవర్గాల దోపిడిలో నలిగిపోకుండా అంటే, పరాయీకరణ అనబడే ప్రక్రియనుండి బయటపడి బాహ్యప్రపంచంతో, ప్రకృతితో మరల సమతుల్యమైన గతితార్కిక సంబంధాన్ని నిలుపుకొనేందుకు శ్రమజీవికి దోహదపడే కవులే నిజమైనకవులు, అటువంటికవులే గద్దర్ మరియు వర్గీస్‌లు.

శ్రమశక్తి శ్రమజీవినుండి వేరైపోయి విరామాన్ని ఒక జీవితవిధానంగా చేసుకున్న వారిని చేరినప్లే- అంటే శ్రమశక్తి విభజన (division of labour) ఫలితంగానే- కవిత్వం సమాజంలోని కొందరిచేతుల్లో మిగిలిపోయింది. తన సహజ లక్షణాల్నుండి దూరమైపోయి వ్యక్తిగత భావావేశానికీ, కృత్రిమత్వానికీ (Sophistication) ఆలవాలమైపోయింది. అయినా సామాజిక ప్రక్రియఅయిన కవిత్వాన్ని సామాజిక ప్రక్రియే ఐన భాషనుండి వేరుచేయలేం. కనుక సామాజిక ప్రక్రియగా అవి రెండూ శ్రమశక్తితో అవిభాజ్యంగా ఉంటాయి, కనుకనే, ఏ సాహిత్యచరిత్రను పరిశీలించినా- ముఖ్యంగా ఇంగ్లీషుసాహిత్యంలో- సమకాలీన సాహిత్యం వట్టిపోయి నపుడు దాన్ని పునరుజ్జీవింపజేయడంకోసం ప్రజలభాష (living language) వైపు కవులు అరుగుబదాస్తారు- దీనికి ఉదాహరణగా వర్డ్సువర్త్ కవిత్వభాష (diction) విషయంలో లేవదీసిన ఉద్యమాన్ని చెప్పుకోవచ్చు. కాని కేవలం భాషవిషయంలో కవిత్వంలో వచ్చేమార్పులు పైపై మార్పులు మాత్రమే- భాషనూ, కవిత్వాన్ని శ్రమ శక్తి ఉత్పాదకక్రియలోభాగంగా పరిగణించకుండా వాటిలో నిజమైనమార్పు ఎన్నడూ

రాబోదని అనుకోవచ్చు- ఈ విషయంలో గద్దర్, వర్గీస్‌లవంటి కవులయొక్క కృషి సాహిత్యంలో విప్లవాత్మకమార్పులు తీసుకొచ్చింది.

జననాట్యమండలి ప్రచురించిన 'గద్దర్ పాటలు' వర్గీస్ చెప్పినట్లు 'ప్రజా సాహిత్యంలో కొత్త పొరవడికినాంది'। నిజం. అయితే ఆయనే చెప్పినట్లు: "శ్రమతో కూడుకున్న జనజీవితంలో ఆట, పాటకుకూడా స్థానమున్నది: ఒక్కపక్క శ్రమజీవి తన కష్టం మరిచిపోయేందుకు, తమచేస్తున్న పనికి ఊపునిచ్చేందుకు అక్షరాలను, పదాలను కూర్చుకుని, పాటగాపేర్చుకుని రాగం జతజేసి కూనిరాగాలుతీస్తూ ఉంటాడు. మరోపక్క ప్రజలను సంతోషపెట్టే కొన్ని తెగలు కళారూపాలను ఆశ్రయించి బతుకువెళ్ళబోసుకుంటూ ఉంటాయి. ఇలా తమ కళను ప్రదర్శిస్తూ భిక్షం ఎత్తుకొని బ్రతికేవారు ఈ ప్రాంతంలో చాలా మంది ఉన్నారు." కొంత నిజం. కొంత మార్క్సిజం సరిగా అవగాహనకురాని కొంత మంది పశ్చిమదేశాల విమర్శకులు వాక్రుచ్చిన సగం నిజాన్ని వర్గీస్‌గారు తమ మాటల్లో చెప్పారు.

ఉదాహృతమైన ఈ మాటల్లో మొదటి వాక్యంనిజం. రెండవ వాక్యంలో మొదటి భాగం తప్పు. ఎందుకంటే శ్రమజీవికి శ్రమజేయడం కష్టమెప్పుడూగాదు. శ్రమశక్తే శ్రమఫలంగా రూపొందుతుంది. ఈ ఉత్పత్తిక్రియ ముందే జెప్పినట్లు సృజనాత్మకమైంది అది సంతోషాన్నిస్తుంది. కాని శ్రమఫలంగా మారినశ్రమశక్తి ద్వారా తననూ, తన జీవనోపాయాలనూ, భుక్తినీ, సంతోషాన్నీ దూరంచేసుకుంటున్న శ్రమజీవి ఈ పరాయీకరణను మాత్రం కష్టంగా భావిస్తాడు.

సృజనాత్మకమైన ఉత్పత్తిక్రియ పాటకు ఆధారమౌతుంది. అది శ్రమజీవిలో తన శక్తిని గురించిన గర్వాన్ని, ప్రేమనూ, అతిసున్నితమైన భావాలనూ కల్గిస్తుంది. కాని మార్క్స్ చెప్పినట్లు పరాధీనతవల్ల శ్రమయెడల వైముఖ్యం, నిరాశ మొదలగు భావాలు అతనిలో కల్గుతాయి. అయితే, ఉత్పత్తిక్రియలో భాగమైన పాట శ్రమజీవిని రంజింపజేసి, 'ఊపు'నిచ్చి అతని ఉత్పత్తిశక్తిని పెంచడానికి తప్పకుండా సాయ పడ్తుంది. అసలు కవిత్వం యొక్క మౌలికలక్షణం కూడా ఇదేనని ఇదివరకే చెప్పు కున్నాం. అదే విధంగా, పైకొటేషనులోని మూడోవాక్యం సరిగా లేదు. 'కొన్ని తెగలు ప్రజలను తమ పాటల ద్వారా సంతోషపెట్టి తమ బతుకు వెళ్ళబోసుకోడానికి కళారూపాలను ఆశ్రయిస్తాయ'ని చెప్పదల్చుకున్నారు వర్గీస్‌గారు. వాళ్ళు కళా రూపాలను ఆశ్రయించేది బ్రతుకు వెళ్ళబోసుకోడానికా? ప్రజల్ని సంతోషపెట్ట డానికా? సమాధానం స్పష్టమే. కాని ప్రజల్ని సంతోషపెట్టేటటువంటి వాళ్ళు సంతో

షంగా ఉన్నారా? అనుమానాస్పదం. మరి వాళ్లెందుకట్లా చేస్తున్నారు? ఈ ప్రశ్నకు సమాధానం: వాళ్లు సంతోషంగా ఉన్నా లేకపోయినా ప్రజల్ని సంతోషపెట్టి బ్రతుకు వెళ్లబోసుకోవాలి వాళ్ళు' అని. అయితే 'ప్రజలం'టే ఎవరు- ఏ ప్రజల్ని సంతోషపెట్టి? అన్న ప్రశ్నలు ఉదయిస్తాయి. దానికి సమాధానం: తమకు 'భిక్షం'పెట్టే వారిని, అంటే స్వంత ఆస్తిపరులైన ధనవంతుల్ని అని. దీనిఅర్థమేమిటంటే- మానవతను మరిచిపోయి సంపన్నులైన పాలకవర్గాలను కూడా సంతోషపెట్టేంత చేవని శ్రమజీవుల శక్తి నుండి పుట్టిన కళారూపాలు కల్గిఉన్నాయన్నమాట. అందువల్లే ఈ కళారూపాలను గద్దర్, వర్గీస్‌లలాంటివారు ప్రజల మధ్యనుంచి పైకి పుచ్చుకున్నారు.

ఎందుకోసం? శ్రమజీవుల జీవితాలతో పెనవేసుకుపెరిగిన సున్నితమైన భావాలనూ, ప్రేమనూ, గర్వాన్ని ఉత్తేజింపజేసి, వారి వైముఖ్యానికీ, నిరాశకూ కారణాలను ఎత్తిచూపి వాటిని చిత్తుచేసే మనఃస్థైర్యాన్ని కల్గించడంకోసం.

నీ చెమటినుకని చేనుందా!
మేవుచెయ్యని చీజుందా?!

ఈ పదాల్ని గద్దర్‌పాడి, ఆడినపుడు అతడు ఒక కళాకారుడైన గద్దర్ కాడు. శ్రమజీవి గుండెచప్పుడు - 'పోరాటప్రజల గుండె- దప్పులు'. నాట్యం, సంగీతం, కవిత్వాలతో మేళవింపైన శ్రమశక్తికి ఉత్కృష్టస్వరూపం. విప్లవగీతానికి ఆయన వారవడి.

శ్రమజీవికి ప్రధానమైన ఆధారం భూమి- అతడు కర్షకుడైనా, శ్రామికుడైనా, కవైనా భూమి తల్లివంటిది- దానిఒడిలోపుట్టి, పెరిగి, ప్రేమనుపెంచుకుని మాట్లాడం పాడడం నేర్చుకుంటారందరూ. భూమికీ తమకూమధ్యగల నిత్యనూతనమైన సంబంధాన్ని 'హోలీ' పండగ జరుపుకుని హోలీపాటల్లో కీర్తిస్తారు వాళ్ళందరూ. అందుకే వాళ్ళందరితో మమేకమైన యువ విప్లవకారుల్ని జ్ఞాపకం చేసుకోవడానికి గద్దర్ 'హోలీ హోలీలరంగ హోలీ' అని హోలీపాటపాడుతాడు అయితే ఈ విప్లవకారులెవరు?

భూమి, శ్రమల మధ్యగలసంబంధం మానవజీవితాన్ని ఒక తియ్యని అనుభవంగా, ప్రపంచాన్ని ఒక అందమైన పల్లవనంగా మార్చగలది. ఇదే నిత్యనూతనమైన ఉత్పాదకక్రియ- దాని ఉద్దేశ్యం మానవజీవితాన్ని సుఖమయంజేయడం- ఈ కృషిలో శ్రమజీవి నిర్వర్తించేపాత్రను గద్దర్ ఈ ఉత్పాదకక్రియయొక్క అందాన్ని సంతరించుకుని అందులోనేపుట్టిన భాషలో వివరిస్తాడు. 'నడవరో వెంకన్నా నడవరో' అన్న పాటలో:

ముల్లవనం నరికి నరికి
పండ్లవనం జేసినోడ
భూమిని తలకిందుజేసి
బువ్వపంచి యిచ్చినోడ

అంటూ ఈ క్రియలో ప్రకృతి అందాన్ని, నాగరికతా పటిమను యినుమడింప జేయడంకోసం తననుతాను పోగొట్టుకుంటాడు శ్రమజీవి: దుక్కుల మొక్కౌతాడు, మొక్కలకు కొమ్మౌతాడు, కొమ్మకు పువ్వౌతాడు, పువ్వుకు పండౌతాడు అయినా, 'అంతను ఇంతజేసి / గింతకైననోచనోడు- ఆ పండ్లకైన నోచుకోక ... / బతుకుబండి పోయినోడు!' ఎందుకు? అతని శ్రమశక్తి తనకూ తనచుట్టూఉన్న ప్రపంచంలోని తోటి మానవులకూ సమానంగా చెందకుండా స్వంతఆస్తికలిగిన దొరగారిగాదెల్లోకి, భోషాణాల్లోకి చేరిపోవడమే- అంతేగాక ఆ గాదెలకూ, భోషాణాలకు పోలీసోల్లుకాపలా- 'కమ్మరోల్లు కుమ్మరోల్లు / బైండ్లోల్లు బ్యాగరోల్లు / చాకలోల్లు సాలోల్లు / మాలోల్లు మాదిగోల్లు'లాంటి సమస్త శ్రమజీవులూ ఆ దొరకు తమశ్రమశక్తితో ఊడిగంచేయాలి. అయితే ఈ 'దోసుకునే దొరలగుట్టు'ను పూసగుచ్చినట్లు ప్రజలకుజెప్పే వాళ్ళు విప్లవకారులు. ఈ విప్లవకారులు 'ఏతల్లి కడుపు పంట'? అని అడుగుతాడుకవి. వాళ్ళు పెద్దచదువులు చదువుకున్నా పల్లెపల్లెకు దిరిగే వాళ్ళు- మాలపల్లికొచ్చి గంజిదాగేటోల్లు. 'పాలికాపు కందలు' 'రైతుకూలిగుండెలు'. అంటే శ్రమనుండి పరాయివారైపోయే క్రమాన్ని చైతన్యంతో తిప్పికొట్టిన భూమితల్లి కడుపుపంట అయిన శ్రమ మూర్తీభవించిన పాలికాపు కందలువాళ్ళు. వాళ్ళ జీవితాలకు సాఫల్యం శ్రమజీవుల శ్రమసాఫల్యంలోనే. అంటే వారిశ్రమ వారికే దక్కే ఉత్పత్తివిధానాన్ని, అందుకు కావలసిన రాజకీయవ్యవస్థను అనగా కమ్యూనిజాన్ని స్థాపించే ప్రయత్నంలోనే వారిజీవితాలకర్థం. కాని దోసుకునే దొరల కావలికుక్కలయిన పోలీసులు ఊరుకుంటారా? వారు

గన్నులు గురిపెట్టినారు
పిట్టలన్ని ఎగిరినాయి
పావురాలు రాలిపోయె
తూటమీదతూట పేల్చిరోలీ
కెమ్మ కేలీలవోలీ
తూర్పు ఎర్రబారెనమ్మవోలీ
కెమ్మ కేలీలవోలీ

భూమి, శ్రమ, శ్రమజీవి, విప్లవకారుడు, మేధావి, కవి ప్రపంచాన్ని అందంగా తీర్చిదిద్దేక్రమంలో వీరిఐక్యతను ఎంతఅందంగా జెప్పినాడుకవి- ఈ క్రమంలో జరిగేహింసను ఎంత ఉద్బోధకమయిన ప్రతీకల్లో సూచించాడు.

'ఏతల్లి కడుపుపంట' అన్నభావం, భాష జన్మనిచ్చేతల్లినీ, పంటనిచ్చేభూమినీ ఒకటిగావర్ణించి ఆ పంపే మనిషి, ఆ పంచే అతనిశ్రమ అన్న అర్థాన్ని స్ఫురింప జేస్తాయి. ఇంతఅందమైన భావచిత్రిణగల ప్రజలభాషను ఎంతసహజంగా, క్లుప్తంగా కవి పుణికిపుచ్చుకున్నాడో వేరే చెప్పనవసరంలేదు.

శ్రమజీవి తన శ్రమఫలాన్ని యితర శ్రమజీవులతో పంచుకొనజూస్తాడు. దాంట్లోనే అతనికానందం. శ్రమఫలాన్ని తన స్వార్థానికై వినియోగించుకొన జూసే వాడు దోపిడీదారుడు, శ్రమజీవిగాడు. ఈ భావాన్ని 'నాకూలినాఅన్నాలు' అన్నపాటలో గద్దర్ అనన్యసాధ్యంగా జెప్తాడు :

నాకూలినాలన్నాలు
బావుల్ దొవ్వంగో
బావుల్ దొవ్వంగో
బాయి బాయికినేను
బతుకమ్మనాదో
బతుకమ్మనాదో

అంటూ సాగుతుందీకవిత. తన కూలిఅన్నల ఉత్పత్తివిధానంలో ప్రతి శ్రమ జీవీ తనఅన్నల మోటమోటకూ 'దండడు'గా, గట్టుగట్టుకూ 'గన్మ'గా, వారము వారముకు పారగా, దుక్కిదుక్కికి మొక్కగా, కోతకోతకు కొడవలిగా, కట్టకట్టకు పంటగా, కుప్పకుప్పకు రాసిగా, బండిబండికి యిరుసుగానే కాకుండా వారివిప్లవ కార్యాచరణలో కత్తికత్తికీ వోరగా, దండుదండుకు ఎర్రజెండాగా కావాలని ఉంటుంది ఎంత అందమైనఊహ!

గద్దర్ శ్రమజీవులకై ఊహించే ప్రపంచంలో శ్రమజీవితో బాహ్యప్రపంచం, ప్రకృతి వేరైపోదు. అతనికి సూర్యుడూ, చెందురుడూ చుట్టాలు, 'అడవిలో ఎర్ర మల్లె' స్నేహితుడు. 'పెదతోట్ల పెదమల్లె'నెప్పలి ఈవిధంగా వెలుగు, అగ్గి వగైరాలన్నీ (అవన్నీ విప్లవకారులకు గ్రామస్తులకు ప్రతీకలుకూడా) అతనికి కావల సినవాళ్ళే. వాటితో వారితో కలిసిజీవిస్తేనేతప్ప అతనిబ్రతుక్కి అర్థంలేదు.

ఈవిధంగా గద్దర్ శ్రమలో పుట్టి, పెరిగి, శ్రమపట్ల పక్షపాతంగల కవిగా తన కవిత్వాన్ని, పాటను భాషలో, భావనలో, పదచిత్రాల్లో శ్రమ ఉత్పాదక క్రియలో భాగంగా చేసుకున్న శ్రమజీవియైన కవి. ఈయన కవిత్వంలో, పాటలో 'పాసిపోయిన బువ్వ' తిని, 'పాసిపోయిన' జీవితాలు కల తల్లులూ, చెల్లెళ్ళూ, బండి కింద పడిపోయిన బొగ్గు బొగ్గై పోయిన అన్నలూ, మందువిషాలో కల్లు ముంతతో మాత్రమే సరసం ఆడగల బికారీలూ, కండ బలం చూపి కొండల పిండి జేయగల్గినా ఎండలో కాలి 'మాగిన ఉండైన' తనువుల కష్టజీవులతో బాటు ఎర్రెర్రని కొండల్లో గుండెల్లో ఎర్రజెండెత్తిన జగదీషులు, బొగ్గు గుట్టలో బుట్టిన అగ్గి కడుపులో దాచుకున్న శంకరన్నలూ కనిపిస్తారు. ఆవేదన, విషాదాలతో బాటు ఆవేశం, అగ్ని ప్రవాహంగా తన్నుకువస్తాయి. దాదాపు ప్రతి పాటలో స్పష్టమైన సిద్ధాంత బలంతో పాటు లోతైన వాడైన ఆలోచనలు కూడా ఉన్నాయి.

ఇక వర్గీస్ పాటల్లో, 'ఎర్రెర్ర దండాలు', 'అపురబందోడో', 'నగ్జల్‌బరిబిడ్డలం' మొదలగు కవితలు- గద్దర్ పాటల మాదిరిగానే అంతటి భావం, భాష, శ్రమ శక్తుల మేళవింపూ కన్పిస్తుంది. అతని పాటలూ విప్లవ గీతానికి వొరవడి.

గద్దర్ పాటలు, జననాట్యమండలి ప్రచురణ (ఆగస్టు 1981), పేజీలు 84 + xxxvi వెల రు. 3-50 పై.

వర్గీస్ పాటలు, యుగ ప్రచురణలు (సెప్టెంబర్ 1981), పేజీలు 68 + vi, వెల రు. 3-00

పై రెండు పుస్తకాలకు పీస్‌బుక్ సెంటర్, 4-5-421, సుల్తాన్‌బజార్, హైదరాబాద్ 500 001

నలుపు

రామన్న

నలుపంటే నాకెంత ఇష్టమని
నల్లనివంటే నాకెంత గొప్పవని
నలుపంటే చీకట్లూ చింతలూ కావని
నల్లనివంటే అజ్ఞానం అంధకారం కావని
నలుపంటే కలల్ని పండించే నిద్రని
నలుపంటే తనలోంచి ఉదయాల్ని చీల్చి ఇచ్చేదని
నలుపంటే బొగ్గునుండి మండే కోటివోల్టుల వెలుగని
నలుపంటే రత్నాలు వెదజల్లే మెరుపని
నలుపంటే నిజంగా వెన్నెలా మెత్తనని
నలుపంటే మబ్బుకన్నా చల్లనని
నలుపంటే చుక్కల మెరిపించే నేపథ్యమని
నలుపంటే తెల్లని కౌగితంపై మెరిసే సత్యమని
నలుపంటే రక్తాన్ని కదిలించే ధమనులని
నలుపంటే శ్రమజీవుల ఒడలని
నలుపంటే శ్రామికుల వాడలని
నలుపంటే యుగాల అణచివేతను
కన్నెర్రజేసి ఎదిరించే నిగ్రో అని
నలుపంటే పచ్చని పంటలుగా
కమ్మలపండువులా కడుపు నిండుగా
మనని పోషించే పుడమి అని
నలుపంటే ఎప్పుడూ సూర్యునికై తపిస్తూ
తిరిగే అర్ధగోళమని
నలుపంటే తనలో
విద్యుల్లతలు దాచుకున్న కారుమేఘమని
వర్షకాళ్రిమని
నలుపంటే తీయని అమాయకత విచ్చిన కళ్ళని
నలుపంటే నాకెంత ఇష్టమని
నల్లనివంటే నాకెంత గొప్పవని

నిశ్శబ్దశబ్దం

కె. రాంమోహన్‌రాజు

కిరకిరలాడేబళ్లూ, పక్క ఎముకలు తేలినఎడ్లూ
ఎప్పటిలాగే నిశ్శబ్దంగావున్నాయి
గడ్డివామునుంచి రైతుపంజపికేధ్వనీ
మోటబావిమీద యువకునిగొంతులో పాటా
ఊరిపక్క కొండా
కొండమీది ఆదిమ నిశ్శబ్దమూ
కొండమీది అడివంటుకుని
సుళ్లుతిరుగుతూ పైకిలేచేపొగా
అంతా మామూలుగానేవుంది
కొండవెనక ఉదయించిన సూర్యుడు
ఊరిమీద నిటారుగా నిలిచి చూసి
ఏటిగట్టుమీంచి కిందికి జారిపోతూనే వున్నాడు
పంచాయితీ ఆఫీసుపైనా
భూస్వామి ఇనపగేటులోపలా
విద్యుచ్ఛక్తి ఒంటికన్నుకాపలా
కాస్తూనేవున్నది
మట్టిరోడ్డుమీద మొద్దుబళ్ళు
జీవితాలబరువును ఈడుస్తూనేవున్నాయి
పంట కళ్లాలనుంచి సన్‌గ్లాస్ టేబిళ్ళపైకి
బాంకు పాస్‌బుక్కుల్లోకి
ప్రాణావసర వస్తువు ప్రవహిస్తూనేవున్నది
కానీ
వాళ్ళు నిన్నూ మొత్తంసమాజాన్నీ
గమనిస్తున్నారు
ఎముకలుతేలిన దవడలతో
నరాలుతేలిన దండలతోవున్నవాళ్ళు
నాగలికర్రతో నేలతల్లి గుండెతలుపులు
తీసి చూస్తున్నవాళ్ళు

తల్లిదాధల పాటపల్లవికి కోపచలిత
పాదాలఘట్టనతో శృతిని ప్రతిధ్వనిస్తున్నారు
వాళ్ళ తరతరాల జీవనవిధానంలో
పరంపరానుగతమైన శోకం కోపంగామారుతున్నది
ఏటినీరు ఎగువనుంచి విద్యుత్తును మోసుకొస్తున్నది
చిన్నారిచేతులతో అలలు పుడమిచెక్కిళ్ళు తుడుస్తున్నవి
నీకు విషయం అర్థంఅయేసరికి
నేలనుంచి పైకిమొలిచిన పిడికిళ్లు
భూమిమీద హద్దుల్ని బద్దలుకొడతాయి
అప్పుడు నీ కావలికుక్కల విచ్చలవిడితనానికి
గురైనవాళ్ళు రక్తంతో రణగీతం రాస్తారు
ఈ అశ్రుసిక్త నేత్రాలు రేపు మంటల్ని పుట్టిస్తాయి
ఈ క్షతగాత్రులు రేపు యుద్ధరంగంలో మేల్కొంటారు
ఈ విరిగినవేళ్ళు రేపు యుద్ధవ్యూహాన్ని రచిస్తాయి
వాళ్ళజీవితపు విధానమూ, అధ్యయనమూ
అనివార్యమైన అవసరమూ పోరాటం

పోరాటం చేతులకు

సి. ఎచ్. మధు

నా రక్తంతో రాసిన గీతాన్ని అంకితమివ్వాలని
ఎన్నిసార్లు తిరిగాను నీకోసం
నీవు దొరుకవు
రాళ్లెత్తిన కూలీల చెమట, ఆకలిపిల్లవాని అరుపు
గొంతు ఎడారికాగా ఆఖరిచూపు కోపంగా విసిరిన వృద్ధునికనులు
ఒక తుమ్మచెట్టుకింద వేదన పడి పడి పడి ప్రసవించిన తల్లి
ఆకలి రొట్టై పరుగుకాళ్లమీద లాఠీదెబ్బలుపడ్డ తమ్ముడు
రైతు కనురెప్పల మీద నిద్రరాకుండా పహరాకాస్తున్న అప్పులముళ్లు
ఒక నిరుద్యోగి ఆత్మహత్య, ఒక చెల్లె మానభంగం
పాలివ్వలేని ఒక తల్లి కన్నీళ్ళు

చూచి— చూచి— చూచి—
ఏడ్చి— ఏడ్చి— ఏడ్చి—
కళ్లుతెరిచి....
సముద్రం కెరటాలమీద కూర్చుని
తూర్పు సూర్యున్ని చూస్తూ రాసిన నాగీతాన్ని
నీకంకిత మివ్వాలని ఎన్నిసార్లు తిరిగాను నీకోసం
నీవు దొరుకవు
అలలుగా లేచిన విద్యార్థుల మధ్య నీగొంతు వినిపిస్తుంది
శ్రీకాకుళ కొండల్లో సిరిసిల్లా మైదానాల్లో, జగిత్యాలపొలాలలో
నీపాట మోగుతుంది
నగరంలో తిరుగబడిన జనంమధ్య నీకన్నులు కనిపిస్తాయి
ఏదో గుడిసెలో అంబలి తాగుతున్నావని తెల్సి-
నాగీతం అంకిత మివ్వాలని వస్తే-
నీవు వెళ్లిపోతావు
మక్కజొన్న చేను మధ్య రేపటి విప్లవానికి
గీతలు గీస్తున్నావని తెల్సి— వస్తే—
నీవు కనిపించవు
గీతలు— అడుగులు కనిపిస్తాయి
ఉరుములో, మెరుపులో సముద్రంలో లేచిన తుపానులో
కొండనుండి కిందబడుతున్న జలపాతంలో
తిరగబడిన గొంతులో నీవున్నావు—
నాకుతెల్సు
నీవు జనం మధ్య గొంతు, చేతులు, కాళ్ళు కలుపుతూ
పోరాటానికి వేదిక నిర్మిస్తున్నావని
నిన్ను మొన్న జైళ్లోవేసారు
నిన్న కాల్చిచంపారు
ఇవ్వాళ మళ్ళీ అంతటా నీవున్నావు
నా రక్తంతో రాసిన ఈగీతం- ప్రజల కన్నీటి గీతం-
ప్రజల పోరాటగీతం-
నీ అడుగుజాడల్లో రూపుదిద్దుకుంటున్న ఈగీతం
నా గుండెల్లో నా కన్నుల్లో నా అరుపులో నా గీతంలో
నీవున్న ఈగీతం
పోరాటం చేతులకు
అంకితం

సింగరేణికథలు - 4

"విజయం మనదే"

కార్మిక

సాయంకాలపు సందడిలో మార్కెటు కిటకిటలాడుతున్నది. ఆ సందడిలో జారిపోతున్న లాగును మొలతాడు కిందికిదోపి, తొమ్మిదేల్ల నల్లటికుర్రాడు అంతవరకు సంకలోఉన్న కరపత్రాలనుతీసి కనిపించిన మనిషికల్లా యిస్తున్నాడు.

సింగరేణి కార్మిక సమాఖ్యవాళ్ళువేసిన 'కార్మికులారా విజయం మనదే'అన్న ఆ కొత్తకరపత్రాన్ని కార్మికులు ఆప్యాయంగా అందుకొని గుంపులు గుంపులుగాచేరి చదువుకొంటున్నారు- దానిమీద ఎక్కడిగుంపు అక్కడేచేరి చర్చించుకుంటున్నారు.

ఆ సందడిచూస్తుంటే పోలీసులకు పిచ్చెత్తిపోతున్నది- ఎన్ని అరెస్టులుచేసినా ఎంత నిర్బంధముపెట్టినా స్ట్రైక్‌ను ఫెయిల్ చేయలేకపోగా కనీసము నాయకులు అనుకునే వారినైనా అరెస్టు చేయలేకపోయామని పై ఆఫీసర్లకు మంటగాఉంది. కార్మికుల పై పెట్టిన మస్టర్ల కోతచట్టాన్ని విరమించుకుంటూ, కార్మిక సమస్యలను ఒప్పుకుంటూ ప్రభుత్వముచేసుకున్న ఒప్పందాన్ని కార్మికులవిజయంగా చెప్పుతున్న 'కార్మికసమాఖ్య కరపత్రాలుచూసి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మండిపడిపోతూ "కరపత్రాలుపంచె లంజ కొడుకుల్ని పట్టుకరాండ్లి బొక్కలేసి సున్నుసున్నుపొడ్తం"అని ఆర్డరేసిండు.

కాని ఏంప్రయోజనం? ఎక్కడ ముఖ్యులైనవారిని ఒక్కరినికూడ అరెస్టుచేయలేక పోయారు.

అంతభయంలోకూడ కరపత్రాలు పంచబడుతున్నాయి.

సివిల్‌డ్రెస్‌లోఉన్న పోలీసుల నక్కచూపులు మనిషి మనిషిని గుచ్చి గుచ్చి చూస్తున్నాయి.

నల్లటి కుర్రాడింకా కరపత్రాలు పంచుతూనేఉన్నాడు. సివిల్‌డ్రెస్ పోలీసోని నక్కచూపులకు చిక్కుతున్న ఆ కుర్రాన్ని పట్టుకొని కుడిచేత్తో ఒక్కనసుపు చరిచిండు. ఈ హటాత్ పరిణామాన్ని ఊహించని కుర్రాడు చేతిలోని కరపత్రాలు విసురుగా వదిలిండు- బొక్కబోర్లపడి పెదవి కరుచుకున్నాడు- కారేనెత్తురును అంగితోఅద్దుకొని ఏడ్పులంకించుకున్నాడు.

కరపత్రాలను గాలే పంచిపెడుతున్నది.

ఏడుస్తున్న పొల్లగానిచుట్టు పోలీసులు గుమికూడిండ్లు- దూరంగాఉన్న కార్మికులు దగ్గర దగ్గరగా వస్తున్నారు, బొమలుముడేసుకొని.

"ఎక్కడియిరా ఈ కరపత్రాలు" పోలీసాయన పొల్లవాన్ని గల్లపట్టి లేపుతు అడిగింది.

"ఎవరో ఒకాయిన యిచ్చిండు.... పిప్పరమెంట్లుయిస్తా యిది పంచుతావాఅంటె సరెఅన్నా" సన్నగాఏడుస్తూనే జవాబిచ్చిండు.

"ఎవడ్రావాడు సరిగాచెప్పురా లంజ...." లాటీతో పిర్రలమీద ఒక్కటేసిండు.

పిల్లగానిఏడ్పు ఎక్కువైంది- 'ఎవరో ఆయన నాకుతెల్వదు. గాచెట్టుకింద యిచ్చి ఎటోపోయిండు'.

పోలీసాయన ఇంకోరెండు అంటించిండు.

ఏడుపు తారస్థాయి అందుకున్నది.

చుట్టుగుమికూడిన కార్మికులు నోరిప్పారు- "గా పొల్లగాన్ని ఏంకొడ్తానవు.... పొల్లగానికి ఏంఎరుక ఏదో సంబరానికి పంచిఉంటడు-" తెల్లవెంట్రుకల ముసలోడు మందిలకెలి ముందుకొచ్చి అన్నడు.

పోలీసోడు ముసలివానికేసి మింగేసేలా చూసిండు.

'పోనియి- గా పొల్లగానికి ఏం ఎరక' యింకెవలో ఎనుకనుంచి అన్నడు మందిలకెలి.

'జానేదేవోభై'

పోలీసాయన పొల్లగాన్ని వదలిండు.

సన్నగాఏడుస్తూనే ఉన్నాడు పిల్లడింకా 'పోరాపొల్లగా' జనం మాట్లాడుతాండ్లు.

పోలీసోనికి ఎటుతోచలె 'ఇంకోసారి ఇటువంటి పనిచేసేదుంటే మక్కెలిర్గ దంతా పో....' గదమాయించిండు.

పోలీసోల్ల చేతులనుండి బయటపడి మర్రి మర్రి చూసుకుంటా పగిలిన పెదవిని అంగికి అద్దుకుంట, వాచిన చెంపను చేత్తోతుడుచుకుంట.... ఎక్కి ఎక్కి ఏడుస్తు మార్కెటుదాటి కార్మికుల గుడిసెల్లో కల్సిండు.

గుడిసెల్లో అడుగుపెట్టినోడు ఏడుపుబందుపెట్టి పరుగు మొదలుపెట్టి అలా చిన్న సన్న సందులుదాటి గుదిగుచ్చినట్టున్న గుడిసెల్లో మాయమయిండు.

గుడిసెల్లో ఓ గుడిసెముందాగి అటుయిటు చూసిండు. ఎవరులేరని నిర్ధారించుకొని గుడిసెతలుపు కొట్టిండు.

తలుపు తెరుచుకుంది.

'ఏమైంది సత్యం! అప్పుడె కరపత్రాలన్ని పంచావా' పరీక్షగా చూస్తూ అడిగిండతను.

'కొద్దిగన్ని ఉన్నాయనంగా పోలీసోడు గుంజుకున్నడు యింకెమన్నా ఉన్నయా నీల్లటాంకుకెల్లి పంచివస్తా....' ఉత్సాహంగా పలికిండు సత్యం.

గుడ్డిదీపపు వెలుగులో కూడ కందిపోయిన చెంపను, పగిలిన పెదవిని చూసిండ తను .. పరిస్థితి అర్థమైయిింది- అయినా అడిగాడు.

"దెబ్బలెలా తగిలాయి"

'పోలీసోడు కొట్టిండు'. సూటిగాచూస్తూ జవాబిచ్చిండు సత్యం. యిది మామూలే అన్న ధోరణిలో అతని బుర్రలో వేడి. ఆలోచనలు 'సత్యం తండ్రిని అరెష్టుచేసి వారం రోజులైన యింతవరకు అచూకీలేదు. తల్లి రోగిష్టి మంచంలో పడిఉంది... యిప్పుడే కుర్రాడు-' చప్పున అతను ఆకుర్రాన్ని చేతుల్లోకి తీసుకొని ప్రేమగా చేయినొక్కాడు.

ఈ సంఘటనకు కుర్రాడు కాస్త సిగ్గుపడిపోయాడు.

అంతలోకే తలుపుతెరుచుకుని వెంకటయ్య వచ్చిండు. దీపపువెలుగులో అగు పించిన దృశ్యముచూసి "కామ్రేడ్స్! ఏదో మంచికుషిలో ఉన్నట్టుందే" పరిచయ పూర్వకంగా అన్నాడు.

"మన బుల్లికామ్రేడ్ సాహసానికి."

జరిగింది చెప్పాడతను.

అందరు సంతోషంగా మరోనిముషం నవ్వుకున్నారు- సత్యం సాహసానికి.

"కామ్రేడ్ సత్యం! యింక నీవు సెలవుతీస్కో-- రేపు మల్లికలుద్దాం" లాల్ సలామ్ పలికాడతను- అతనిపేరు రాయమల్లు.

చిన్నచెయిని బిగించి తిరిగి లాల్‌సలామ్‌పలికి వెళ్ళిపోయాడు సత్యం.

వెంకటయ్య చెప్పాడు "కామ్రేడ్ సమ్మె విఫలంచెయ్యాలని ప్రయత్నించిన మేనేజ్‌మెంటు విఫలంచేయలేక మన సమస్యలను ఒప్పుకుంట, మనసమ్మెను మొదటినుండి వ్యతిరేకించిన యూనియన్‌వాళ్ళతో ఒప్పందంచేసుకుంది- దీంతో చాలమంది కార్మికుల్లో గంకరగోళ పరిస్థితి ఏర్పడింది. ఈ ఒప్పందంవెనుకఉన్న మేనేజ్‌మెంటు, ప్రభుత్వము ట్రేడ్‌యూనియన్ కుట్రను బహిర్గతం చేయాల్సిఉంది"

"అవును ఈ పరిస్థితిలో వాస్తవాలు తెలియచెప్పేందుకు మనమేసిన కరపత్రం ఒక్కటేసరిపోదు- బహిరంగంగా మనకు మీటింగ్‌పెట్టే అవకాశములేదు- అయినా కార్మికులకు వాస్తవాలేమిటో తెలియచెప్పాలి...." రాయమల్లు.

"అందుకే నేను ఒకటి అనుకుంటున్నాను... మనమే కార్మికుల గుడిసెల్లో వాల్లను పోగుచేసి ఎక్కడికి అక్కడ గుడిసెల్లో వీదిమీటింగ్ పెట్టి చెపుతేసరి" వెంకటయ్య.

"అవును అంతకంటే వేరేమార్గములేదు"

"ఆ ఏర్పాటుకూడ మన మిత్రులకు చెప్పిఉంచాను- మీరు త్వరగా బయలు దేరితే మనమిప్పుడే మన కార్యక్రమాన్ని మొదలుపెట్టవచ్చు" వెంకటయ్య.

"అయితే పద"

ఇద్దరు బయలుదేరారు.

X X X X X X

అప్పటికే చీకటి అలుముకొన్నది- కార్మికులు నివసించే గుడిసెలప్రాంతం చాలయిరుకుగా ఒకగుడిసెనానుకొని యింకోగుడిసె యిలా మొత్తము ఆ ప్రాంతమంతా అల్లుకొనిఉన్నాయి- ఆ చీకట్లో కార్మికవాడ మరీచీకటిగా కనిపిస్తున్నది. అక్కడక్కడ మిణుగురు పురుగుల్లాంటి దీపపుబుడ్డీలకాంతి ఆచీకట్లో మనుషులజాడ తెలుపుతున్నది.

వాడలోని యిరుకైన సందులగుండా నడిచిపోతే కాస్త విశాలమైన స్థలము కనిపిస్తుంది- అక్కడ గుమికూడిన కార్మికులచేతుల్లో కరపత్రాలున్నాయి- కాని ఆ చీకట్లో చదవటం కుదురటంలేదు- పక్కగుడిసెనుండి తెచ్చిన దీపపువెలుగులో యువ కార్మికుడొకడు గట్టిగా చదువుతుంటె చాలమంది వింటున్నారు- చదవటం అయిపోయిన తరువాత అంతవరకు అందరిలోనూఉన్న ఆందోళన, ఉత్సాహం ఒక్క సారిగా మాటల్లోకిమారి వాళ్ళలోవారే వాదులాడుకొంటున్నారు.

"యివ్వాల బాయిమీన్కిపోతే పోలీసోల్లున్నరు. బాయికాడ్కి వచ్చినోల్లను వచ్చినట్టే బాయిలదిగుండ్లని బలవంతం పెట్టిండ్లు- సమ్మె విరమించిండ్లు. బాయిలు నడుస్తానయంటాండ్లు. అంతలోకె హల్లరు నడిపిస్తాండ్లు ఎవలో- కాని దీన్లఏదో మోస ముందని మావోళ్ళందరుకల్సి మాట్లాడుకున్నంక దిగుతము. అంతవరదాన్క దిగేదిలేదని ఎల్లివచ్చినము" ఆరోజు బాయిమీద జర్గిన సంఘటన చెప్పుకొచ్చిండు వీరేశం.

"హల్లరు కంపినివాళ్ళే నడిపిండ్లు- బాయిలు నడుస్తానయి అని నమ్మించడం కోసము వాళ్ళు అట్లచేసిండ్లు" అసలు విషయం బయటపెట్టిండు విఠల్.

"యూనియనోళ్ళ మాటలు నమ్మేతట్టులేదు. ఓసారి చట్టమే పోదనిరి, సుప్రీం కోర్టులపెట్టి కొట్లాడాలనిరి. యిప్పుడు మేమేకొట్లాడి చట్టం తీసేయించినమంటాండ్లు" యూనియన్ వాళ్ళమాటలు అర్థంగాని పోశాలు అన్నడు.

"యూనియనోళ్ళ మాటలంతే.... అంతా బోగమోళ్ళతంతు ఏరోటికాడిపాట ఆరోటికాడ పాడుతరు" చలపతి.

యిలా కార్మికులు ఎవరికితోసింది వాళ్ళు మాట్లాడుకొంటున్నారు. కానిఅందరు ఆత్రంగా ఎవరికోసమో చూస్తున్నట్టుగా ఉన్నది.

అంతలోకి వెంకటయ్య, రాయమల్లు అక్కడికి వచ్చిండ్లు.

వెంకటయ్య అందరి ముందుకొచ్చి "మీటింగ్ మొదలవుతుంది. నిశ్శబ్దంగా ఉండండి" అన్నాడు. అక్కడ గుమిగూడిన కార్మికులంతా ఒకక్షణం నిశ్శబ్దమయ్యారు రాయమల్లు కొద్దిగా ముందుకొచ్చి అందరిని పరీక్షగా ఒక్కసారిచూచి తన ఉపన్యాసాన్ని మొదలుపెట్టాడు.

"కామ్రేడ్స్ చరిత్రాత్మకమైన సింగరేణిసమ్మెను ఎన్నో కష్టనష్టాలకుఓర్చి రెండునెలలు కొనసాగించి విజయం సాధించాము. అయితే మన సంఘటిత శక్తిముందు అటు మేనేజుమెంటు, ప్రభుత్వం యిటు ముప్పయి సంవత్సరాలుగా వేళ్ళు పాతుకపోయిన వ్యాపారం మనస్తత్వముకల్గిన ట్రేడ్‌యూనియన్స్‌కు వ్యతిరేకంగా, బ్రిటిష్ కాలంనాటి కార్మిక వ్యతిరేక చల్లచట్టాలకు వ్యతిరేకంగా యెంతో సాహసంతో పోరాడిన మీఅందరికి నా విప్లవాభినందనాలు."

ఒక్కక్షణం అందరిని పరీక్షగా చూసాడు. దూరంగా ఉన్నవాళ్ళంతా దగ్గర దగ్గరగావచ్చి కూచున్నారు. గుడిసెలముందున్న ఆడవారు, పిల్లలు నిశ్శబ్దంగా మౌనంగా వింటున్నారని కనిపెట్టి మళ్ళీ తన ఉపన్యాసాన్ని కొనసాగించాడు.

"ఎటువంటి పరిస్థితిలో మన మీ సుదీర్ఘమైన సమ్మె పోరాటాన్ని చేపట్టామో మీకు మరోసారి గుర్తుచేయదలిచాను. సుమారుగా ముప్పయినలభై ఏండ్ల నుంచి ముంకి కూపాల్లాంటి గుడిసెల్లో, తాగేందుకు మంచినీళ్ళు, పీల్చేందుకు మంచిగాలి అయినాలేక ఒకపూట తింటె మరోపూట లేకుండా, మన గుడిసెలనుండి ఎంతో దూరంగాఉన్న బావుల్లోకి చీకట్లో పనిలోకి బయలుదేరినోల్లం. మళ్ళీ పెండ్లాంపిల్లలను ఆరోజు చూస్తామోలేదో అన్నబెంగతో మైళ్ళకొద్ది నడిచిపోయి చీకటి గుహల్లాంటి బొగ్గుబావుల్లో మననెత్తురంతా ఒడిపి దినమొకగండంగా బ్రతుకులు వెల్లబుచ్చుతున్నాము."

అవునన్నట్టుగా ముందున్నవాళ్ళంతా తలలు ఊపారు.

"మనమెంత కష్టపడ్డాగాని, ఎన్నిఏండ్లు గడిచినాగాని మన బతుకులో ఎదుగు బొదుగులేకుండా ఉంది. మన రాతిట్లాకాలబడ్డదని సర్దుకపోయి బ్రతుకుదామన్నా

సర్దుకపోలేకుండా ఉంది, నడిచేఎద్దునే ముల్లుతో పొడిచిన తంతుగా ఉంది మన జీవితం. మన పిల్లలకు బళ్ళులేవు, మనకు రోగాలువస్తే చావాల్సిందేతప్ప మందులు దొరకవు, మనకు ఇండ్లులేవు, మన ఆడోళ్ళు నీళ్ళకొరకు రోజూ పోట్లాడుకోక తప్పదు, చివరకు పొయిరాజేసు కోవటానికి యింత బొగ్గుదొరకటం కూడ కష్టమైపోయింది. మనల్ని పట్టించుకునే నాధుడులేడు, ఇప్పుడున్న యూనియన్ వాళ్ళు మనల్ని అడ్డుగాపెట్టుకొని మేనేజ్‌మెంట్‌తో వ్యాపారంచేస్తూ లక్షలు ఆర్జించుకొన్నారు. కల్లబొల్లి మాటలతో మనల్ని ఎప్పటికప్పుడు మోసముచేస్తూపబ్బం గడుపుకొంటున్నారు."

రాడికల్స్ వాళ్ళు వీధిలో మీటింగ్ పెట్టారనితెల్సి పక్కవాడలోనుండి అప్పుడే వచ్చిన కార్మికులు కొందరు దగ్గర దగ్గరగావచ్చి కూచున్నారు.

"మేనేజ్‌మెంట్‌కు మన రక్తం ఎలా పిండుకోవాలో తెల్సుగాని మన మెలా బతుకుతున్నామో అవసరంలేదు. మనలో చాలమందిమి ఈ చుట్టుపక్కల గ్రామాల నుండి వచ్చినవాళ్ళమే. గ్రామాల్లో మన బతుకులుసాగక, ఆరుగాలం కష్టపడ్డాగాని కాలేకడుపునిండక, సావోబతుకోపోయి అబాయిల్నేచద్దామని బాయిపనికివచ్చినోల్లమే. యిక్కడికివస్తే మనబతుకులు బాగుపడ్తయి, పెండ్లాం పిల్లలకు యింత తిండిబొరుకుద్ది అన్న ఆశకొద్దీ కొంపాగోడూ, భూమీపుట్రా అమ్ముకొని యిక్కడ యూనియన్ వాల్లకు లంచాలిచ్చి బాయిపనికి వచ్చినోల్లమే "

గా మాటల మధ్య బక్క ఎంకులులేచి

"అక్కడికొచ్చి ఏం బాపుకున్నం అక్కడెట్లున్నదో యిక్కడ గట్లనే ఉన్నది. అక్కడ భూమిదొరలు సాగనిత్తలేరు. యిక్కడికొస్తే బాయి దొరలు సాగనిత్తలేరు. ఎక్కడికిపోయినా ఒక్కతీర్గనె ఉన్నది" బిగ్గరగా అన్నడు

రాయమల్లుకాస్తఆగి ఎంకులు మాటిని మళ్ళీ చెప్పుకొచ్చిండు. "గా అన్న చెప్పినట్టు గ్రామాల్లో భూస్వాములకు ఎదురునిల్వలేక, బతుకుసాగక మనమెన్ని బాదలు పడ్డామో యిక్కడ అంతకు రెట్టింపుగానే ఉన్నయి. గ్రామాల్లో తినేందుకు తిండి లేకున్న తాగేందుకు యిన్నిమంచినీళ్ళయినా దొరికేవి, పీల్చుకునేందుకు యింత మంచి గాలి అయినా దొరికేది, యిక్కడ తిండేమోగాని తాగేందుకునీళ్ళు దొరకవు, ఒకపూట నల్లవస్తె మరోపూటరాదు, గుదిగుచ్చినట్టుండే మనగుడిసెల్లో బొగ్గుగాలికి ఊపిరిసరిగా ఆడక దగ్గుదమ్ముతో మన ఊపిరితిత్తులు గుల్లయిపోతానయి.... ఏనుగులాంటోళ్ళు పీనుగలైపోతాండ్లు. బయటపరిస్థితి ఈ విధంగా ఉంటే బాయిల పరిస్థితి మరీ అధ్వా

న్నంగా ఉంది. ఏరోజు కారోజు యింటికి తిరిగొస్తామన్న నమ్మకంలేదు. చీకటి పొక్కలటువంటి బొగ్గుబాయిల మైళ్ళకొద్దినడిచిపోయి భూదేవితో భూమి పొరలమధ్య మన రక్తమంతా నీళ్ళుచేసుకొని బొగ్గుబయిటికి తీసుకొస్తం; బాయిలో దాహమేస్తే యిన్ని మంచినీళ్ళు దొరకవు, గాలిసరిగాలేక గర్మిలో ఊపిరిఆడక విలవిల్లాడి అయాస మొచ్చి కూలబడిపోతే మేనేజరు దొరొచ్చి 'పనెందుకు ఆపినవంటడు'గాని మన బాధేందోవాడికి అవసరంలేదు." ఒకక్షణ మాగిండు. అంతలోకే

'ఆ లంజకొడుకులకేమనవసరం? ఏందో గాలిపిట్టోలెవచ్చి చూసిపోయెటోన్కి- మనమెట్లాసత్తేంది? వానిబతుకు బలేసాగుద్దాయే. కంపినికట్టించిన లంకంతయిండ్లు, ఎటుఅంటెఅటు పోయేందుకుకార్లు పెండ్లాంపిల్లలతో ఆయిగుంటడు' బొక్కినోరు ముసలి కార్మికుడు లొడలొడవాగిండు.

"గంతేనా యింటికాడెంతమంది పనోల్లుండాలే? బాయికాడ మస్టరేయించి రోజు కొక్కన్ని పంపుతడు పొల్లగాల్లనెత్తుకునేందుకు, పూలచెట్లు బాగుచేసేందుకు కూర గాయలు తెచ్చేందుకు, సర్వంచేయించుకునేందుకు పనిమనసులుకావాలె, పనిమనసులు" అసహనంగా గొణిగిండు యింకోకార్మికుడు.

"కాస్తాగుండ్లి, మీమాటలేనా చెప్పేదేదో పూర్తిగా చెప్పనీయరా?" గుబురుగా పెరిగిన గడ్డాన్ని గోక్కుంటన్నడు వెనకనిలబడ్డతను.

కార్మికులమాటలు సద్దుమణిగాక రాయమల్లు మళ్ళీ మొదలెట్టాడు.

"కంపినిదొరల బ్రతుకులు బలేగాసాగుతుంటే, చివరికి ఉత్పత్తి పెంచేందుకు ఉపయోగపడే చమ్మాసులు, తట్టలు ఖాళీటబ్బుల సప్లయి సరిగాచేయాలిఅని సమ్మె కట్టాల్సిన అధ్వాన్నస్థితికి మనల్నినెట్టి, నిర్లక్ష్యంగా, విలాసవంతంగా గడుపుతుండ టమే గాకుండా అక్రమలాభార్జనకు కంట్రాక్టర్లతో లాలూచీ, బొగ్గుఅమ్మకంలో లంచాలు అపాయింటుమెంటులో లంచాలుమేసి తెగబలిసిపోయి ఉన్నరు."

"అవును లంజకొడుకులకు కావురాలొచ్చినయి. ఎవని కండ్లగుపిస్తలేవు- కండ్లకు కొవ్వువచ్చింది" మంది మధ్యలో మరెవ్వడోఅన్నడు.

రాయమల్లు మళ్ళీ కొనసాగించాడు "మనబతుకు బాగుపడ్తదని, ఐక్యంగాఉండి మనమొక యూనియన్ పెట్టుకున్నాము- ఆ యూనియన్ల మనతోటి పనిచేసెటోల్లను యూనియన్లకు నాయకులుగా పెట్టుకున్నాము- మనలాగా కార్మికులుగా బతుకుదామని కంపిన్లకువచ్చినోళ్ళే- కానివాళ్ళు మనబతుకులే బాగుచేసేటోండ్లో వాళ్ళబతుకులే బాగు

చేసుకున్నరో చూడుండ్లి, యూనియన్ నాయకులకు గీ కార్లెట్లా వచ్చినాయో, బంగ్లాల మీద బంగ్లాలెట్లా కట్టిండ్లో? మనల్ని ఉద్ధరించేనా? మనల్ని అడ్డుగాపెట్టుకొని మేనేజ మెంటుతో లాలూచీపడి సంపాదించినవికావా ఈ ఆస్తులన్ని?" అడిగాడు కార్మికుల నుద్దేశించి.

'అంతే లంజకొడుకులు అట్లనె సంపాదించిండ్లు- ఏపనికావాలన్నా లంచాలే మింగుడాయె- యింక సంపాదించకుంటె ఏంజేత్తరు' ఒక కార్మికుడు.

"అచ్చంగా అట్లనె సంపాదించిండ్లు అపాయింటుమెంటులో లంచాలు, ఫలానా పనిచేసిపెడ్తే పలానారేటుగా లంచాలు వసూలుచేసిందిచాలక, జీతాలకు, బోనసులకు చందాలు వసూలుచేసుకొని బొంచేస్తాండ్లు.... యిన్నాల్లు మవునంగా మనంభరించాము- యిన్నాల్లు మనల్ని అజ్ఞానంలోఉంచిండ్లు- మన హక్కులేవో బాధ్యతలేవో తెలువకుండా చేసిండ్లు, చివరికి న్యాయమైన లీవుకోసంకూడ మేనేజర్ను కల్సుకోవటానికి భయపడెటట్టు చేసిండ్లు- ఆవిధంగా మన అజ్ఞానాన్ని ఆసరగాచేసుకొని డబ్బులు సంపాదించిండ్లు.

రాయమల్లు ఒక్కక్షణం మౌనంగా పరీక్షించి ఉపన్యాసాన్ని కొనసాగించాడు.

"బాయిలో పరిస్థితులు రోజు రోజుకు మెరుగుపడకపోగా యింకా అధ్వాన్నమై పోతున్నాయి- మేనేజ్‌మెంట్ రోజు రోజుకు మనమీద పనిభారంపెంచి మన రక్తాన్నింకా పిండుకోచూస్తున్నది.

ఈ పరిస్థితి మన సింగరేణిలోనే కాదు దేశవ్యాప్తంగా ఉన్నది, రెక్కలుముక్కలు చేసుకొనేవానికి రోజురోజుకు తిండికరువై పోతున్నది. మన చుట్టుపక్కల పరిస్థితి యిందుకు ఏమాత్రం భిన్నంగా లేదు. గ్రామాల్లో పరిస్థితి మునుపటిలాలేదు, దొరలకు అణిగిమణిగుండేందుకు రైతుకూలీలు యిష్టపడటం లేదు, రైతుకూలి సంఘాలు పెట్టుకొని రాడికల్స్ నాయకత్వంలో దొరల దౌర్జన్యాన్ని ఎదిరిస్తున్నారు. యిదంతా మనం గ్రామాలకు వెళ్ళినప్పుడు చూస్తున్నదే. అయితే మన గ్రామాల్లో మనఅన్నలు తమ్ములు చేస్తున్నపోరాటం చూసి మనం ఉత్తేజితులం అయినాము. వాళ్ళలాగే మనం కూడ సంఘటితపడి మేనేజ్‌మెంట్ మనపై సాగిస్తున్న దోపిడిని, దౌర్జన్యాన్ని ఎదుర్కొనేందుకు సిద్ధమై మన సమస్యల గురించి మనమే దొంగ ట్రేడ్ యూనియన్ల ప్రమేయం లేకుండా ఎప్పుడైతే పోరాటం మొదలుపెట్టామో అటు మేనేజ్‌మెంట్ ఇటు యూనియన్ వాళ్ళ గగ్గోలుపడి మన న్యాయమైన పోరాటాలను అణచడం కోసం

ట్రేడ్‌యూనియన్లు, మేనేజ్‌మెంట్ రెండూ కుమ్మక్కయి రెండు సంవత్సరాలవరకు ఎటువంటి సమ్మెలు చేయమని, సమ్మెచేసే కార్మికులకు మద్దతుయివ్వమని కార్మిక చరిత్రిలోనే అసహ్యకరమైన కార్మిక వ్యతిరేక ఒప్పందం కార్మికులమైన మన ప్రమేయం లేకుండానే AITUC, INTUC నాయకులు చేసుకొని తీరని ద్రోహం చేసారు."

ట్రేడ్ యూనియన్‌లో తిరిగే చలమయ్య ఏదో మాట్లాడుదామని నోరిప్పినోడు మళ్ళెందుకో సర్దుకొనికూచొని చెవులురిక్కించి యింటాండు.

"అయితే ఒక విషయం స్పష్టమైంది. యింతవరకు మేనేజ్‌మెంట్‌కు వ్యతిరేకంగా పోరాడాలి, మేనేజ్‌మెంట్ లంగలు దొంగలు అని తిడ్తున్న యూనియన్ నాయకులు ఎప్పుడైతే మనం నిజంగా పోరాటం చేయడం మొదలుపెట్టామో అప్పుడు వాళ్ళ గుండెలు అగిసంతపనయిపోయి కార్మికులు చెడిపోయిండ్లు. ఎవనిమాట యింటలేరు అంతా నక్సలైట్లయి పోయిండ్లని తిడ్తాండ్లు. యిదంతా చూస్తుంటే నాకోకథగుర్తొస్తాంది. ఎనకటికి ఓ రాజకుమారుడు రాక్షసితోని కొట్లాడుతానని ఎన్నోనేర్చుకున్నాడట. తీరా రాక్షసివచ్చేటాల్లకు గుండాగిసచ్చిండట. అన్నట్లున్నది యూనియన్ వాళ్ళతంతు ... యింతవరకు ముసుగులో గుద్దులాటలాగున్న యూనియన్ విద్రోహం ఈ ఒప్పందంద్వారా మనకు స్పష్టమైంది. రెండోవైపు మేనేజ్‌మెంట్ యూనియన్ వాళ్ళను విదిలిపుచ్చి న్యాయమైన పోరాటాలను అణచడంకోసం బ్రిటిష్‌కాలంనాటి నల్లచట్టాలను మస్టర్ల కోతచట్టాలను కార్మికులపైరుద్ది అణచచూస్తున్నది. అందులో బాగంగానే KK2 బావిలోపనిచేసే కార్మికున్ని నిర్బంధంగా 'మెడికల్‌ఫిట్' చేయు డాన్ని వ్యతిరేకిస్తూ మనంజరిపిన ఒక్కరోజుసమ్మెను పురస్కరించుకొని KK2 కార్మికులమీద ఎనిమిది మస్టర్ల కోతచట్టాన్ని అమలు జరుపచూసింది".

"రాడికల్స్ నాయకత్వంలో మస్టర్ల కోతచట్టానికి వ్యతిరేకంగా పోరాటం మొదలుపెట్టాం. అయితే మేనేజ్‌మెంట్ మిగతాబావుల కార్మికులనుండి KK2 బావి కార్మికులను వేరుచేసి ముందుగా ఏదో ఒకబావిమీద కోతచట్టాన్ని అమలుజరపాలని చూసింది. కానిమనం మందమర్రి డివిజన్‌లోని కార్మికులనేకాకుండా, రామకృష్ణాపురం గోదావరిఖని కార్మికులను 30 వేలమందిని మనం పోరాటక్రమంలో ఏర్పరుచుకున్న విప్లవకర ట్రేడ్‌యూనియన్ అయిన, సింగరేణి కార్మికసమాఖ్య నాయకత్వంలో మస్టర్ల కోతచట్టానికి వ్యతిరేకంగా సమ్మెలోకి తీసుకరాగలిగాం"

రాయమల్లు మాటలమధ్యలోనే ఓ కార్మికుడులేచి ఆవేశంగా 'దాంతో యూనియన్ వాళ్ళు తమఆటలింక సాగయిఅనుకొని బాయిబాయికి, వాడవాడల మీటింగ్‌పెట్టి బాయిలదిగుండ్రీ, మీరు బాయిలదిగుతే మేముకొట్లాడి కోలచట్టాన్ని తీసేయిత్తం అని చెవులిల్లుకట్టుకొని చెప్పిండ్లు- యింకోలీడరోడు గీ చట్టమే తీసెయ్యరు. చట్టంపోవాలంటే పార్లమెంట్లపెట్టి కొట్లాడాలనె, మరోడు రాజ్యం మాచేతుల్లోకివస్తే చట్టం తీసెత్తం ఎన్నికలొచ్చినప్పుడు మాకు ఓట్లువేయండి అనిచెప్పె- యింకొకడు సుప్రీం కోర్టులబెట్టి కొట్లాడాలనె- అందరు దొంగమాటలే చెప్పిరి. అసలుసంగతి ఎవడు చెప్పకపాయె యూనియనోల్ల కొట్లాటలెటువంటియో మనం చూసి చూసి నిరిబడ్డం" అని ముసలికార్మికుడు ముక్కారిసిండు.

"బాయి దొరలుకూడ యూనియనో విత్తిర్గ బాయిలమీద ఉపన్యాసాలిచ్చిరి. మంద మర్రి బాయిలోల్ల మీద చట్టంగాని మీమీద లేదుకదా అని రామకిష్టపురం కార్మికులకు చెప్పిరి. అక్కడ దిగుతాండ్లని యిక్కడ, యిక్కడ దిగుతాండ్లని అక్కడ మాయ మాటలు చెప్పిరి" రామకిష్టాపురం కార్మికుడన్నడు.

కార్మికులమాటలు ముగిసాక రాయమల్లు మళ్ళీతన ఉపన్యాసాన్ని కొనసాగించాడు.

"ఎప్పుడైతె అటు మేనేజ్‌మెంట్, ఇటు యూనియన్లు సమ్మె విరమింపచేయడంలో విఫలమయ్యారో, ఎప్పుడైతే మన సమ్మెవల్ల బొగ్గు కొరతఏర్పడి విద్యుత్ కేంద్రాలు ఆగిపోయాయో, రైల్లు నడవకుండాఅయి సంక్షోభం ఏర్పడిందో. అప్పుడు అంజయ్య ప్రభుత్వం కల్లబొల్లి మాటలు చెప్పుతూ రంగంలోకి దిగింది.... 'అసలు కార్మికులకు సమస్యలే లేవని, యిదంతా తీవ్రవాదులు చేస్తున్నకుట్ర అని ప్రకటనలు చేసాడు' క్రూరమైన నిర్బంధాన్ని అమలుజరిపి వందల సంఖ్యలో అరెస్టులు చేసిండ్లు. పోలీసోల్లకు మైకులిచ్చి "రాడికలోల్లు బెదిరిస్తె మేమున్నాము. మీరు బాయిలదిగుండ్లి" అని వాడవాడల చాటింపులు చేసిండ్లు- బాయిలకాడ పోలీసు బందోబస్తులుచేసిండ్లు.... బలవంతంగా కార్మికులను బావుల్లోకి దించెటందుకు ప్రయత్నించిండ్లు 'కాని కార్మికులు మేం "ఎవరి బెదిరింపులకు భయపడి బాయిల దిగకుండా ఆగుతలేము. మాకు సమస్యలున్నాయి. మా సమస్యల పరిష్కారం కోసం మేం సమ్మెచేస్తున్నాం. మేం బావిలో దిగాలంటే మా సమస్యలు పరిష్కారం కావల్సిందే" నని గట్టిగా చెప్పారు. దాంతో యింకా అరెస్టులు ఎక్కువ చేసారు. రాత్రికి రాత్రి అరెస్టులుచేసి. చిత్రహింసలకు గురిచేసి సింగరేణి కార్మిక సమాఖ్య నాయకులను అరెస్టుచేయాలని చూసారు. అయితే పాశవిక నిర్బంధానికి ఏమాత్రం వెనుకంజవేయకుండా మనం పట్టుదలతో రెండునెలల వరకు కొనసాగించాం."

అందరు మౌనంగా వింటున్నారు.

"చివరికి ఎటుఏగలేక మన సంఘటిత శక్తిముందు ప్రభుత్వం తలవంచక తప్పలేదు. సింగరేణి కార్మిక సమాఖ్య ఏర్పాటుచేసిన ప్రతినిధులతో కార్మికసమస్య లను ఒప్పుకుంటు ఒప్పందం చేసుకోవటం యిష్టంలేక, కార్మికుల్లో సింగరేణి కార్మిక సమాఖ్య వలుకుబడి యింకా పెరిగిపోతుందనే కుట్రతో మన సమ్మెను మొదటినుండి వ్యతిరేకిస్తున్న యూనియన్ నాయకులతో మన సమస్యలను ఒప్పుకుంటు చరిత్రలోనే పరిహాసపదమైన ఒప్పందము చేసుకొన్నది."

"యింకా నలుగొద్దులాగుతే మనతోనే ఒప్పందము చేసుకునెటోల్లు. యిప్పుడు యూనియనోల్లు మేమే సాధించుకొచ్చినమని సిగ్గిడిచి చెపుతాండ్లు అట్లా కాకుండా అయ్యేది" యువకార్మికుడొకడు మందిలకెల్లి అన్నడు.

రాయమల్లు "కాని కామ్రేడ్స్! సుదీర్ఘమైన రెండునెలల పోరాట కాలంలో మన కార్మికులు పడ్డకష్టాలవల్ల చివరికి కోతచట్టాన్ని తీసేసారని తప్ప ఈ యూనియ నోళ్ళు కొట్లాడి తీసెసారన్న భ్రమలు ఎవరికి లేవు. అయితే ఈ ఒక్క పోరాటంతోనే మన కష్టాలన్ని దూరమయ్యాయని కూడ మనం అనుకోవద్దు- కార్మికులను అణచటం కోసం 'సమ్మె నిషేధపు చట్టాలింకా' తయారుచేస్తున్నది ఈ ప్రభుత్వము అయితే ఈ పోరాటం మనం ముందు ముందు జరుపబోయే పోరాటాలకు తర్ఫీదు మాత్రమే అన్న సంగతి మరిచిపోరానిది.

అయితే ఈ పోరాటంలో మన విజయం ఏమిటి? అని ప్రశ్నించుకొంటె పోరాటంలేకుండా మన బతుకులు మారబోవని మరోసారి స్పష్టమైంది, యింతవరకు మన శక్తి ఏమిటో మనకింతవరకు తెలియలేదు.... మనం సంఘటితంగా పోరాడితే ఈ ప్రభుత్వాన్ని మెడలు వంచగలమన్నది మనకీసమ్మెద్వార తెలిసిపోయింది.... అంతేకాదు మన శత్రువులెవరో మిత్రులెవరోకూడ తెల్సిపోయింది- ఇంతవరకు మేనేజ్‌మెంట్‌కి వ్యతిరేకమనుకున్న మనపోరాటం ఒక్క మేనేజ్‌మెంట్‌కేకాదు, దానికి ప్రాతినిధ్యంవహిస్తున్న ప్రభుత్వానికి, యిటు రివిజనిస్టు ట్రేడ్‌యూనియన్లకు కూడా వ్యతిరేకమే అన్నవిషయం స్పష్టమైంది.... అంతిమంగా కార్మికరాజ్యం వచ్చేంతవరకు మనపోరాటం కొనసాగుతూనే ఉంటుంది".

రాయమల్లు చివరిమాటలింకా ముగించకముందే అక్కడ కూచున్న కార్మికుల్లో కలకలం బయలుదేరింది ఎవరో ఉరొంచ్చి 'పోలీసు లత్తాండ్లు' అని అరిచిండు.

పుస్తకపరిచయం :

రక్తాశ్రువులు

డాక్టర్ నార్మన్ బెతూన్ అంటే ప్రపంచపు పశ్చిమదిశనుండి తూర్పుదిశవరకు పరచుకున్న ఒక మహాశక్తి. పేదప్రజలకు వైద్యసహాయం అందించాలనే తహతహకు, ప్రజారోగ్యం ప్రభుత్వబాధ్యతగా ఉండాలనే ఆశయానికి, యుద్ధరంగంలోకి నేరుగావెళ్ళి క్షతగాత్రులకు రక్తంఎక్కించాలనే సాహసానికి, సామ్రాజ్యవాదానికి, ఫాసిజానికి వ్యతిరేకంగా పీడితజాతిచేసే పోరాటంలో గాయపడ్డవాళ్ళకు నిరంతరాయంగా వైద్యసహాయం అందించడంలో తన జీవితాన్నే బలిపెట్టిన త్యాగానికి ఆ పేరు ఒక సంకేతం. బెతూన్‌స్మృతి ఉత్తేజాన్ని కలిగిస్తుంది- పోరాటాన్ని చేయిస్తుంది.

బెతూన్ జీవితం నాలుగుదశల్లో కనిపిస్తుంది- ఒక ఆశయంతో ముందుకుసాగిన జీవితప్రస్థానంలో ఈ నాలుగుదశలు నాలుగుమెట్లు- ఒక్కొక్క మెట్టును అధిగమించడంలో ఆ ఆశయం మరింత స్పష్టమై, కారణాలుతెలిసి, నిబద్ధతపెరిగి, చివరకు పీడితప్రజల విముక్తి పోరాటంలో తనఆశయాన్నీ, జీవితాన్నీ అంతర్భాగాలుగా, చేసుకోవడం కనిపిస్తుంది- బెతూన్ ఆశయమేకాదు, సామాన్యప్రజలకు మేలుచేలే ఏ ఆశయమైనా దానంతట అదినెరవేరదు- ప్రపంచ వ్యాప్తంగా సామ్రాజ్యవాదం, నియంతృత్వం తొలగిపోయి, పీడితప్రజానీకం విముక్తంకావడంలో దానిసాఫల్యం ఉంటుంది.

డాక్టర్లు, మతాచార్యులుఉన్న ఒక సాంప్రదాయిక కుటుంబంలో నార్మన్ బెతూన్ 1890లో జన్మిస్తాడు- సనాతన తత్వవ్యతిరేకి, శాస్త్రజిజ్ఞాసువు అయిన తాత

అంతలోకే పోలీసువ్యానును కార్మికుల గుడిసెలకావలఉన్న రోడ్డుప్రక్క చెట్టు నీడలో ఆపుకొని బిలబిలమంటూ పోలీసులు బూట్లు, లాటీలచప్పుడు చేసుకుంటూ గుడిసెలముందుకొచ్చి ఆగిండ్లు- గుడిగుచ్చినట్లున్న కార్మికులగుడిసెల్లో ఒక్కరుతప్ప జంటగా వెళ్లటానికి వీలులేకుండాఉన్న యిరుకైనసందులగుండా ముందుకెళ్ళాలంటే భయంతోఆగిన జవాన్లను వెనకనుండి "ముందుకు నడువు"మంటు ఆర్డరు జారీచేసి సర్కిలు ఇన్‌స్పెక్టర్, ఇద్దరు సబ్-ఇన్‌స్పెక్టర్లతో వెనకనడిచి యిరుకు సందులగుండా లోనికొచ్చారు.

కాని కొద్దిక్షణాలకింద జనంతో కిటకిటలాడిన వీధిలో, చీకటిరాజ్యమేలుతున్నది ... వీధులు నిర్మానుష్యమైనాయి- వీధికుక్కలు పోలీసులకేసి అదేపనిగా మొరుగుతున్నాయి.

(సమ్మె అయితే ముగిసింది కాని పోరాటమింకా కొనసాగుతూనేఉన్నది.)

గారు బెతూన్ ఒకలక్ష్యాన్ని ఏర్పరచుకోవడానికి కారణం. కాలేజీచదువులరోజుల్లో డార్విన్ పరిణామసిద్ధాంతాన్ని అధ్యయనం చేసాడు. విశ్వవిద్యాలయంలో చదవడానికి అవసరమైన డబ్బుకోసం కాయకష్టంచేసాడు. అప్పుడే చిత్రకళమీద ఆసక్తి ఏర్పడింది. జీవితంమీద లాలసపెరిగింది. యవ్వనం ఉత్తేజాన్ని కలిగించింది. సరిగ్గా అదేసమయానికి యువతరం ఆశలనన్నింటిని భగ్నంచేస్తూ దూసుకువచ్చిన మొదటి ప్రపంచయుద్ధం బెతూన్ జీవితానికి మేలుజేచేసింది. అప్పటికి బెతూన్‌కు 24 ఏళ్ళు. ఎం. డి. ఇంకా పూర్తికాలేదు. చిన్నప్పటినుంచి అలవర్చుకున్న సాహసవృత్తితో వెంటనే సైన్యంలోచేరి స్ట్రెచర్ మోసేవాడుగా కెనడానుండి ఫ్రాన్స్ వెళ్ళాడు తుపాకీ దెబ్బతిని ఇంటికిరావడానికిముందు యుద్ధంలో వ్యర్థప్రాణార్పణను, మానవ సంహారాన్ని చూసాడు. ఈ మానవ మారణహోమంపట్ల అతనికప్పుడే విముఖత ఏర్పడింది.

యుద్ధం ముగిసినతరువాత ఇంగ్లండువెళ్ళి సర్జరీనేర్చుకొని, అమెరికాలోని డెట్రాయిట్ పారిశ్రామికనగరంలో ప్రాక్టీసుపెట్టిన తరువాత డబ్బులేక వైద్యంచేయించుకోనివారు ఎంతోమంది ఉన్నారని, వారికే తనఅవసరం ఎక్కువగాఉందని అనుకుంటాడు. డాక్టర్లలోఉన్న వ్యాపారసరళిపట్ల అసహ్యంకలుగుతుంది.

ఇంతలో బెతూన్‌కు క్షయవ్యాధిసోకి ట్రూడో శానిటోరియంలో చికిత్స పొందుతూ చావుకు రోజులులెక్కబెట్టుకుంటున్న రోజుల్లో డాక్టర్ జాన్ అలెగ్జాండర్ రాసిన వైద్యగ్రంథంలో ఉరఃకుహర శస్త్రచికిత్సద్వారా క్షయవ్యాధిని నిర్మూలించవచ్చునని చదివాడు. ఆ శస్త్రచికిత్సను చేసే ఖ్నలేక వేలకొద్దిమంది చనిపోతున్న కాలంలో బెతూన్ ధైర్యంగా ఆపరేషన్ చేయించుకొని, ఒక ఊపిరితిత్తిని స్తంభింపజేసి, వ్యాధిని నయంచేసుకుంటాడు.

ఆ విధంగా మృత్యుముఖం నుండి బయటకు వచ్చిన బెతూన్ శ్వాసకోశ సర్జన్ కావడానికి రెండేళ్లు కఠోరంగా పరిశ్రమించి, కెనడాలో ఉద్యోగంచేసి, చివరకు 1934లో అమెరికాలోకెల్లా పెద్ద ఆస్పత్రుల్లో ఒకదానిలో ఉరఃకుహరశాస్త్ర చికిత్సా విభాగాధిపతి అవుతాడు. తాత్కాలికమైన ఈ ఉద్యోగంపోయి మరొక ఉద్యోగం దొరుకుతుంది. ప్రపంచమంతటా ఆర్థికమాంద్యం, నిరుద్యోగం వ్యాపిస్తాయి దారిద్ర్యం పెరుగుతుంది. ఒకవైపు చికిత్సా విధానం ముందుకుపోతుంటే మరొకవైపు క్షయరోగుల సంఖ్య పెరుగుతున్నది. ఈ వైరుధ్యాన్నిగూర్చి ఆలోచించినప్పుడు అతడు మరొక వైరుధ్యం గమనిస్తాడు. "కోట్లాది జనానికి కట్ట బట్టలేదు. అయినా అమెరికాలో పండినపత్తి చేలను దున్ని పారేస్తున్నారు. కోట్లాది జనానికి తిన తిండి లేదు. కెనడా తన గోధుమనిల్వల్ని తగలబెట్టేస్తోంది...."

తాను చికిత్సచేస్తున్న రోగి చనిపోతే తన శరీరంలో ఒకభాగం పోయినట్లుగా బాధపడే బెతూన్ పేదలపట్లఉన్న ఆవేదనతో వారిదగ్గరికేవెళ్ళి చికిత్సచేయాలని నిర్ణయించుకుని, వాళ్ళను ఆదుకోవడం ఒక వ్యసనంగా చేసుకుంటాడు. 1935 లో ఒక వైద్యసదస్సులో పాల్గొనడానికి రష్యావెళ్ళి అక్కడ ఆచరణలో ఉన్న "సోషలైజ్డ మెడిసన్" కార్యక్రమాన్ని పరిశీలిస్తాడు. తాను ఎంతో కాలంగా ప్రయత్నిస్తున్న వ్యాధినిరోధక చర్యలు, జబ్బునయమై బయటకువచ్చేవారికి పునరావాస కార్యక్రమాలు అక్కడ భారీఎత్తున కొనసాగుతున్నాయి. అక్కడ పొందిన ఉత్తేజంతో ప్రజారోగ్య కార్యక్రమాన్ని ఒకదాన్ని తయారుచేసి, ప్రజారోగ్యాన్ని ప్రభుత్వం తన బాధ్యతగా స్వీకరించాలని మాంట్రియల్‌లో సంచలనం కలిగించాడు.

అప్పుడు స్పెయిన్‌లో ప్రజాస్వామ్యరక్షణ కోసం అంతర్యుద్ధం జరుగుతున్నది. బెతూన్ అంగీకరించినట్లయితే అతని నాయకత్వంలో ఒకవైద్య సహాయబృందాన్ని మాడ్రిడ్‌కు పంపడానికి సిద్ధంగా ఉన్నట్లు స్పానిష్ ప్రజాస్వామ్య సహాయ కమిటీ తెలియజేసింది. అప్పుడు బెతూన్ ముందు హోదాగల, సుఖమయమయిన జీవితం ఉంది స్పెయిన్‌కు వెళ్ళడమంటేపేరు, ప్రతిష్ట, ఆర్జన, అన్నింటిలో ఉన్నతస్థాయికి చేరుకున్న జీవితాన్ని కాలదన్నడమే. అయినా అతడు స్పెయిన్‌కు వెళ్ళడానికే నిర్ణయించుకున్నాడు.

స్పెయిన్‌కు వెళ్ళిన తరువాత బెతూన్ అక్కడ క్షతగాత్రులకు అందుతున్న వైద్యచికిత్సను పరిశీలించి, రక్తస్రావంవల్ల, ఆలస్యంగా చికిత్స జరగడంవల్ల ఎక్కువమంది చనిపోతున్నట్లుగా గ్రహించాడు. వెంటనే బెతూన్ యుద్ధరంగంలోనో, దానికి దరిదాపుల్లోనో క్షతగాత్రులకు రక్తం ఎక్కించే సదుపాయం ద్వారా మరణాల సంఖ్య తగ్గించాలనే ప్రతిపాదనను చేసి దాన్ని అమలుపరుస్తాడు ఆ విధంగా యుద్ధరంగంలో గాయపడినవారికి చికిత్స చేయడంలో ఒక నూతనశకం ఆరంభమైంది.

బెతూన్ త్వరలోనే స్వదేశానికి పోవలసివస్తుంది ఇటలీ, జర్మనీలు, ఫ్రాంకోకు మద్దతుగా ఆయుధాలనూ, సైనికులనూ పంపిస్తున్నాయి. స్పానిష్ రిపబ్లిక్ సైన్యానికి తగినంత ఆయుధ సామగ్రిలేదు. అమెరికా తన ఆంక్షల్ని తొలగించి రిపబ్లిక్ సైన్యానికి సహాయంచేయాలి. అందుకు అమెరికా, కెనడాల్లో పర్యటించి స్పెయిన్ పరిస్థితిని వివరించవలసిన బాధ్యత బెతూన్‌కు అప్పగించబడింది. ఆ బాధ్యతను నెరవేర్చడం కోసం బెతూన్ అమెరికా, కెనడాల్లో 7 నెలలపాటు పర్యటించి ఉపన్యాసాలిస్తాడు

అంతలో చైనామీద జపాన్ దాడిచేసిన ఉదంతం చదువుతాడు. చైనా నగరాల మీద జపాన్ బాంబుదాడులు అతనికి స్పెయిన్‌లోని మాడ్రిడ్, అల్మెరియాలను గుర్తుకు తెస్తాయి. "స్పెయిన్, చైనాలు ఒకే యుద్ధంలో భాగం" అని గ్రహించిన బెతూన్ చైనాకు వెళ్లాలని నిర్ణయించుకుంటాడు. కమ్యూనిస్టు పార్టీలో చేరుతాడు. ఉత్తర చైనాలో జపాన్‌కు వ్యతిరేకంగా పోరాడుతున్న గెరిల్లాలకు వైద్య సహాయాన్ని అందించడానికి న్యూయార్క్‌లో ఏర్పడిన చైనా సహాయసమితి మదాంసన్ - యట్-సేన్ నాయకత్వంలోని చైనా రక్షణలీగుతో కలిపి నిర్వహింపబడుతున్నది.

1911 లో మంచూ రాచరికాన్ని తుదముట్టించి డా॥ సన్-యట్-సేన్ నాయకత్వాన చైనారిపబ్లిక్ అవతరిస్తుంది. 1925 లో సన్-యన్-సేన్ మరణం తరువాత చాంగ్-కై-షేక్ నాయకత్వంలోని కొమింటాంగు దళాలకు, కమ్యూనిస్టులకు మధ్య అంతర్యుద్ధం జరుగుతున్న కాలంలో జపాన్ మంచూరియా మీద దాడిచేసి, వశపరుచుకుని, అక్కడ ఒక కీలుబొమ్మ ప్రభుత్వాన్ని స్థాపిస్తుంది. కమ్యూనిస్టులను తుదముట్టించడానికి చాంగ్ 10 లక్షలసైన్యాన్ని సమీకరించినప్పుడు ఈదాడుల్ని త్రిప్పికొట్టడానికి, జపాన్ దురాక్రమణకు వ్యతిరేకంగా సైనికచర్య తీసుకోవడానికి కమ్యూనిస్టు సైన్యాలను కియాంగ్సీ నుండిషెన్‌సీ రాష్ట్రానికి తరలించాలని మావో ఒక ఎత్తుగడ వేసాడు. రెండింటికి మధ్య 8 వేలమైళ్ళ చుట్టుదారిని 30 వేలమంది కాకలు తీరిన యోధులు మావో, చూటేల నాయకత్వంలో బయలుదేరి అధిగమించి చిన్-చా-చీ అనే సైనిక మండలాన్ని ఏర్పాటుచేస్తారు. చరిత్ర ప్రసిద్ధమైన ఈ లాంగ్ మార్చ్ 1934-35 లలో జరిగింది. ఇక్కడ తన సహాయాన్ని అందించడానికి బెతూన్ 1938 జనవరిలో హాంగ్‌కాంగ్ చేరతాడు.

బెతూన్ మావోను కలుసుకున్నప్పుడు స్పెయిన్‌లో తనకున్న అనుభవంతో యుద్ధరంగానికి దగ్గరగా సంచారక శస్త్రచికిత్సా దళాలను ఏర్పాటుచేసి, క్షతగాత్రులకు వెంటనే చికిత్సజరిపితే 75% మంది కోలుకుంటారని అంటాడు. ఒకరిద్దరికంటే ఎక్కువగా బతకనిస్థితితో దీన్ని పోల్చిచూసి మావోవెంటనే తన అంగీకారాన్ని తెలియజేస్తాడు. కాని అక్కడ అప్పటికి వైద్యచికిత్స దయనీయమైన స్థితిలోఉం పాశ్చాత్య దేశాల ప్రమాణాలతో పోల్చిచూసినపుడు అక్కడ సైనిక వైద్యశాఖ దాదాపుమృగ్యం, సిబ్బందిలేదు, మందులులేవు, ఆధునిక వైద్య పరికరాలులేవు- ఈ పరిస్థితుల్లో బెతూన్ తనపనిని ప్రారంభించాలి. అతడు చిన్-చా-చీ సైనిక మండల వైద్య సలహాదారుగా నియమింపబడి షెంగ్-యిన్-కౌ అనే గ్రామంలో ఆదర్శ చికిత్సాలయాన్ని రూపొం

దిస్తాడు. డాక్టర్లనూ, నర్సులనూ తయారు చేయడానికి స్కూలు ప్రారంభిస్తాడు. అందులో బోధించడానికి ఒక వైద్యగ్రంథం తయారుచేస్తాడు. చిన్-చా-చీ ప్రభుత్వం దానిని ప్రచురిస్తుంది. గెరిల్లాయుద్ధంకోసం ప్రపంచంలో మొట్టమొదట ప్రచురింప బడిన సంక్షిప్త వైద్యగ్రంథంఅది. ఎన్నడూ చూడనందువల్ల ఏదో అజ్ఞాతకారణం వల్ల రక్తదానం చేయడానికి ఎవరూ ముందుకురానప్పుడు, రక్తంఇవ్వడం, ఎక్కించడం ఎంతసులువో, ఎంత నిరపాయకరమో, శత్రువుతో పోరాడే సైనికున్ని అది ఎట్లా కాపాడుతుందో ప్రత్యక్షంగా తన శరీరంనుండి రక్తం ఇవ్వడంద్వారా వారి భయాన్ని పోగొట్టి, బెతూన్ చైనాలో మొట్టమొదటిసారి రక్తదాతలజట్టును తయారు చేస్తాడు. "కమ్యూనిజాన్ని ఒక జీవితవిధానంగా భావించి జీవించే ప్రజలమధ్యవుంటూ ఆ ప్రజలతో కలిసిపనిచేసే ఒక మహాఅదృష్టం" తనకు లభించినందువల్ల తదేకదీక్షతో నిర్విరామంగా క్షతగాత్రులకు చికిత్సచేయడం ప్రారంభించాడు. రోజుకు 10, 20 అపరేషన్లుకాదు, ఒకప్పుడు నిర్విరామంగా 40 గంటలు పనిచేసి సుమారు 70 ఆపరేషన్లు చేసాడు. ఎంతసేపటివరకు క్షతగాత్రులు యుద్ధరంగంనుండి వస్తుంటారో అంతసేపటివరకూ నిర్విరామంగా చికిత్సచేయడం అతనిధ్యేయం.

యుద్ధరంగంలోకి నేరుగావెళ్ళి పనిచేయడానికి అతడు కొన్నిసంచార చికిత్సా దళాలను ఏర్పాటుచేసాడు. వాళ్ళకు అతడు ఇచ్చిన నినాదం "డాక్టర్స్! గాయపడ్డ వాళ్ళదగ్గరకు మీరేవెళ్ళండి. గాయపడ్డవాళ్ళు మీదగ్గరకు వొచ్చేదాకా ఆగకండి" గెరిల్లా వైద్యచికిత్సా విభాగంలో గొప్పఉత్తేజాన్ని కలిగించిన ఈ నినాదంతో అతడు వైద్యసదుపాయాన్ని నేరుగా యుద్ధరంగంలోకి తీసుకువెళ్ళాడు. రెండు కంచర గాడిదలమీద 100 ఆపరేషన్లకు సరిపడే ఫీల్డు ఆస్పత్రిసరంజామా తీసుకుపోవడం ద్వారా రవాణాసౌకర్యపు సమస్యను పరిష్కరించగలిగాడు. నిద్రకు, ఆహారానికి వెలియై యంత్రంలాగాపనిచేస్తూ బెతూన్ క్షతగాత్రులకు చికిత్సచేసి మళ్ళీ యుద్ధరంగంలోకి పంపడంవలన, "శత్రువును చితగ్గొట్టండి కామ్రేడ్స్, గాయపడ్డవాళ్ళని బాగుచేయటానికి బెతూన్ ఇక్కడున్నాడు" అన్నది యుద్ధరంగంలో ఒకనినాదమై గెరిల్లాలకు తిరుగులేని ధైర్యసాహసాలను, ఉత్సాహాన్ని ఇవ్వగలిగింది. ఈ మానవ సేవలో అతడు బయటిప్రపంచాన్ని పూర్తిగా మరచిపోయాడు. షెంగ్-యిన్-కౌలో బెతూన్ నెలకొల్పిన ఆదర్శ చికిత్సాలయాన్ని శత్రువు ధ్వంసంచేయగా పశ్చిమహోపే రైతాంగం శత్రుదాడులకు గురికాకుండా కొండనుతొలచి, గుహలనునిర్మించి ఆదర్శ చికిత్సాలయాన్ని నెలకొల్పుతుంది.

ఒకవైపు ఉచ్చులో బిగించి నలిపివేయాలనుకుంటున్న శత్రుప్రయత్నాలను వమ్ముచేసి ప్రజలనేనీటిలో గెరిల్లాలనే చేపలుతప్పించుకొని శత్రువును చీకాకు పరుస్తుంటే, మరోవైపు బెతూన్ యాంటీసెప్టిక్ మందులు, గాయాలకు కట్టేగుడ్డలు, క్లోరోఫాం లేనిస్థితిలోకూడా ఆపరేషన్లు చేయవలసివచ్చింది. అమెరికాలోని చైనా సహాయకసంఘంనుండి అనుకున్నవిధంగా డబ్బుగాని, మందులుగాని చేరడంలేదు. వైద్యసిబ్బంది కొరత ఎలాగూఉన్నదే. ఈ పరిస్థితుల్లో బెతూన్ భావివైద్యావసరాలను తీర్చే పంచవర్షప్రణాళికను ఒకదానిని తయారుచేసాడు. గెరిల్లాయుద్ధరంగంలో వైద్యచికిత్సమీద ఒకగ్రంథాన్ని రాసాడు. పంచవర్షప్రణాళికను అమలులో పెట్టడానికి 50 వేలడాలర్లు కావాలి. అంతడబ్బుసేకరించి మందులతో, డాక్టర్లతో తిరిగి రావడానికి బెతూన్ అమెరికా, కెనడాల్లో పర్యటించాలని నిర్ణయించబడింది. కాని జపాన్ సైన్యం పెద్దయెత్తున, హఠాత్తుగా చిన్-చా-చీ-మండలంమీద దాడిచేసినందు వలన ప్రయాణం వాయిదాపడింది. ఈ సమయంలోనే బెతూన్ కుడిచెవి పనిచేయడం మానివేస్తుంది.

చుక్కల శిఖరానికి దగ్గరలో ఒక కుగ్రామంలో బెతూన్ చికిత్స చేస్తుండగా శత్రుసైన్యం ఆగ్రామంవైపువస్తూ ఉంటుంది. శత్రుసైన్యం గ్రామాన్ని చేరేలోపున మిగిలిన 10 మందికి కూడా చికిత్సచేసి రోగులతోసహా గ్రామాన్ని ఖాళీచేయాలని బెతూన్ అనుకుంటాడు రబ్బరుతొడుగు లేకుండా ఆపరేషన్ చేస్తున్న ఆ తొందరలో అతని ఎడమచేతివేలుతెగి, వాచి, సెప్టికోమియా (ధనుర్వాతం)వల్ల క్రమంగా రక్తం విషపూరితం అవుతుంది. చికిత్స చేయడానికి తగినమందులు చైనాలోలేవు. అతన్ని పచ్చరాయిపల్లెకు తరలిస్తాడు. అక్కడ మరణశయ్య నుంచి కూడ బెతూన్ వైద్య సలహాలుఇస్తూ 1939 నవంబరు 13వ తేదీ ఉదయం మరణిస్తాడు. ఇది అతనికి రెండవ మరణం. ఒకసారి ఊపిరితిత్తి క్షయవ్యాధితో మృత్యుముఖం నుండి బయటకు వచ్చిన బెతూన్ కమ్యూనిజం స్థాపనకోసం మానవజాతి సాగిస్తున్న పోరాటంలో భాగస్వాముడై, పీడితమానవాళి కోసం సేవచేస్తూ మరణించాడు. "ఆయన యీ రెండవ మరణాన్ని గురించి విలపించటానికి చాలినన్ని కన్నీళ్ళు చైనా మొత్తంలో లేవు." బెతూన్ జ్ఞాపకార్థం సైనికులు, కళాకారులు, రైతాంగం కలిసి తూర్పుషాన్సీలోని ఒక లోయలో సంవత్సరంపాటు శ్రమించి ఒక సమాధిని నిర్మిస్తారు. బెతూన్ మరణం సంభవించిన రోజున ప్రతి సంవత్సరం ఆ సమాధిని దర్శించడానికి అశేష చైనా ప్రజానీకంవచ్చి "తమ సోదరులు నేలకొరిగిన పోరాటం గురించి, బెతూన్ పేరు రణనినాదమై మార్మోగిన పోరాటం గురించి మళ్ళీ వింటారు".

"మేం స్వతంత్రం కావటానికి సహాయపడ్డ వాళ్ళలో ఆయన ఒకరు." అని మదాం సన్-యట్-సెన్ బెతూన్‌ను ఉద్దేశించి అన్నమాటల్లో మొత్తం చైనా ప్రజల వాణి వినిపిస్తుంది. తన అంతర్జాతీయతా చైతన్యంతో కమ్యూనిజం అనే ఆదర్శాన్ని సాధించడం కోసం భాష తెలియని సుదూరదేశంలో, అపరిచితమైన ప్రజల మధ్య, సంస్కృతి మధ్య ఉంటూ ప్రపంచంలో దోపిడీని, అణచివేతను అంతిమంగా తొలగించడంకోసం, ప్రజలందరూ సుఖశాంతులు పొందడం కోసం జరుగుతున్న పోరాటంలో అసువులు పీడినవాడు బెతూన్. బెతూన్ తన కోసం బరువైన పనులను, బాధ్యతలను ఉంచుకొని, వాటిని సక్రమంగా నెరవేర్చిన దీక్షాబద్ధుడైన, ఉదాత్తుడైన కమ్యూనిస్టు. ఆపరేషన్ చేయడానికి ఉపయోగించే కత్తిని దోపిడీకి, అణచివేతకు వ్యతిరేకంగాజరిపే పోరాటంలో శత్రువుమీద ఎత్తిన ఖడ్గంలా ఉపయోగించినవాడు బెతూన్. ఆయన మరణం ప్రగాఢమైన దుఃఖాన్ని కలిగిస్తున్నదంటే ఆయన సేవా దీక్ష చైనా ప్రజలను గాఢంగా ఉత్తేజితం చేసిందనడానికి అది ఒక గుర్తు.

పేద ప్రజల ఆరోగ్యాన్ని ప్రభుత్వం తన బాధ్యతగా స్వీకరించాలని కెనడా, అమెరికాల్లో అతడు కలిగించిన సంచలనం, ప్రజాస్వామ్యరక్షణ కోసం స్పెయిన్‌లో అతడు చేసిన సేవ, కమ్యూనిజం లక్ష్యసాధనకోసం చైనాలో అతడు చేసిన త్యాగం ఉదాత్తమైన ఆశయాన్ని కలిగిఉండడానికి, ఆశయసాధనకు పోరాడడానికి ఒకవైపు ప్రేరేపిస్తుండగా, ఫ్రాన్సిస్‌ను వివాహమాడిన తరువాత అతని వైవాహిక జీవితం, ఆదంపతుల అనురాగం, వారిమధ్య చెలరేగిన అలజడి, అసంతృప్తి, వారు అనుభవించిన మానసికక్షోభ మరొకవైపు మనస్సులో ముద్రవేస్తాయి "The Scalpel, The Sword" అన్న ఇంగ్లీషు పుస్తకానికి సంక్షిప్తంగా చేసిన ఈ తెలుగు అనువాదం మొదటిసారిగా 1973 లో "జనతా ప్రచురణల" ద్వారా వెలువడింది. ఇప్పుడు రెండవ ముద్రణగా ఈపుస్తకాన్ని "హైదరాబాద్ బుక్ ట్రస్టు" అందిస్తున్నది. "మూలంలోని పట్టుసడలనీకుండా శ్రద్ధ, బాధ్యతల్ని రెండు కళ్లుగా పెట్టుకొని తెనిగింపులో స్వల్పంగా స్వేచ్ఛతీసుకొని సంక్షిప్తపరిచి సమర్పించిన ఉత్తమ గ్రంథంగా దీన్ని మేం భావిస్తున్నాం" అని ప్రస్తుత ప్రకాశకులు అన్నదానిలో అతిశయోక్తి ఏమీలేదు ఇంత మంచి పుస్తకంలో అక్కడక్కడా అచ్చుతప్పులు రాకుండా చూస్తే బాగుండేది.

— గంగాధర్

మూలం : టెడ్, సిడ్నీ గోర్డన్, తెలుగు : సహవాసి, ప్రచురణ : హైదరాబాద్ బుక్‌ట్రస్టు, 10.1-17/2 మొదటి ఫ్లోర్, శ్యాంనగర్, హైదరాబాద్ - 500 004, పేజీలు : 260, వెల ; రూ. 7-50

సమీక్షలు :

ఎక్స్ - రే

కొన్ని సామాజిక సమస్యలపట్ల, పుస్తకం మొదట్లో చెప్పినట్లుగా, ఈ కవులకు స్పందనఉంది. సమస్యా పరిష్కారంపట్ల అక్కడక్కడ కొంత అవగాహన కూడా కనిపిస్తుంది. కాని వీటికి చక్కని కవితారూపం ఇవ్వడంలో ఈ కవులు చాలావరకు విఫలమయ్యారు. ఈ కవులు రాసిన కొన్ని మినీకవితల్లో ఉండవలసినంత భావశబలత లేకపోవడంతో మనస్సును ఆకట్టుకోవు.

ఈ విషయాలు చెపుతూనే వీరికి ప్రోత్సాహం ఇవ్వవలసిన అవసరం ఉంది. వీరు తమచుట్టూ ఉన్న ప్రజాజీవితాన్ని, అందులోని సంఘర్షణను లోతుగా అర్థంచేసుకోవాలి. అభ్యుదయభావాలు కలిగిన ఈ కవులు పోరాటప్రాంతంలో నివసిస్తూ, దాన్ని పట్టించుకోకపోవడం తగదు. పోరాటాలతో కూడి చైతన్యవంతమయి విశాలమయిన ప్రజాజీవిత పరిశీలననుండి పొందిన అవగాహన మంచి కళకు భూమిక అవుతుంది. ఈ కవులు ఆ ప్రయత్నంచేస్తే ముందు ముందు వీరినుంచి మంచి కవితవస్తుంది.

\- గంగాధర్

ఎక్స్-రే (కవితా సంకలనం) పి. సుదర్శన్ - టేక్‌మాల్ లక్ష్మణ: 48 పేజీలు: వెల : రూ. 2-00

ప్రతులకు: 'కేకలు', తెలుగు వారపత్రిక, వీక్లీబజార్, నిజామాబాదు

బతుకు పోరు

నేటి సామాన్యుడు బతుకు పోరులో ఎలా సతమత మవుతున్నదీ చిత్రించిన కొన్ని కవితలు, పాటలు ఇందులో వున్నాయి.

ఈనాడు దేశవ్యాపితంగా అన్నివర్గాల ప్రజలు ఈదోపిడీవ్యవస్థపై జరుపుతున్న పోరాటపథంలో నేటి జనం పాట పదునెక్కుతున్న విషయం వాస్తవం. ఆపదను, కర్తవ్యనిర్దేశం ఇందులో కొరవడినా, బతుకు బాధల్ని చెప్పుకోవటంలో కొంతమేరకయినా సఫలీకృతమయినవిషయం "బతుకు పోరు"లో చొరబడితే మనం గమనించగలం. అయితే రచయిత తన రచనలోని పునశ్చరణను తగ్గించుకొని నిజంగా ప్రజల కొరకు బాధ్యతవహించి రాయాలంటే మంచి కవితలు, పాటలు రాయగలడనే దానికి సందేహం లేనంతగా ఇందులోని అనేక పాటలు, కవితలు "బతుకు పోరు"లోంచి వర్గపోరులోకి తొంగి తొంగి చూస్తున్నాయి.

\- సంగ్రామ్

బతుకు పోరు - జనం పాటలు, కొన్ని కవితలు - రచన : ఎస్సార్ బోధనం

నడుస్తున్న చరిత్ర పుటల్లోంచి :

తమిళనాడులో పోలీసురాజ్యం

క్లాడ్ అల్వారెస్

"తమిళంలో ఎందుకురాస్తావ్ ?"-అని తమిళుడే అడుగుతున్నాడు. "ఇంగ్లీష్ పత్రికల్లో రాసుకో, మార్క్సిజంఏంఖర్మ. నక్సలిజమే కావాలనిరాయి, వాటిలో మాకేమీ అభ్యంతరంవుండదు- తమిళంలోరాయకు, తన్నులుతింటావ్, జాగ్రత్త !"

81 జనవరిలో మదురైలోజరిగిన ప్రపంచ తమిళ మహాసభలను వ్యతిరేకిస్తూ మద్రాసులో పోస్టర్లు వేసినందుకు ఈ యువకుణ్ణి పట్టుకొని బెదిరిస్తున్నారు, పోలీసులు. ప్రజలసొమ్ము పన్నెండుకోట్లుపోసి తమిళనాడు ప్రభుత్వం మేళా నిర్వహించింది- ప్రభుత్వాన్ని ఎదిరించి మాట్లాడితేనేరం !

తమిళనాడుకుబయట బెంగుళూర్ కాలేజీలో లెక్చరర్‌గా పనిచేస్తున్న కృష్ణన్ వెంటకూడా పడ్డారు తమిళనాడు పోలీసులు- అతనునడుపుతున్న సాహిత్యపత్రిక తమిళసభలను తీవ్రంగా వ్యతిరేకించింది- కృష్ణన్‌గురించి తలచుకుంటేనే వణుకు పుట్టేవిధంగా కథలుసృష్టించి బెంగుళూర్‌లో ప్రచారంచేసారు పోలీసులు. అతను తమిళనాడులోనే వుండివుంటే చర్మం ఒలిచేసేవారు.

గత మూడుసంవత్సరాల్లో తమిళనాడు ఒక పోలీసురాజ్యంగా మారిపోయింది- ఈ మూడేళ్ళకాలంలో అక్కడ జరిగిన దారుణాలు తలచుకుంటే ఇందిరాగాంధీ పెట్టిన ఎమర్జెన్సీయే మేలనిపిస్తుంది- ఎమర్జెన్సీ పెట్టకుండానే ఎన్నిచేయాలో అన్ని చేస్తున్నాడు ముఖ్యమంత్రి ఎం. జి రామచంద్రన్- ప్రజలను చట్టబద్ధంగా అరెస్టు చేసి తీసుకుపోయో, చట్టవిరుద్ధంగా ఎత్తుకుపోయో క్రూరంగాహింసించడం అక్కడ మామూలైపోయింది- హత్యలు, లూటీలు, కాల్పులు, యింకా చట్టవ్యతిరేక నేరాలన్నింటిలోను పోలీసులు అగ్రగాములై నిలిచారు. ఈ పార్టీకాదు, మాపార్టీ చేస్తుంది మంచి-అనిగానీ, ప్రజల ప్రయోజనాలకు పనికొచ్చే రాజకీయసిద్ధాంతం యిదిగో-అనిగానీ, ప్రచారంచేసుకొనే హక్కులేదిప్పుడు అక్కడ- చట్టము, న్యాయము, విచారణ అనేపదాలకు అర్థంలేకుండా పోయింది- ఎవరిని ఎప్పుడు ఎక్కడ ఎందుకు అరెస్ట్ చేస్తారో తెలవదు- పేదలబతుకుకు భద్రతలేదు, విలువఅంతకన్నాలేదు.

పోలీసురాజ్యం అంటేచాలు, భూస్వామ్యవిధానం అంటేచాలు- సెక్షన్ 124 ఎ కింద రాజద్రోహనేరం మోపుతారు- ఈ మాటలు నువుఅనకున్నా అన్నట్టు విరూపిస్తారు. పోలీసులువద్దంటే మెజిస్ట్రేటు బెయిల్‌యివ్వడు. ఎఫ్. ఐ ఆర్ లనూ,

పోస్టుమార్టెం రిపోర్టులనూ బహిరంగపరచడు- కంప్యూటర్లుపెట్టి పోలీసురికార్డులను అత్యంత ఆధునికంచేసింది మొట్టమొదలు ఈ రాష్ట్రంలోనే. అమెరికాలో మారిరిగా బందోబస్తు పోలీసుదళాన్నొకటి ఏర్పాటు చేస్తున్నారు. ధర్మపురి, ఉత్తర ఆర్కాట్ జిల్లాల్లో పద్నాలుగుమంది హరిజన యువకులను పొట్టనపెట్టుకున్న నేరానికి పోలీసు డి. జి. అబ్దుల్లాను పదవీవిరమణచేయగానే సౌదీ అరేబియాకు మనదేశ రాయబారిగా పంపి గౌరవించారు- ఈ హత్యలతో ప్రత్యక్ష సంబంధమున్న వెల్లూరు డి. ఐ. జి. వాల్టర్ దేవారాంకు రాష్ట్రపతి సేవాపతకం బహూకరించి సత్కరించారు.

అధికారంలోవున్న అన్నాడి. ఎం. కె. పార్టీ కార్యకర్త అయినాసరే, పోలీసులు తలచుకుంటే చల్లగా వుండలేడు- సీనియర్ ఐ. ఏ. ఎస్. అధికారులే నోరు మూసుకొని పడివుండడం నేర్చుకున్నారు. వున్నదున్నట్టుగారాసే ధైర్యం పత్రికల వాళ్ళకులేదు. సి. ఐ. డి. బ్రాంచ్ డి. ఐ. జి. మోహన్‌దాస్ పోలీసు కట్టుకథలను ఎడిట్‌చేసి మద్రాసు దినపత్రికల్లో అచ్చువేయిస్తాడు.

1976 లో సీలనన్ హత్యకు గురిఅయినప్పుడు పరిస్థితులు యింత దారుణంగా లేవు- పోలీసులు ఒక దొంగకేసులో తనను యిరికించినప్పటి నుండి సీలనన్ అతియార్ గ్రామంలో ఒక స్నేహితునితోకలిసి రహస్యంగా వుంటున్నాడు- సారాదుకాణాల నుండి మామూళ్ళు వసూలు చేసుకోవడం కోసం ముగ్గురు పోలీసులు ఆ గ్రామానికి వచ్చినపుడు సీలనన్ వాళ్ళకంటబడ్డాడు- వాళ్ళు అతణ్ణి పట్టుకొని ఒకచెట్టుకు కట్టివేసి బాగాకొట్టారు- ఛాతీకి ఒకనాగలికట్టి పశువును లాగినట్లులాగి చంపేసారు- శవాన్ని సైతం చితుకబొడిచారు- దొంగుకర్రకు కట్టిన కాళ్ళూచేతులూ అటూ యిటూ వేలాడుతూవుంటే, చచ్చినపందిని లాక్కుపోయినట్టుగా, శవాన్ని యీడ్చుకుపోయి ఒక బస్‌స్టాప్‌లో పడేసారు- ఇన్స్‌పెక్టర్‌కు ఫోన్‌చేసి అతని ఆజ్ఞమీద శవాన్నిమళ్ళా అతియార్ గ్రామానికి యీడ్చుకుపోయారు- అక్కడికి పోలీస్‌వ్యాన్‌వస్తే శవాన్ని అందులోకితోసి, నిర్జనప్రదేశంలోకి తీసుకుపోయి, పెట్రోలుపోసి తగులబెట్టారు.

సీలనన్‌ను పోలీసులు చంపుతుండగా జయ అనేఆమెచూసింది- పోలీసులు తిరిగొచ్చి జయను, ఆమెభర్త వేలూను వాళ్ళయింటినుండి బయటకుతరిమి బట్టలు విప్పించి బూతులుతిడుతూ హింసించారు- వేలూ మర్మాంగంలోకి చీమలనుపంపి అగ్గిపుల్లలువెలిగించి మర్మాంగంచివర మంటపెట్టారు- జయ మర్మాంగంలోకి కట్టెను తోసారు- ఆమె జుట్టుపట్టుకుని పీకేసారు- సెక్షన్ 377 లాంటి అనేక సెక్షన్లకింద అరెస్ట్‌చేసి యిద్దరినీ చెరొకసెల్‌లో బంధించారు- వాళ్ళమూడేళ్ళకొడుకును కటకటాల

ముందుకుతెచ్చి తండ్రిముందే చంపివేస్తామని బెదిరించారు. పిల్లవాణ్ణి మంటల్లోవేసి కాల్చినామనిచెప్పి బూడిదతెచ్చి చూపించారు. అయితే పిల్లవాణ్ణి నిజానికి చంపలేదు. ఆరునెలలు కార్యకర్తలను హింసించి బయనువదిలారు. కోర్టుముఖంచూడకుండా యింకా కటకటాలవెనుక వేలూ మగ్గిపోతూనేవున్నారు.

77 లో శీలనన్ హత్యపై న్యాయవిచారణ జరిగింది. హత్యచేయబడ్డవాడు తమ కొడుకు కానేకాడని తల్లిదండ్రులను చెప్పమని పోలీసులు బెదిరించారు. విచారణలో పోలీసుల నేరం బయటపడింది. నేరస్తులను తాత్కాలికంగా వుద్యోగం నుండి తొల గించారు. ఏడాది తర్వాత వెల్లూరుసెషన్స్ జడ్జి వాళ్ళను నిర్దోషులుగా నిర్ణయించాడు, వాళ్ళు మళ్ళా వుద్యోగాల్లో చేరారు. వాళ్ళలో ఒకడైన ఇన్స్‌పెక్టర్ రామస్వామి యిపుడు నరహంతక డి. ఐ. జి. దేవారాం వెంటతిరిగే రాక్షసుల్లో ఒకడు.

పోలీసు హత్యకాండపై ఎంక్వయిరీ కమిషన్‌నయినా వేయించడం 77 లో సాధ్యమయేది. యిపుడు పోలీసు చర్యను ప్రశ్నించే వారెవరైనాసరే అరెస్ట్‌కు గురి అవుతారు. 124-ఎ మొదలుకొని అనేక సెక్షన్లకింద వాళ్ళమీద నేరం మోపుతారు. హతునిపట్ల ఏ వ్యక్తిగాని, పౌరహక్కుల సంఘం కార్యకర్తగాని సానుభూతిచూపిస్తే చాలు తీవ్రవాదిగా ముద్రవేసి హింసిస్తారు. 79 లో అయాదొరై అనే న్యాయవాది కోర్టు ఆజ్ఞప్రకారం పోలీసుల సహాయం కోరేందుకు తిరుపరన్‌కుండ్రం పోలీస్ స్టేషన్‌కు పోతే ఒక పోలీసుతో మాటా మాటా పెరిగింది. అయాదొరైను కొట్టి షర్ట్‌చింపి పాంట్ విప్పేసారు పోలీసులు. అదే వేషంతో అయాదొరై మదురై న్యాయవాదుల సంఘం ఆఫీసుకు ఏడుస్తూపోయాడు. రెండున్నరవేల మంది న్యాయవాదులు మద్రాసులో వూరేగింపుగా వెళ్ళి సెక్రెటేరియట్ ముందు పెద్దనిరసన ప్రదర్శన జరిపారు. కోర్టులను బహిష్కరిస్తామన్నారు. ముఖ్యమంత్రి దిగివచ్చి విచారణ జరిపిస్తానన్నాడు. అసలు విషయమేమిటంటే మద్రాసులోని న్యాయవాదులందరినీ తీవ్రవాదులుగానే ముద్రవేసింది, పోలీసు యంత్రాంగం।

79 జూలై 8, 15 తేదీలమధ్య మద్రాసు నగరంలోనూ, శివార్లలోనూ పోలీసులు రాత్రిళ్ళు అనేకదాడులుచేసి నలభై మంది వామపక్ష కార్యకర్తలను పట్టుకున్నారు. రాష్ట్రం మొత్తంమీద మూడువందలమందిని అరెస్టుచేసారు. వీళ్ళలో ట్రేడ్ యూనియన్ నాయకులు, రచయితలు, పత్రికావిలేకరులు, పౌరహక్కుల సంఘం కార్యకర్తలు వున్నారు.

శీలనన్ హత్యపై న్యాయవిచారణను ఏర్పాటు చేయించడంలో ముఖ్యపాత్ర వహించినవాళ్ళలో వి వి భక్తవత్సలం ఒకరు. న్యాయవాది అయిన ఆయన పౌర హక్కుల సంఘం (టీ సి డి ఆర్) అధ్యక్షుడుకూడా. ఎదురుదాడులపేరున పోలీసులు ఎంతమందిని పట్టుకొని హింసించి చంపిందీ తెలియజెప్పేందుకు 80 ఆగస్టులో పత్రికా గోష్టి ఏర్పాటుచేసాడాయన. గోష్టికిముందే అతణ్ణి అరెస్టుచేసి ఎక్కడికేసుల్లోనో యిరికించారు. ఏడాదికింద ధర్మపురిజిల్లాలో ఆయన వుపన్యసించడంవల్ల నూటాయాబయ్ హింసాత్మక ఘటనలు జరిగినట్టు ఒకకేసు. తమిళనాడులో జరిగిన పోలీసు హత్యాకాండపై హైకోర్టు జడ్జితో న్యాయవిచారణ జరిపించాలనీ, విచారణ జరపకుండా చంపినందుకుగాను మృతుల కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించాలనీ, డిమాండ్ చేస్తూ భక్తవత్సలం విడుదలచేసిన పత్రికాప్రకటన ఎట్లాగైతేనేం రహస్యంగా పత్రికా విలేకరులకందింది.

మద్రాస్ న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు కె. వి. శంకరన్‌కూ, మక్కల్ సాయితి పత్రికా నిర్వహకుడు చొక్కలింగంకూ, పౌరహక్కుల సంఘం కార్యకర్త డా. దేవసుందరానికీ, పరిమణం అనే మార్క్సిస్టుపత్రిక సంపాదకుడు పళనిస్వామికీ యిట్లాంటి అనుభవాలే ఎదురయ్యాయి.

బెస్తలగ్రామం తిరువానమియుర్ నుంచి అధికారపార్టీ పదవికి మొదటిసారిగా ఒకరు ఎన్నికకావడం పక్కగ్రామం పెద్దకులస్తులకు కోపం తెప్పించింది. ఒక బెస్తను చంపి, వాళ్ళే పోలీసులను పిలిపించారు. పోలీసులు నాలుగుసార్లు దాడిచేసి ఆడవాళ్ళను కూడా వదలకుండా కొట్టారు. కడుపుపై దెబ్బతగిలి ఒకామె చనిపోయింది. యిట్లే, చిన్న దొంగతనం చేసిన నేరానికి అశోక్‌నగర్‌లో నిత్యానంద్‌ను కొట్టిచంపారు పోలీసులు. కిందపడి చనిపోయాడని ప్రకటించారు.

తమ కోర్కెల సాధనకు వ్యవసాయశాఖ వుద్యోగులు శాంతియుతంగా నిరాహార దీక్ష చేసినపుడు, అయిదువేల మంది ప్రాథమిక పాఠశాలల వుపాధ్యాయులు వూరేగింపుగావెళ్ళి వినతిపత్రం సమర్పించినపుడు, క్రూరంగా వాళ్ళ సమ్మెలను అణిచివేసారు. రోజు కూలిలెక్కన కాకుండా నెల నెలా జీతం యిప్పించాలని కోరినందుకు పదిహేనువేలమంది పాలకార్పొరేషన్ పనివాళ్ళను నెలరోజులు జైల్లోపెట్టి, తర్వాత అందరినీ పనుల్లోంచి తీసేసారు. ఈ పరిస్థితుల్లో యిక ప్రైవేట్ సెక్టర్ పరిశ్రమల్లోని కార్మికులు సమ్మెచేస్తే ప్రయోజనం ఏముంటుంది? పరిశ్రమను ఎత్తేసి వేరేచోట పెట్టుకోవడానికి ప్రభుత్వం మద్దతునిస్తుంది, పోలీసులు రక్షణకల్పిస్తారు. బకింగ్‌హాం

అండ్ కర్ణాటక మిల్లులో పనిభారం పెంచి జీతాలు తగ్గించినందుకు కార్మికులు సమ్మె చేస్తే మిల్లును మూసేయడానికి ప్రభుత్వం మేనేజ్‌మెంటుకు అనుమతియిచ్చింది- పదమూడు వేలమంది పనులు కోల్పోయారు- ఆరునెలల తర్వాత కొత్త నిబంధనల కింద మూడు వేలమందికి మళ్ళీ వుద్యోగాలిచ్చారు- యిపుడు వీళ్ళు ఏ అన్యాయానికీ నోరెత్తకూడదు.

తమ న్యాయమైన కోరికల సాధనకు పోలీసులు సంఘటితం కావడంకూడా పోలీసు యంత్రాంగానికి పడదు- అయాదొరై సంఘటనతర్వాత ట్రేడ్ యూనియన్ నాయకుడు నయన్‌దాస్ నాయకత్వంలో పోలీసులు సంఘంపెట్టుకుంటే దీనికి గుర్తింపు యివ్వకుండా పోలీసు అధికారులు తమ అడుగులకు మడుగులొత్తే వేరే సంఘాలు రెండు పెట్టించి వారికి గుర్తింపుయిప్పించారు- నయన్‌దాస్ సంఘంవాళ్ళు రెండు వేలమంది నిరాహారదీక్షకుదిగితే వాళ్ళను దారుణంగాకొట్టి జైళ్ళలోకి తోసారు. ఒక పోలీసు చేయివిరిగింది

తమిళనాడు మొత్తంమీదే పేదరికంఎక్కువ: గ్రామాల్లో అరవైమూడు శాతం, పట్టణాల్లో యాభైరెండుశాతం ప్రజలు పేదరికంలోవుండగా, ధర్మపురి, ఉత్తరఆర్కాట్ జిల్లాల్లో మరింతపేదరికం తాండవిస్తున్నది- ధర్మపురిలోని ఒక్క కదిరిరాంపట్టి గ్రామంలోనే మూడువందలకుపైగా వెట్టిచాకిరీచేస్తున్న వాళ్ళున్నారు. తిరుపత్తూరులోని అన్నాకాలనీకి దగ్గర్లోవున్న హరిజనకాలనీలో నాలుగువందల గుడిసెలకూ కలిపి ఒకే ఒక మరుగుదొడ్డి- దాని నుంచివచ్చే దుర్వాసన భరించలేము- పిల్లలందరూ బక్కచిక్కిపోయి విరేచనాల జబ్బుతో చచ్చిపోతుంటారు- మూడుమైళ్ళు పోతేగాని మంచినీళ్ళు దొరకవు. వ్యవసాయపు పనులు చేసుకొనో, యిళ్ళకట్టే పనికి పోయో రోజుకుమూడు రూపాయలు సంపాదిస్తారు. ఒక్కొక్క కుటుంబంలో దాదాపు ఆరుగురుంటారు. రోజుకు ఒకే ఒకపూట తిండి- ఆరునెలలే పనులు దొరుకుతాయి- ఆ పనులవల్ల వచ్చేదానిలో ఎక్కువ భాగం భూస్వామి నుంచి తెచ్చిన అప్పుకిందికే పోతుంటుంది- వంటగిన్నెలతోసహా సమస్తం మార్వాడీవద్ద కుదువపెడతారు వూళ్ళోకి పోతే ఎంత ఎండవున్నా చెప్పులు వేసుకోకూడదు- టీ కొట్టులో వాళ్ళకోసం వేరే గ్లాసులు వుంటాయి- పిల్లలెవరూ బడికిపోరు; పదిహేనుమైళ్ళుపోయి కట్టెలు మోసుకొచ్చి అమ్ముకుంటారు.

రెండేళ్ళకింద స్టేట్ సెంట్రల్ ఫాంలోని వ్యవసాయకూలీలు సమ్మెచేసి కొంచెం ఎక్కువకూలీ సాధించుకున్నారు- ప్రైవేటు భూముల్లో పనిచేసే కూలీలకు

యిది సాధ్యంకాదు- ముప్ఫయిఏళ్ళ నుండి తమచుట్టూ సంపద పండడం, దొరల గాదెలు నిండడం హరిజన కూలీలు చూస్తూవస్తున్నారు. సాంకేతి ప్రగతివల్ల కొత్త కొత్త పనిముట్లువచ్చాయి- అయినా కూలీలకు ఒరిగిందేమీ లేదు- చేసేదిలేక యిప్పుడు వాళ్ళు చిన్న చిన్న దొంగతనాలకు దిగారు- యిదిచూసి భూస్వాములు వాళ్ళను బంది పోట్లుగా, తీవ్రవాదులుగా, నక్సలైట్లుగా చిత్రిస్తున్నారు- భూస్వాములు దాదాపు అందరూ అధికారపక్షంవాళ్ళే- డి. ఎం. కె. పార్టీవాళ్ళే- కాబట్టి చిన్నవిషయానికి సైతం పోలీసులను పిలిపించి తీవ్రమైన దమనకాండను అమలుచేయిస్తున్నారు- సాంఘిక, ఆర్థిక కారణాలతో ముడిపడివున్న సమస్యను పరిష్కరించడంపోయి శాంతి భద్రతలకు భంగం వాటిల్లినట్టుగా సమస్యను చిత్రిస్తున్నారు- యిందువల్లనే పరిస్థితి విషమించింది.

అందుకే, అధికారికంగా కాకపోయినప్పటికీ యివాళ ధర్మపురి, ఉత్తర ఆర్కాట్ జిల్లాలు కల్లోలిత ప్రాంతాలుగా చూడబడుతున్నాయి- రెండువందల మంది భూస్వాము లకు పిస్తోళ్ళ లైసెన్సు లిచ్చింది ప్రభుత్వం, హరిజనులు యిపుడు ప్రాణాలకు కూడా భయపడాల్సిన స్థితి ఏర్పడింది- వాళ్ళరక్షణకోసం వున్న చట్టాలన్నీ తాత్కాలికంగా రద్దుచేయబడ్డాయి- పోలీసులు స్వేచ్ఛగా హత్యాకాండ కొనసాగిస్తారు- వాళ్ళకు తిరుగులేదు- ఎదురుకాల్పుల్లో కొందరు చచ్చారని అపుడపుడు ప్రకటిస్తారు- అసలు విషయాలన్నీ బయటపడితే వాళ్ళకే రక్షణలేకుండాపోతుంది- కొత్త వాళ్ళను యీ జిల్లాల్లోకి రానివ్వరు- నిజ నిర్ధారణకోసం వచ్చిన పౌరహక్కుల సంఘం వాళ్ళను తన్ని పంపిస్తారు- బీహార్‌లో భూమిలేని రైతుకూలీలనుకానీ, మహారాష్ట్రలో పెద్ది శంకర్‌నుకానీ, తమిళనాడులో హరిజనులనుకానీ, నక్సలైట్లుగా ముద్రవేసి చంపితే తప్పులేదనే అభిప్రాయాన్ని కలిగించే ప్రయత్నం జరుగుతున్నది- ఈ పనితో పోలీసు లకు తోడుగా తమిళనాడులోని పత్రికలు నిలుస్తున్నాయి.

భూస్వాములు ఫిర్యాదుచేస్తే హరిజన యువకులను ప్రశ్నించే నెపంమీద లాక్కు పోవడమూ, నక్సలైట్ల గురించిన సమాచారం దొరక్కపోయేసరికి వాళ్ళనుకాల్చి చంపడమూ- యిదీ యీరెండుజిల్లాల్లో జరుగుతున్నకథ తుపాకులు పట్టుకొని జీపుల్లో తిరుగుతున్న వేయిమంది పోలీసులు నక్సలైటుగా ప్రకటించుకున్న ఒక్కవ్యక్తిని కూడా యింతవరకు పట్టుకోలేకపోయారు. నక్సలైట్లు అనేవాళ్ళువున్నా వాళ్ళను అరెస్టుచేయాలని ఏచట్టమూచెప్పదు. మార్క్సిస్ట్ లెనినిస్ట్ పార్టీపై ఏ నిషేధమూలేదు. నక్సలైటు అనబడేవాణ్ణికూడా విచారణలేకుండా చంపేహక్కు ఎవరికీలేదు. అదిపోనూ,

ఒక్క కేసులోనయినా చంపబడ్డది నక్సలైట్ అనేవిషయం తేల్చడానికికూడా ఆధారమే లేదు

ఈ సాంఘికవ్యవస్థలో ఎంతపెద్ద అన్యాయానికి ఎంతచిన్న నిరసనతెలిపినా, నిరసనతెలిపేవ్యక్తి చంపతగినంత నేరస్థుడై పోయే స్థితియేర్పడ్డది. అగ్రకులాలు మళ్ళీ తమ అధికారం చేజిక్కించుకున్నాయి. హరిజనులు మూడేళ్ళ ఆందోళనచేసి గుళ్ళోకి పోయినందుకు, అగ్రకులాలవారు దేవాలయంలో వుత్సవాలు చేసుకోలేక పోతున్నందుకు, ఆరుగురు హరిజన యువకులను నక్సలైట్లుగా చిత్రించి జైల్లోకి తోయించారు. వీళ్ళలో యిద్దరు అగ్రకులాల బాధపడలేక మతంమార్చుకుని తురకలయినవారు.

గత ఆగస్ట్ ఆరు తర్వాత పోలీసుల హత్యాకాండకు హద్దుల్లేకుండా పోయింది. నలుగురిని అరెస్టుచేసి కారులో తీసుకుపోతుండగా బాంబుపేలి ఒక యిన్స్పెక్టర్ చనిపోయాడు, యిదీకోపం, అరెస్టు అయినవాళ్ళలో ఒకవ్యక్తికూడా చనిపోయాడు, మిగతావాళ్ళలో యిద్దరిని చిత్రహింసలకు గురిచేసి చంపారు. యింకొకవ్యక్తి జాడ యింతవరకు తెలవదు. ఈయన బీడీకార్మికులను సంఘటితపరచిన యువకుడు. చిన తంబి. ఏకేసూలేదు యితనిమీద. నక్సలైట్లతో సంబంధాలున్నట్టు పోలీసులకు అనుమానం.

బాంబుపేలుడు సంఘటన తర్వాత పోలీసులు యీ రెండుజిల్లాల్లోనే పంతొమ్మిది మందిని చంపారు, పదిహేనువందల మందిని అరెస్టుచేసారు, పౌరహక్కుల వుద్యమాన్ని తీవ్రంగా అణిచివేసారు. సెప్టెంబర్ 11 నాటికి మళ్ళీ దమనకాండ ప్రారంభం. షణ్ముఖం, సుబ్రహ్మణ్యంలను కాల్చిచంపారు. మరునాడే మద్రాస్ ఆసుపత్రిలో బాలన్ చనిపోయినట్టువార్త. బాలన్ ధర్మపురిజిల్లా రైతుకూలీ నాయకుడు. యువకుడు తన ఎం. ఎస్సీ చదువు మధ్యలోనేఆపి మార్క్సిస్టు-లెనినిస్టు పార్టీలో చేరాడు. అయితే భూస్వాముల, వడ్డీవ్యాపారస్తుల, గూండాల దోపిడీని, దుర్మార్గాన్ని ఎదిరించి పోరాడడంలో పేదరైతులకూ, రైతుకూలీలకూ, యువకులకూ బహిరంగంగానే నాయకత్వం వహించాడు. రెండేళ్ళలోనే నాలుగుతాలూకాల్లోని పేదప్రజలు అతనివెనుక సంఘటితంగా నిలిచారు. ఒక హత్యకేసులో అతణ్ణియిరికించి పోలీసులు అరెస్టుచేస్తే కోర్టులు అతణ్ణి వదిలేసాయి. నాలుగురోజుల తర్వాత ఒకమీటింగులో అతణ్ణి పట్టుకపోయి పాలకోడ్ పోలీస్స్టేషన్లో కాళ్ళువిరిచేసారు ధర్మపురి ఆసుపత్రికీ, అటునుండి మద్రాస్ ఆసుపత్రికి తీసుకపోయారు. విరిగినకాళ్ళలో విషంచేరి నాలుగు

రోజుల్లో బాలన్ చనిపోయాడు- చనిపోయే యిరవై నిమిషాలముందు అక్కడవున్న డాక్టర్లూ, నర్సులనుద్దేశించి ఒక వీలునామాలాగా వుపన్యసించాడు.

మట్టుకరిమణి అనే యువకుని పాదానికి పోలీసులు గురిపునాడాకొట్టి చంపారు. జోలార్‌పేట దగ్గర్లోని చిన్నహోటల్‌లో పేపరు చదువుతుండగా కురువికరన్ కనక రాజ్‌ను పట్టపగలు పట్టుకుపోయి పోలీసులు కాల్చిచంపారు. యువకులైన చిన్నదొరై నొండి పెరుమాళులను నిన్ని ఊపట్టులో రాత్రి అరెస్టుచేసి చిత్రహింసలుపెట్టి పొద్దున కాల్చిచంపారు. జయపాల్ మనోహరన్ అనే యువకులపనీ అంతేఅయింది. హస్తాం పట్టి (సేలం)లో రోడ్డుమీద పనిచేస్తున్న కన్నమణిని చేతులువిరిచి కట్టేసి ట్రావెలర్స్ బంగ్లాకు లాక్కుపోయారు. మేజిస్ట్రేటుముందుకు తీసుకుపొమ్మని అతడు డిమాండ్ చేస్తే పోలీసుస్టేషన్‌కు ఈడ్చుకుపోయారు. మరో వక్కటైటు దొరికాడని తిరుపత్తూరు నుంచి దేవారాం పరుగెత్తుకొని వచ్చాడు. తర్వాత కన్నమణిని గోడకానుకొని నిలబడ మని చెప్పి తుపాకీతో కాల్చిచంపారు.

ఎందరోప్రజలను అరెస్ట్‌చేస్తూ, హత్యాకాండ కొనసాగిస్తూకూడా జనవరినుండి మొన్నటి ఆగస్టువరకు ఎదురుకాల్పుల్లో ఎవరూ చావలేదని ప్రకటించారు. బయట వుండి కాల్చివేయబడేకన్నా పోలీసులకు లొంగిపోయి జైళ్ళలోకూచోడానికే యువకులు కొందరు యిష్టపడుతున్నారు.

నటరాజన్ గౌండర్‌ను 79 మేలో తప్పుడు హత్యకేసులో యిరికించి అరెస్ట్ చేసారు. 80 జనవరిలో బెయిల్‌మీద విడిచిపెట్టారు. ఏప్రిల్‌లో 'క్యూ' బ్రాంచ్ పోలీసులు ప్రశ్నలడగాలని అతణ్ణి పట్టుకుపోయి హింసించి చంపేసారు. అతని ముసలి తండ్రి మరొక గ్రామస్తుడూ కేసులో అతనికి జమానతుగా వుండిరి. బెయిల్‌మీద వున్న నటరాజన్ తప్పించుకుపోయాడనిచెప్పి యిప్పుడు యీ యిద్దరిని చెరి వేయిన్నర రూపాయలు కట్టమని వేధిస్తున్నారు.

రాజపాలాయంకు చెందిన ధర్మన్, మచికాలి యిట్లాగే పోలీసు లాకప్పుల్లో మాయమయ్యారు.

మే 22న ఇండియన్ ఎక్స్‌ప్రెస్ పత్రికలో (రాయబారి) అబ్దుల్లా ప్రకటన వెలువడింది- ఈ రెండు జిల్లాల్లో తీవ్రవాదులే యికలేరని- కాని ఆగస్ట్ 23న ధన్ పాల్, అంబు, సర్వనం అనే మరో ముగ్గురు యువకులను తీవ్రవాదులని హింసించి చంపారు- పోలీసులు.

ఈ హత్యలకు ముందు ధర్మపురిలో యువజన సంఘం కార్యకర్తలు పదకొండు మందిని అరెస్ట్ చేసారు. నాయకనకొట్టాయ్ గ్రామంలో పచియప్పన్ యిల్లును కింది మీదచేసి బోలెడు వస్తువులను బావిలోకి తోసేసారు. యింట్లో వాళ్ళను నానాబూతులు తిట్టి, యింటికి నిప్పుపెడతామనీ, పచియప్పన్ భార్యను మానభంగం చేస్తామనీ, బెదిరించారు. తర్వాత, సీతానందన్ యింటిమీదపడి ఆయన భార్య చెవిరింగులూ, ఆయన మామ చేతివాచీ లాక్కున్నారు. ముసలితల్లిని కొట్టి సీతానందన్‌ను పట్టుకు పోయారు. కదిరినాయకన్‌పట్టి, మరవడి, తవసపట్టి, గుండలపట్టి, వెల్లలపట్టి గ్రామాల్లోని యువజన నాయకుల యిళ్ళపై కూడా పోలీసులు దాడులుచేసారు. అయిదు గురిని సెక్షన్ 399 కిందా, ఆరుగురిని ఏ కారణమూ చూపకుండా అరెస్ట్‌చేసారు. ఈ ఆరుగురిని యింతవరకు కోర్టులో హాజరుపరచలేదు.

బాలన్ వర్ధంతి దగ్గరపడుతున్నందువల్లనే మళ్ళీ యీ పోలీసు పైశాచికత్వం. వర్ధంతి సందర్భంగా కరపత్రాలు వచ్చిపడ్డాయి. అయిదువందల మంది గ్రామస్థులను అరెస్ట్‌చేసారు. తాము దాడిచేసిన ప్రతిగ్రామంలోనూ పన్నెండూ నలభైఏళ్ళ మధ్య వున్న వాళ్ళందరినీ. ఆడామగా తేడాలేకుండా వచ్చి లొంగిపొమ్మన్నారు పోలీసులు. పోలీసులకు రహస్యంగా వార్తలు అందించేవాళ్ళూ, భూస్వాములూ, స్థానికగూండాలూ చెప్పిన దాన్నిబట్టి వీళ్ళలో నక్సలైట్ల సానుభూతిపరులను ఏరి చితకబాది కోర్టుకు, అటునుండి జైలుకు, తీసుకుపోవడం. యిదీ పోలీసులు చేస్తున్నపని.

పోలీసుల అమానుష హింసాకాండ గురించి పల్లెత్తుమాట అనే ధైర్యం లేదెవరికీ. అన్నాడి. ఎం. కె. కార్యకర్త కె కె. మణి గతి ఏమైందో అందరికీ తెలుసు. ఏమిటీ ఘోరం. అని జొలార్‌పేట పోలీసు స్టేషన్‌కు అడగడానికి పోయి మెత్తగా తన్నులుతిన్నాడు. బజారుల్లో తిప్పుతూ అగౌరవపరచారు అతణ్ణి. బెయిలు దొరకకుండా సెక్షన్ 307 కింద తప్పుడు కేసులో యిరికించారు. ఒక నర్సును పోలీసులు మాన భంగంచేస్తే యిదేమిటని అడగబోయిన పౌరహక్కుల సంఘం కృష్ణస్వామిరెడ్డిని ముగ్గురు పోలీసులు చితకబాదారు.

తన యింటర్వ్యూలో అబ్దుల్లా. పోలీసులు చేసినవి హత్యలే అని పరోక్షంగా అంగీకరించాడు. ఆ ప్రాంతపు సమస్యలకు అంతిమ పరిష్కారం చూపవలసింది పోలీసులుకాదు, పరిపాలకులని అన్నాడు. కోర్టుదాకాపోయి, కోర్టు న్యాయం చెప్పేదాకా వేచివుండే పరిస్థితులు లేనందువల్లనే పోలీసులు చట్టవిరుద్ధంగా పోవలసివస్తున్నదని పోలీసు అధికారులు చాటుగా అంటున్నారు. తీవ్రవాదులను అంతంచేయడం తమ

చర్చ :

రచన - భాష

[హైదరాబాద్ 'సాహితీ మిత్రులు' నవంబర్ సంచికలో రాసిన లేఖతో తిరిగి ప్రారంభమైన రచన-భాష చర్చలో భాగంగా హైదరాబాద్ 'సాహితీసర్కిల్' 1979లో నిర్వహించిన ప్రశ్నావళిరూపంలో చర్చనుంచి కొన్ని ఎంపికచేసిన సమాధానాలు గత సంచికనుంచి వరుసగా ప్రచురిస్తున్నాం.- సాహితీమిత్రులు.]

1 ప్ర: మాండలీకంలో వస్తున్న విప్లవసాహిత్యం మీకు సులభంగా అర్థమౌతున్నదా?

జ : ఏప్రాంతంవారు వ్రాసింది ఆప్రాంతంవారికే సులభంగా అర్థమౌతుంది. ఒకప్రాంతంవారు వ్రాసింది వేరొక ప్రాంతంవారికి గూడా అర్థమౌతుంది కాని సులభంగా మాత్రంకాదు.

2 ప్ర: మాండలీకాన్ని అర్థంచేసుకోవడంలో వున్న ఇబ్బందులేమిటి ?

జ : మాండలీకంలోని కొన్నిపదాలు ఆ ప్రాంతానికే పరిమితమై ఉంటాయి. అవి అన్నిప్రాంతాలలో వాడుకలో ఉండవు.

ఆయా పదాలకు ఆయా ప్రాంతాలలో ప్రత్యేకఅర్థాలు ఉంటాయి.- కేవలం ఆ కొత్త పదాన్ని చదవడంవల్ల రచయిత ఆ పదానికి ఆపాదించిన భావాన్ని తెలుసుకొనుట కష్టం. భాష కష్టంగాఉండి చదవాలనే ఉత్సాహాన్ని కలిగించదు.

3 ప్ర: ఆ రచనలు అర్థంకాకపోతే అది మాండలీక రచన వైఫల్యమా? పాఠకుల వైఫల్యమా ?

జ : పాఠకుని వైఫల్యంకాదు :- ఎందుకంటే అతనికున్న భాషాపరిజ్ఞానంతో రచనను అర్థంచేసుకోవడానికి ప్రయత్నిస్తాడు.- ఇక రచయిత రాసిన ప్రతిదానిని

ప్రభుత్వ లక్ష్యంకాదనీ, దేవారాం లాంటి పోలీసు అధికారుల హత్యాకాండను ఆపడం కష్టసాధ్యమనీ, నిష్పాక్షికంగా న్యాయవిచారణ జరిపించడానికి వాళ్ళు ఒప్పుకోరనీ, తమిళనాడు ఆర్థికమంత్రి మార్చ్ 28న అసెంబ్లీలో ప్రకటించాడు.

రాష్ట్రంలో ఒకవైపు తీవ్రస్థాయిలో తిరుగుబాటుదారులను, అమాయకులను పోలీసులు హతమారుస్తుంటే, మరోవైపు మద్రాసులో కరుణానిధి నిలబెట్టిన గుర్రం విగ్రహాన్ని ప్రపంచ తమిళ మహాసభలు జరుగుతున్న మదురైకి ఎం. జి. రామ చంద్రన్‌ను తరలించనీయాలా-వద్దా- అని డి.ఎం.కె., అన్నాడి.ఎం.కె. పార్టీల వాళ్ళు తగువులాడుకుంటూ కూచున్నారు.

(ఇంగ్లీషు నుంచి సంక్షిప్తానువాదం)

అర్థంచేసుకోవాలంటే కొన్ని పదాలఅర్థాలు మొదటే తెలిసిఉండాలనుకోవడం కేవలం రచయిత వైఫల్యమే, రచయితవైఫల్యమే ఎందుకంటే అసంఖ్యాకమైన పాఠకుల్లోనికి చొచ్చుకుపోయేటట్టు రచించాల్సిన బాధ్యత రచయితది. అదికేవలం ఒక ప్రాంత ప్రజలకు మాత్రమే అర్థమైతే దానిప్రయోజనం పూర్తిగా నెరవేరినట్టుకాదు.

4 ప్ర: మాండలీకంలో వస్తున్న సాహిత్యం యితరప్రాంతాలకు వ్యాప్తిచెందుతుందా?

జ : యితర ప్రాంతాలలో మెజారిటీ పాఠకులలో వ్యాప్తిచెందదు- దీనివ్యాప్తి విప్లవ సాహిత్యాభిమానులలోనే ఉంటుంది- రాజకీయ చైతన్యంలేని మెజారిటీ పాఠకులు ఎక్కువగా చదవరు- కాని వీరు మామూలు (మాండలీకంకాని) రచనలైతే చదువుతారు కుటుంబరావు రచనలు చదివినంతమంది రావిశాస్త్రి అల్లంరాజయ్య రచనలు చదవలేదు- కారణం కేవలం మాండలీకం.

5 ప్ర: వ్యాప్తిచెందకపోతే గల కారణాలేమిటి?

జ : ఆసక్తిలేకపోవడం :- సృజనలాంటి పత్రికలో వచ్చినప్పటికీ regularగా చదివేపాఠకులే చదవడంలేదని ఒక పాఠకమిత్రుని సర్వేవల్ల తేలింది- ఆసక్తిలేకపోవడానికి కారణం మాండలీకమేగదా- మామూలుగా అర్థమయ్యేటట్టుచదవాలంటే నాల్గింతల time ఎక్కువ పట్టుతుంది.

మాండలీకంలోని విప్లవ రచనలు కేవలం కొన్నిపత్రికలకే పరిమితమైపోయినవి Best example అల్లం రాజయ్య కథలు. ఎక్కువ Reader Ship ఉన్న పత్రికలకు కూడా తమ తమ రచనలు పంపాల్సిన బాధ్యత విప్లవ రచయితలపై ఉన్నది. వారితో అలా చేయించడం విరసం తక్షణమే చేయాల్సినపని.

6 ప్ర: పాఠకులే ప్రయాసతోనైనా ఆ సాహిత్యాన్ని అవగాహన చేసుకోవాలంటారా.

జ : No.

7 ప్ర: ఎందుచేత ?

జ : ఇలా కోరుకొంటే ఘోరవైఫల్యాన్ని పొందుతారు- ఎక్కువగా ఉన్న మామూలు పాఠకులను (విప్లవ సాహిత్యాన్ని ఎక్కువగా చదవనివారిని) మాండలీకంలోని రచనలను ప్రయాసతో చదవాలనడం చదువుతాడనుకోవడం హాస్యాస్పదం.

ఎన్నో జీవన వ్యాపకాలతో సతమతమయ్యే పాఠకులను వాటిని కొన్ని తగ్గించి దానిలో కొంత సమయాన్ని ఎక్కువ time తీసుకొనే మాండలీక రచనలు చదవడంలో పెట్టడానికి ఎవరూఆసక్తిచూపరు.

తాత్కాలిక భ్రమలుకొల్పే రచనలు చదవడానికి ఇష్టపడే మెజారిటీ పాఠకుల్ని ప్రియాసతో మాండలీకాలు చదవగలరని ఎలా Expect చేస్తాం. వాళ్ళకది చిన్నప్పుడు class textbook చదివే feeling ఉంటుందనుకొంటా.

8 ప్ర: విస్తృత ప్రచార లక్ష్యంతో మాండలిక రచనలను ఏవిధంగా సులభతరం చేయాలంటారు.

జ: సాధ్యమైనంతవరకు మాండలీకం తగ్గించడం ద్వారా, కేవలం సంభాషణలే మాండలికంలో వ్రాయడం ద్వారా, పదాలకు అర్థవివరణ వెంబడే బ్రాకెట్లలో ఇవ్వడం ద్వారా, ఎక్కువ reader ship ఉన్న పత్రికలలో ప్రచురింపబడటం ద్వారా.

9 ప్ర: పదాలకు అర్థవివరణ (foot notes) యిస్తే అర్థచేసుకోవడంలోని యిబ్బందిని అధిగమించగలరా?

జ: కొంత వరకు. కానీ మధ్య మధ్యలో foot notes చూడడంవల్ల చదవడం లోని కంటిన్యూటీ దెబ్బతింటుంది. ఎక్కువ foot note ఉంటే ఆసక్తికూడా తగ్గుతుంది (like looking in to a dictionary

10 ప్ర: మాండలీకంలోవున్న నవలలూ కథలూచదివి వినిపించినపుడు అర్థంచేసుకోడంలోని క్లిష్టత పోతుందా?

జ: ఉన్నది ఉన్నట్టుగా చదివి వినిపిస్తే లాభంలేదు మధ్య మధ్యలో వివరించడం (పదాలను) ద్వారా కొంతవరకు ఉపయోగపడవచ్చు.

11 ప్ర: మాండలీకంలోవున్న పాటతో మమేకం అయినట్లుగా కథ నవలల్లో లీనంఅవుతున్నారా? కాకపోతే ఎందువల్ల?

జ: పాటల్తో మమేకమైనట్టు నవలల్లో లీనంకావడంలేదు.

1 పాటలు కష్టపడి చదవాల్సిన అవసరంలేదు.

2 ఒకవేళ చదివినా అది చిన్నగా ఉంటుంది (when campared to a story or a novel)

పాటలోనిభావం చాలావరకు ధ్వనితీవ్రతద్వారా మనకు దగ్గర అవుతుంది.

పాటను అనేకసార్లు వింటాం, ఎంతమంచిదైనా రెండుకంటే ఎక్కువసార్లు చదవము.

12 ప్ర: ఒక మాండలీకంలో వచ్చిన రచనను ఇతర మాండలీకాల్లోకి అనువదిస్తే ఎలాఉంటుంది?

జ: దీనికి మనజవాబు సరిపోదు. అనువాదం చాలాకష్టం అనుకొంటా భావాన్ని correct గా అనువాదం convey చేయకపోవచ్చు. కారణం మన మాండలీకానికితగ్గ పదాలు వాళ్ళకులేకపోవచ్చు. దానికి దగ్గరిపదం వాడడంవల్ల ఎక్కువ ప్రమాదం లేకపోయినప్పటికీభా పటీవ్రత తగ్గుతుందికదా!

13 ప్ర: మాండలీకంలో సినిమాతీస్తే నాటకంరాస్తే ఎలాఉంటుంది?

జ: నాటకం ఆయా ప్రదేశాల్లో ప్రదర్శించడానికి ఐతే (ఆయా ప్రాంతపు ప్రత్యేక సమస్యలగురించి) గొప్ప success అవుతుందనుకొంటా. పాటకన్నా ఎక్కువగా (ఎందుకంటే నాటకంలో పాత్రకు ప్రత్యక్షరూపం ఉంటుందికాబట్టి.)

ఇక సినిమా అన్నిప్రాంతాలకు వస్తుందికాబట్టి దాని విజయంమీద గ్యారంటీ ఏమీలేదు ఘోరంగా విఫలంకూడాకావచ్చు. కాని మరీ గ్రామీణపాత్రలను మాండలీకంలో మాట్లాడిస్తే బాగుంటుంది.

– కర్రి రమేష్‌రెడ్డి

1 జ. అర్థమవుతున్నది.

2 జ. తెలుగుదేశంలో మూడు ప్రత్యేకవిభాగాలుండడం, అవి ఎన్నోసంవత్సరాలుగా వివిధ రాజకీయ పరిస్థితుల్లో ఉండడం, దూరదూరంగా ఉండడంవల్ల ఒక మాండలికం ఇంకొకప్రాంతమువారికి చూడగానే అర్థమవడం కష్టమే. అదేక్లిష్టత. అయితే దీన్ని క్లిష్టతఅనవొద్దు. మాండలీకాల్లో రచనలు పెరిగేకొద్ది, స్పష్టత పెరుగుతుంది. ఒకప్రాంతపు మాండలికం, ఇంకొకప్రాంతపువారికి అవలీలగా అర్థమవుతుంది. పూర్తి distinct, diferent words ఉన్నాయి ప్రతి మాండలీకంలో. ఇతర భాషా పదాలువింటే ఎట్లాంటి ఆశ్చర్యం కలుగుతుందో, ఈ మాండలీకాలు విన్నాఅంతే. mobility ఉంటే జాతులు, జనముకలుస్తారట. మాండలీకాల్లో mobility రావాలంటే విస్తృతంగా మాండలికభాషలో రచనలురావాలి. విస్తృతప్రచారంగల పత్రికలు వాటిని వేయాలి.

3 జ. ఇద్దరిదీకాదు. అది ఈ సమాజంలోవి నికృష్టమయిన పరిస్థితి. రచయిత మొదటకొన్ని Articles లో ఫుట్‌నోట్స్‌లో అర్థాలుఇస్తే బాగుంటుంది. పాఠకుడి బాధ్యతకూడా ఎంతోఉన్నది, మాండలీకాల్ని ప్రోత్సహించటంలో.

4 జ. తప్పకుండా, ఎందుకంటే, 'విప్లవం' అనేది Common Subject సాహిత్యంలోని ఆ 'విప్లవ content' సరిగ్గా ఉపయోగించుకుంటే, మాండలికం అనే స్పృహలేకుండానే చదివించేస్తుంది మనిషిని. ఎలాఅంటే, ఆటగురించి ఏమీ తెలియకున్నా హాకీ, ఫుట్‌బాల్ చూస్తుంటే సామాన్య ప్రేక్షకునికికూడా ఉత్సాహంతో ఒళ్ళుతెలియనట్టు. అంతటా 'విప్లవసాహిత్యం' మాండలికంలో వచ్చినా వ్యాప్తి

చెందుతుంది. ఒకకథే ఉందనుకుందాము మాండలీకంలో. దానిపై ఇతర ప్రాంతపు 'సాహిత్యాభిమానులు' చర్చిస్తున్నారనుకుందాము. విధిగా వాళ్ళు తమకు తెలియకుండానే ఆ మాండలిక పదజాలాన్ని తమచర్చలో ఉపయోగిస్తారు. ఇప్పటికే తెలంగాణా ప్రాంతపుఎన్నోపదాలు కోస్తా, రాయలసీమల్లో తెలిశాయి అదేవిధంగా విశాఖపట్టణం యాసమనకు.

5 జ. తెలుగుదేశంలోని మధ్యతరగతి పాఠకుల్ని భ్రమాజనిత లోకాల్లోకి విహరింపచేసే రచనల్నిమాత్రమే ప్రచురిస్తున్న వార, మాసపత్రికలు ముఖ్యంగా కారణం, విప్లవసాహిత్యం వ్యాప్తి చెందకపోవడానికి. మాండలీకంలో, మాండలీకాల్ని ప్రోత్సాహం లేకుండా వ్యాప్తిచెందించలేము. ఎందుకంటే 'విప్లవపత్రికల' పాఠకుల, చందాదార్లసంఖ్య తక్కువకాబట్టి. అయినా నిరుత్సాహపడకుండా ముందుకు పోవాలి. ఎందుకంటె జీవభాషలో జీవముంటుంది కాబట్టి.

6. 7 జ. ఇది పూర్తిగాతప్పు. పాఠకున్ని రచయిత Guide చేయాలి కాని గందరగోళ పరిస్థితిలోవుంచకూడదు. రచనల్లో పాఠకునికి మార్గంచూపితే ఆ తర్వాత అతడే ఆ ఊపును అందుకుంటాడు.

8 జ. వివరణలు, వర్ణనలు పూర్తి మాండలీకంలో రాయాల్సినపనిలేదు. పాత్రపరమైన ఆలోచనలు, మాటలుతప్ప మిగతావి మాండలీకంలో రాయాల్సిన పని లేదు. ఎందుకంటే ఇది Transition Stage. కొన్నిరోజులు పోయాక పూర్తి మాండలికంలో రాసినా జనం అర్థంచేసుకుంటారు. మాండలీకాల్లోకూడా అవసరమైన మాటల్ని కొంత సులభంగారాసే అలవాటు రచయిత చేసుకోవాలి.

9 జ. కొంతవరకు మొదటిదశలో అర్థవివరణలు అవసరం. అర్థవివరణలు ఇవ్వకుండానే అర్థంచేసుకునే పరిస్థితి create అయ్యాక, రచనను చదివితే ఎంతో స్పష్టత, సుఖం ఉంటాయి.

10 జ. అవును. మాండలీకం తెలిసినవ్యక్తి చక్కగా విడమరచి చదివితే కథ స్పష్టంగాతెలుస్తుంది అవతలివాడికి. చదవడంలో తప్పకఇబ్బందే, మొదట.

11 జ. కాదు. పాట పైనచెప్పినట్టుగా ఊహచిత్రాల్ని create చేస్తుంది. కథ, నవల పెద్ద Plot కాబట్టి పాటతో మమేకమయినట్లుగా వీటిలో మమేకంకావడానికి కొద్దికాలంపడుతుంది.

12 జ. బాగుంటుంది. కాని వ్యక్తులపేర్లలో, స్థలాలపేర్లలో మార్పుచేయాలి. యాసలో మార్పుండాలి. పరిస్థితులకనుగుణంగా రచనను అన్వయించి అనువదించాలి.

— నిజాం వెంకటేశం

భూమయ్య కిష్టాగౌడ్ స్మారక ఉపన్యాసం :

ప్రభుత్వ హింస

జార్జ్ ఫెర్నాండెస్

భూమయ్య కిష్టాగౌడ్ స్మారకఉపన్యాసం ఇవ్వడానికి ఆహ్వానించడం భాగ్యం 1975లో ఎమర్జెన్సీరూపంలో చరిత్ర ఒక మలుపుతీసుకోకపోతే బహుశా మనం ఇవ్వాళ ఈసభ జరుపుకునేవారంకాదు. ఢిల్లీలోని పాలకపక్షం ఒకపక్క ఫాసిస్టు కుట్ర పన్నుతున్న తరుణంలో మేం కొందరం భూమయ్య కిష్టగౌడ్‌ల ఉరిశిక్షను రద్దు చేయించడంకోసం తీవ్రప్రయత్నాలు చేస్తూవున్నాము.

దానివల్ల నాకుకొన్ని రాజకీయసమస్యలు వచ్చాయి. వామపక్ష పార్టీలలోని కొందరుమిత్రులు మా ప్రయత్నాలతో సహకరించ నిరాకరించారు. మా సోషలిస్టు పార్టీలోసహితం, హింసను తమ రాజకీయసాధనంగా ఎంచుకున్నవారితో నేను సంపర్కంపెట్టుకున్నందుకు కోపగించుకున్నవారు ఉన్నారు. ఈ నక్సలైట్ల ప్రాణాలు రక్షించడానికి మనమెందుకు పోరాడాలి? అని వారు ప్రశ్నించారు.

ఎమర్జెన్సీరావడంతో మా ఆశలన్నీ అంతరించాయి. రహస్యజీవితం గడుపుతూన్న కాలంలో, లక్షలాది పీడితప్రజలకోసం అమరులయిన ఈ కామ్రేడ్లనిద్దరినీ ఉరితీసారని వినవచ్చింది. నేను ఆరోజుల్లో ప్రచురిస్తూవుండిన రహస్య బులెటిన్‌లో ఈవిధంగా రాసాను.

"అక్టోబర్‌లో స్పెయిన్‌దేశపు నియంత ఫ్రాంకో అయిదుగురు బేస్క్ తిరుగుబాటు దారులను ఉరితీసినప్పుడు యావత్ప్రపంచం అసహ్యించుకుంది. సోవియట్ రష్యా, దానిఉపగ్రహాలు, వందిమాగధులూగూడ ఆనిరసనతో గొంతుకలిపారు.

"ఇప్పుడు, డిసెంబర్ 1, 1975న హైదరాబాద్‌లో భూమయ్య కిష్టగౌడ్‌లను ఉరితీసారని తెలిసింది. స్వతంత్రభారతంలో రాజకీయ కార్యకర్తలను రాజకీయ నేరాలకు ఉరితీయడం ఇదే తొలిసారి.

"భూమయ్య కిష్టగౌడ్‌ల రక్తం ప్రతీకారాన్ని కోరుతోంది. ఆ ప్రతీకారం సాధించబడుతుందని మాత్రం నియంత ఇందిరకు హామీ ఇస్తున్నాం"

అయినప్పటికీ, అమూల్యమయిన ఈ రెండు ప్రాణాలను కాపాడలేకపోయామనే వెలితి నాలో మిగిలిపోయింది. ఆ కారణంగా, జనతాపార్టీ గెలిచిందని తెలియగానే, ఇంకా జెయిల్లో వుండగానే, నేను తయారుచేసిన మొదటి నివేదిక ఇది.

"జనతా ప్రభుత్వం ఉరిశిక్షను సత్వరం రద్దుచేయాలి. అంతవరకు, ఇప్పుడు శిక్షవిధించబడ్డ వారి ఉరిని నిలపాలి"

అయితే ఇక్కడగూడ నాకు ఫలితం దక్కలేదు.

ప్రజలపట్ల తన కర్తవ్యాన్ని నెరవేర్చమని నిలదీసే వారిమీదే భారతప్రభుత్వపు హింసలో అధికభాగం కేంద్రీకరించబడడం ఒక క్రూరమయిన విడ్డూరం. అందరికీ గూడ 'న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం' లభించాలని మన రాజ్యాంగంలో రాసుకున్నాముగాని భారతప్రభుత్వంమాత్రం అసమానమయిన లజ్జా విహీనతతో ప్రాథమిక హక్కులకు, ఆదేశసూత్రాలకు సంబంధించిన రెండు అధ్యాయాలను నిర్లక్ష్యంచేసింది.

మనదేశంలో రాజ్యం(State) కూడు, గుడ్డ, పని ఇమ్మని అడిగేవాళ్ళనుండి తన్నుతాను రక్షించుకునేస్థితికి దిగజారింది. నిరుద్యోగులు ఉద్యోగం, తిండి, ఇమ్మని అడిగితే వారికిలభించే సమాధానం లాఠీదెబ్బలు, జైళ్ళు, ఎక్కువైతే తుపాకీ గుళ్ళు. ప్రభుత్వం ప్రజలకు నివసించడానికి ఇళ్ళు కట్టివ్వదు. అలాగని ప్రజలు తమ నివాసం తాము ఏర్పరచుకుంటామంటే– అదీ బంగళాలలో కాదు బొంబాయి నగరం రోడ్లపక్కన– ఈ నికృష్టమయిన నివాసం గూడ వారికి లేకుండా చేయడానికి ప్రభుత్వం శాయశక్తులా ప్రయత్నిస్తుంది. గుజరాత్ నవనిర్మాణ్ ఉద్యమంలో, బీహార్ ఉద్యమంలో, జయప్రకాశనారాయణ్ నాయకత్వం వహించిన ఉద్యమంలో, ఇవ్వాళ అంతులేని సంరక్షించడంలో, ప్రభుత్వం అవినీతి పరులను అధికారంలో కొనసాగించడం కోసం ప్రజలను నిర్బంధించడానికి, వధించడానికి సంసిద్ధమే. గిట్టుబాటుధరలుకోరే రైతులనుండీ, న్యాయమయిన కూలి అడిగే వ్యవసాయకూలీల నుండి, అదితన్నుతాను సంరక్షించుకుంటుంది. ప్రభుత్వానికి అంతిమ ప్రమాణం దాన్ని నడిపే వర్గాలే.

అందుకే ప్రభుత్వహింసాకాండ యావత్తూ, శిష్టవర్గాలు సామాన్య ప్రజానీకం మీద నడిపేయుద్ధం స్వభావాన్ని కలిగివుంటుంది. ఏప్రిల్ 20 1981న ఇంద్రవెల్లిలో పోలీసులు కనీసం వందమంది అమాయక గిరిజనులను కాల్చివేసినప్పుడు జరిగిందిదే. ప్రభుత్వ అటవీశాఖ తమనుండి దోచుకున్న భూములను తమకు తిరిగిఇవ్వాలని కోరుతున్న గిరిజనులమీద ప్రభుత్వం ఆనాడు హింసను ప్రయోగించింది. రవీంద్రరెడ్డి పళ్ళయ్యలను సూర్యాపేట మేజిస్ట్రేటు ఇంటిబయట కాల్చినప్పుడు జరిగినహింసగూడ

ఈకోవకుచెందినదే. సామాజికంగాను ఆర్థికంగాను వెనుకబడ్డ గ్రామీణప్రజలకు న్యాయంచేకూర్చడంకోసం పోరాడేవాళ్ళపై ప్రభుత్వం ప్రయోగించే 'ఎదురుకాల్పుల'లో అమరులయిన వాళ్ళందరి పేర్లుచదివితే అది చాలపెద్ద జాబితాఅవుతుందిగాని, అదిలాబాద్ చంద్రపూర్ ప్రాంతాల గిరిజనులకోసం పోరాడినందుకు 'ఎదురుకాల్పు'కు గురి అయిన పెద్దిశంకర్‌నుమాత్రం స్మరించకతప్పదు. ఇవ్వాళబీహార్‌లో హరిజనులకు పేదరైతులకు భూస్వాముల దాడులను ఎదుర్కోవడంలో అండగానిలిచినందుకు అనేక మంది రాజకీయ కార్యకర్తలను చంపుతున్నారు. ఇదేకథ మళ్ళీ తమిళనాడులోను పంజాబులోను పునరావృతం అవుతుంది.

దీన్నిబట్టి ప్రభుత్వం ప్రజలమీద ప్రయోగించేహింస తాలూకు అంతరార్థం స్పష్టమవుతుంది. ప్రభుత్వం ఏవర్గాల భద్రతనయితే సంరక్షిస్తుందో ఆవర్గాల భద్రతను దెబ్బతీయగలవారిని నివారించడం ప్రభుత్వపుఉద్దేశ్యం. ఈశాన్యభారతంలోని ఏడురాష్ట్రాలలోను 1958 నాటి సాయుధదళాల (ప్రత్యేకఅధికారాల) చట్టం అమలులో వుంది. దీనిఅంత దారుణమైన, నీచమైనచట్టం మనరాజ్యాంగంలో మరొకటి లేదను కుంటాను. ఈచట్టంప్రకారం, సైనికులు ఏవ్యక్తినైనాసరే, అతని కార్యకలాపాలు రాష్ట్రభద్రతకు భంగంకలిగిస్తాయనిపిస్తే, కాల్చివేయవచ్చు. పార్లమెంటులో సభా నియమాల గురించి చర్చలు జరగవచ్చు. గౌహతిలోని తోలుబొమ్మలు తమస్వార్థ ప్రయోజనాలకోసం మంత్రివర్గాలనేర్పరచవచ్చు కాని అదంతాఒక అందమయిన కల్పన. వాస్తవమేమిటంటే ఈశాన్యభారతంలో శాంతిభద్రతల సంరక్షణపేరిట 180 వేల చదరపు కిలోమీటర్ల భూభాగంలో రెండుకోట్ల ప్రజలు మిలిటరీపాలనక్రింద జీవిస్తున్నారు.

భారతీయులంతగా తమపోలీసుల చేతుల్లోనే హింసను అనుభవించిన ప్రజలు వేరే ఏదేశంలోనూలేరు. మొదట్లో వలసవాదులు ప్రజలను అణిచివేయడానికి పోలీసులను ప్రయోగించారు. అయితే స్వాతంత్ర్యం తరువాతికాలంలోనే పోలీసులు మృగప్రాయంగా దిగజారారు. స్వాతంత్ర్యం తరువాతి మొదటిదశాబ్దంలో పోలీసుల కాల్పులలో చనిపోయినంతమంది, మొత్తం బ్రిటిష్ పరిపాలనాకాలంలోను చనిపోలేదు అటుతరువాతి రెండున్నర దశాబ్దాలు చవిచూసిన వ్యవస్థీకృతమయిన పోలీసుల హింసాకాండ మానవచరిత్రలో ఇంతవరకెన్నడూ కనీవినీ ఎరుగనిది. ఉత్తరప్రదేశ్‌లో, గత 18 మాసాలలో, 5 వేల మందికిపైగా "ఎదురుకాల్పుల"లో చంపబడ్డారు.

నిజానికి, పోలీసుల అమానుష ప్రవర్తనను ఉపేక్షించడంద్వారా, ఇంకా దాన్ని సమర్థించడంద్వారా, పోలీసులను ఉద్దేశ్యపూర్వకంగా పశుప్రాయమయిన స్థాయికి దిగజార్చే ప్రయత్నం జరుగుతోంది. ఎందుకంటే పోలీసయినవాడు ఏకార్మికుడి ఇంటనో కర్షకుడి ఇంటనో పుట్టివుంటాడని ప్రభుత్వానికి తెలుసు. 1857 నుండి విదేశీపాలనకు, అన్నిరకాల పీడనకు, వ్యతిరేకంగా ఉద్యమించిన ప్రజల సంతతే ఆ పోలీసు. అటువంటి వ్యక్తి విశ్వాసంమీద ప్రభుత్వానికి నమ్మకంలేదు. అందుకే, అతన్ని దిగజార్చాలి, పశుప్రాయంగా మార్చాలి, అతనిలోని మానవత్వాన్ని సాంతం నాశనంచేయాలి, అతన్ని ప్రభుత్వ అధీనంలోని ఒక సాయుధ యంత్రంగా మార్చాలి. అటుపైన, ప్రజలు తిరగబడ్డప్పుడు తన రక్తబంధువులయిన ఆ ప్రజలను చంపడానికి అతన్ని వాడుకోవాలి.

ప్రభుత్వం ఇట్లా చట్టపాలనకు స్వస్తి పలుకుతూ వుంటేమనం ఏంచేయాలనే ప్రశ్న వస్తుంది.

ఈ ప్రశ్నకు ఒకే మూసపూసలు సమాధానం వుందని నేననుకోవడం లేదు. ఎన్నో కార్యాచరణ విధానాలూ, పోరాటపద్ధతులూ మన ముందున్నాయి.

రాజ్యంమీద మనం ఎక్కుపెట్టిన ఈపోరాటం విజయవంతం కావాలంటే అధిక సంఖ్యాక ప్రజల్ని అందులో భాగస్తుల్నిచేయాలి. ఈ పోరాటం ఏ ఒక్క ఆలోచనా విధానపు గుత్తసొమ్ము కాదు.

నేనివాళ ఎవరి స్మృత్యర్థమైతే నా తలవంచుతున్నానో ఆ కామ్రేడ్స్ భూమయ్య కిష్టాగౌడ్‌లు ఆ పోరాటంలో భాగస్వాములు.

యుద్ధం మొదలైంది. మన మన పద్ధతుల్లో మనమీ యుద్ధం చేస్తున్నప్పటికీ మనం కలుసుకునే ఉమ్మడి వేదిక ఎల్లప్పుడూ ఉండే వుంటుంది.

[భూమయ్య కిష్టాగౌడ్ స్మారక ఉపన్యాసాల్లో మూడవదిగా 'ప్రభుత్వ హింస' అనే అంశం మీద డిసెంబర్ 1, 1981న జార్జిఫెర్నాండెజ్ గుంటూరులో చదివిన ప్రసంగ వ్యాసానికి సంక్షిప్తానువాదం.]

జాతుల సమస్య :

ప్రత్యేక విదర్భ ఉద్యమం - ఒక వివరణ

మహారాష్ట్ర విద్యార్థులు

భారతదేశంలో ఎన్నో జాతులున్నాయి. పెట్టుబడిదారీ విధానం అభివృద్ధితోనే జాతులు అభివృద్ధి చెందుతాయి గనుక భారతదేశంలో అనేకజాతులు ఇంకా సమగ్రంగా అభివృద్ధిచెందలేదు. మనదేశంలో మౌలికంగా ఇంకా పెట్టుబడిదారీ పూర్వ ఉత్పత్తి విధానమే ఉండి, పెట్టుబడిదారీ సంబంధాలు మెల్లమెల్లగా అభివృద్ధి చెందుతూ ఉండడంవల్ల జాతులుకూడా అభివృద్ధి చెందేక్రమంలోనే ఉన్నాయి. కనుకనే జాతులసమస్య వేరువేరు రూపాలు తీసుకుంటుంది. వేరువేరు మార్గాల్లో వెల్లడవుతుంది. ఈరూపాల్లో ప్రాంతీయ వ్యక్తిత్వ భావనకూడా ఒకటి. పెట్టుబడిదారీ విధానపు అభివృద్ధి వెనుకబడి ఉండడంవల్ల ప్రత్యేకమైన విభిన్న జాతులను ఒకే గొడుగు కింద ఐక్యం చేయలేకపోతోంది.

బ్రిటిష్ పాలకులు తమ పాలనాసౌకర్యం కోసం తీసుకున్న చర్యలతో సహా మరెన్నో చారిత్రిక కారణాలు దేశంలోని వివిధ జాతుల్లో ప్రాంతీయ వ్యక్తిత్వభావనను పెంచడానికి తోడ్పడ్డాయి. కొన్ని ప్రాంతాల్లోని పెట్టుబడిదారీ విధానపు అసమాభివృద్ధితో కలిసిన ఆర్థికవ్యవస్థ వెనుకబాటుతనం ఈ భావనను మరింత ఎక్కువ చేసింది. ఎక్కువగా వెనుకబడివున్న ఎన్నో ప్రాంతాల్లో ఈ వ్యక్తిత్వం విభిన్న ఉద్యమాల రూపం తీసుకుంది. ఐతే ఈ ఉద్యమాల డిమాండ్స్ వేరువేరుగా ఉండవచ్చు. కొందరు సీట్లలో, ఉద్యోగాలలో 'ప్రాంతీయులకే' రిజర్వేషన్‌లు కోరితే మరికొందరు భారీ పరిశ్రమలు, నీటిపారుదల ప్రాజెక్టులు కోరతారు. మరికొందరు ప్రత్యేకరాష్ట్ర ప్రతిపత్తి కూడా కోరతారు.

ఈ ఉద్యమాలన్నిటినీ దురహంకార పూరితమైనవనీ, అభివృద్ధి నిరోధకమైనవనీ ముద్రవేసి వ్యతిరేకించడం కొందరు మార్క్సిస్టులకు పరిపాటయిపోయింది. ఐతే ఈ ధోరణి ఈ ఉద్యమాల స్వభావాన్నీ, వాటికిఉన్న ప్రజాసహకారాన్నీ అర్థం చేసుకోక, వాటిని విప్లవానికి ఉపయోగించుకోవడంలో విఫలమవుతుంది. ఎన్నో ప్రాంతాల్లో వెనుకబాటుతనాన్నీ, కొన్ని ప్రాంతాల్లోనే పారిశ్రామిక కేంద్రీకరణనూ కొనసాగించడంలో, అసమఆర్థిక, సాంఘికాభివృద్ధి సాధించడంలో దళారీ బూర్జువా వర్గం బ్రిటిష్ సామ్రాజ్యవాదుల విధానాలనే అనుసరిస్తున్నది. వలసపాలనను వ్యతిరేకించే క్రమంలో మనదేశంలో ఈ శతాబ్దిలోనే జాతుల ఆవిర్భావం మొదలైంది. ఐతే భాషారాష్ట్రాల నిర్మాణం అనే తన వాగ్దానాన్ని కాంగ్రెస్ నిలబెట్టుకోకపోవడం

వల్ల, 1947 తర్వాతనే పెద్దఎత్తున జాతిఉద్యమాలు మొదలయ్యాయి. ఈ విధంగా దళారీ బూర్జువావర్గానికీ వివిధ జాతులకు చెందిన పెట్టుబడిదారీ వర్గానికీ, పెటీబూర్జువా వర్గానికీ, మధ్య ఖచ్చితమైన వైరుధ్యం ఏర్పడింది. ఇది భాషారాష్ట్రాల కోసం పెద్ద ఎత్తున ఆందోళనలు జరగడానికి దారితీసింది. భాషాప్రయుక్తరాష్ట్రాల నిర్మాణం జరిగినప్పటికీ బలమైన కేంద్రప్రభుత్వం ద్వారా దళారీ బూర్జువావర్గం ఎక్కువభాగం అధికారాన్ని తన గుప్పెట్లో పెట్టుకోగలిగింది. ఇందువల్ల దేశంలోని వివిధ జాతులు స్వేచ్ఛాయుతమైన, సంపూర్ణమైన అభివృద్ధిని సాధించలేకపోయాయి. అలాగే ఈ రాష్ట్రాల్లో కొనసాగుతున్న వెనుకబాటుతనంవల్ల కూడా వివిధరాష్ట్రాలూ, జాతులూ ఒకే సమైక్యత ఆర్థికవ్యవస్థగా ఐక్యం కాలేకపోయాయి. ఈ కారణంవల్లనే ఈ వివిధ రాష్ట్రాల భూస్వామ్య, పెట్టుబడిదారీ వర్గాలకూ కేంద్ర గుత్త దళారీ పెట్టుబడిదారీ వర్గాలకూ మధ్యనేకాక ఒకేజాతిలోని వివిధ ప్రాంతాల ప్రజల మధ్య కూడా వైరుధ్యాలు పొడసూపడం ప్రారంభమైంది. బాగా వెనుకబడిన ప్రాంతాల వ్యాపార, బూర్జువా, భూస్వామ్య, పెటీబూర్జువా వర్గాలు ఇతర ప్రాంతాలకు చెందిన అవేవర్గాలతో లేదా ఈ వెనుకబాటుతనాన్ని పెంచి పోషిస్తున్న పాలక వర్గాలతో వైరుధ్యం కలిగివున్నాయి. ఒక ప్రాంతంమీద అధికారం చెలాయిస్తున్న మరో ప్రాంతసంస్కృతిపట్ల కూడా వ్యతిరేక తచూపబడుతున్నది. ఈ వైరుధ్యాలు తమంతతామే ఏర్పడి ప్రాంతీయ ఉద్యమాల రూపంలో వ్యక్తీకరించబడుతున్నాయి.

మహారాష్ట్రలోకూడా మరాట్వాడా, విదర్భప్రాంతాల్లో ఇలాంటి ఉద్యమాలు తలెత్తాయి. 1974లో మరాట్వాడాలో ఆర్థికాభివృద్ధికోరుతూ విస్తృతస్థాయిలో విద్యార్థి ఆందోళన చెలరేగింది. విదర్భకు ప్రత్యేకరాష్ట్ర ప్రతిపత్తిని డిమాండ్‌చేస్తూ సాగిన ఉద్యమానికి ఎంతోచరిత్రఉంది. ఈసమస్య ఈశతాబ్ది ప్రారంభంలో తలెత్తింది. ఐతే దీనికి సంబంధించిన నిర్దిష్ట చరిత్రలేకపోవడంవల్ల దీనిక్రమాన్నీ, అభివృద్ధినీ తెలుసుకోవడం సులభసాధ్యంకాదు. ఆ ఉద్యమానికి ఒక వివరణ ఇచ్చేప్రయత్నం ఈవ్యాసంలో జరిగింది,

చరిత్ర : మహారాష్ట్రచరిత్రలో 17, 18 శతాబ్దాలు అతిముఖ్యమైనవి. ఈ కాలంలోనే ఒక స్థానిక నాయకుని నాయకత్వంకింద మరాటాజాతి అంతా ఒకేరాజ్యంగా రూపుదిద్దుకుంది. ఈ కాలానికిముందూ, తర్వాతా, బ్రిటిష్‌పాలనా కాలంలోనూ విదర్భ కోస్తా, పశ్చిమ మహారాష్ట్రలకు భిన్నమైన చరిత్ర కలిగిఉంది. విదర్భగా పిలవబడే

ప్రాంతంలో బేరార్ ప్రాంతానికి చెందిన యవత్‌మల్, అకోలా, బుల్ధానా, అమరావతి జిల్లాలు, నాగపూర్ ప్రాంతానికి చెందిన భండారా, చంద్రపూర్, నాగపూర్, వార్ధా జిల్లాలు ఉన్నాయి. ఈ ప్రాంతానికి కోస్తాతోనూ సీమాంధ్రతోనూ సంబంధం పెరగకుండా చూడడంలో పడమటికనుమలు తోడ్పడ్డాయి. మౌర్యసామ్రాజ్య పతనం తర్వాత, ఉత్తర, దక్షిణభారతాల్లోని పాలకుల ఆధీనంలోకిరాని సమయాల్లో విదర్భలో పెద్దరాజ్యాలే నిర్మించబడ్డాయి. వేదకాలంలో ఈప్రాంతాన్నిపాలించిన భోజ్ పాలకుల రాజ్యంలో విదర్భ మొదటిది. ఉత్తరభారతాన్ని గుప్తులు పాలిస్తున్నకాలంలో బేరార్ ప్రాంతంలో వాకాటకులు తమపాలనను నెలకొల్పారు. మధ్యభారతదేశాన్ని రెండువందలఏళ్ళపాటు పాలించిన రాష్ట్రకూటులకు ఎనిమిదో శతాబ్దంలో విదర్భ కేంద్రస్థానమయింది. ఇది హిందువులకేగాక జైనులకు, బౌద్ధులకుకూడా పవిత్ర స్థలంగా ఉండింది. దేశంలోని మూడు సంస్కృత పాఠశాలల్లో ఒకటి ఇక్కడఉండడం వల్ల ఇది సాంస్కృతిక కేంద్రంగాకూడా ఉండింది. ఆ తర్వాత ఈ ప్రాంతంలో కొంతభాగం గోండురాజ్యంలోకీ, బేరార్ భాగం ఢిల్లీఅధీనంలోకీ పోయాయి. ఆ తర్వాత మరాటాలు ఈప్రాంతాన్ని కోస్తా, తూర్పుమహారాష్ట్ర ప్రాంతాలతో ఐక్యం చేశారు. భోస్లేలు నాగపూర్‌ను తమ రాజధానిగా చేసుకున్నారు. బేరార్ మాత్రం హైదరాబాద్ నిజాం పాలనలోకి పోయింది. బ్రిటిష్ వాళ్ళు 19వ శతాబ్దం ప్రారంభంలో మరాటాలను ఓడించి ఈ ప్రాంతాన్ని ముక్కలు ముక్కలుగా కలిపేసుకున్నారు. ప్రస్తుత చంద్రాపూర్, భండారా, వార్ధా, నాగపూర్ జిల్లాల ప్రాంతం కేంద్రరాష్ట్రంలో భాగంకాగా, 1903 లో బేరార్ అధికారికంగా బ్రిటిష్ పాలన కిందికివచ్చి కేంద్ర రాష్ట్రంలో కలపబడింది. ఐతే నిజానికి బేరార్ ప్రాంతం మీద బ్రిటిష్ అధికారం ఎంతో ముందునుంచే ఉంది. ఈవిధంగా నాగపూర్, బేరార్‌లు కలిసిన మహావిదర్భ ప్రాంతం మరాటీభాషా ప్రాంతమైనప్పటికీ, వెనుకబడిన, ఎక్కువగా హిందీ భాషా ప్రాంతమైన కేంద్ర రాష్ట్రంలో కలపబడింది. అట్లా ఈ ప్రాంతానికి తన స్వంత ప్రాంతీయ వ్యక్తిత్వభావన వచ్చింది.

ప్రత్యేక విదర్భ కోసం రాజకీయోద్యమం : ఈ ఏర్పాటు మరాటీమాట్లాడే ప్రజలకు కేంద్రరాష్ట్రంలోని మిగతా ప్రజల కంటె భిన్నమైన వ్యక్తిత్వాన్నిచ్చింది. కనుకనే ఐక్యమహారాష్ట్ర డిమాండ్ కంటె ఎంతో ముందే ప్రత్యేక మహావిదర్భ డిమాండ్ పెల్లుబికింది. బేరార్‌ను తాను తిరిగి తీసుకుంటానని 1933 లో హైదరాబాద్ నిజాం ప్రకటించినప్పుడు బేరార్‌లో ఎంతో తడబాటుకనిపించింది. బేరార్ కాంగ్రెస్ నాయకులు ప్రత్యేక రాష్ట్రడిమాండ్‌ను మరింత శక్తివంతంగా ముందుకు తెచ్చారు.

ఈ ప్రాంతంలో ప్రభవంవేసిన బ్రాహ్మణ వ్యతిరేక ఉద్యమనాయకులు 1930 ల్లో కాంగ్రెస్‌లో చేరడం ద్వారా కాంగ్రెస్‌బలాన్ని హెచ్చుచేశారు. ఇట్లా కాంగ్రెస్‌లో చేరిన వాళ్ళలో పండరిపాటిల్, గోపాల్‌రావు ఖేడ్కర్, పి. కె. దేశముఖ్ మొదలైన వాళ్ళంతా దురుకైన ప్రత్యేక రాష్ట్రవాదులే. ఐతే ఖేడ్కర్ ఆ తర్వాత ఈడిమాండ్‌ను వ్యతిరేకించారు.

ఈ ప్రాంతపు కాంగ్రెస్‌పార్టీలో అధికసంఖ్యాకులు ఈ డిమాండ్‌ను బలపరిచారు. 1938 లో కేంద్రరాష్ట్రాల శాసనసభ, బేరార్ శాసనసభలు ఈ డిమాండ్‌ను సమర్థిస్తూ ఏకగ్రీవ తీర్మానాలు ఆమోదించాయి. కాంగ్రెస్ వాదులైన ఎం ఎస్ ఆనీ, బ్రిజ్‌లాల్ బియానీ ఈ ప్రచారంలో చురుగ్గాపాల్గొన్నారు. వాళ్ళు 1960 తర్వాత కూడా ఈడిమాండ్ నుంచి వెనక్కి పోలేదు. వాళ్ళు 1940 లో 'మహావిదర్భసభ'ను ప్రారంభించారు. అగస్టు 1947 స్వాతంత్ర్యం రావడానికి ముందు దక్కన్, విదర్భ కాంగ్రెస్‌ల నాయకులు కలిసి ఆకోలా ఒప్పందంపై సంతకాలు చేశారు. ఈ ఒప్పందంలో వాళ్ళు రెండు విషయాలు సూచించారు. 1. ఒకవేళ సంయుక్త మహారాష్ట్ర ఏర్పాడేటట్లయితే దక్కన్, విదర్భ - రెండు ఉపపాలనా విభాగాలుగా- దాంట్లో భాగంగా ఉంటాయి. ఈ రెండు ప్రాంతాల్లోనూ ప్రత్యేకశాసనసభలూ, మంత్రివర్గాలూ, హైకోర్టులూ, ప్రాంతీయస్థాయి మంత్రివర్గాలూ ఉండాలి. 2. సంయుక్త మహారాష్ట్ర ఏర్పడక పోతే ప్రత్యేక విదర్భ రాష్ట్రాన్ని ఏర్పరచాలి.

సంయుక్త మహారాష్ట్ర డిమాండ్ ఇంకా బలంగా లేనిసమయంలో ప్రత్యేక విదర్భ కోరిక సంయుక్త మహారాష్ట్ర నిర్మాణంవైపు ఒక అడుగు అవుతుందా కాదా అని సందేహం కలిగింది. మరాటీ జాతీయభావం అంకురించింది గాని బొంబాయి స్థాయి వల్ల అది స్పష్టమైన రూపం తీసుకోలేదు. సంయుక్త మహారాష్ట్రలో ఏఏ ప్రాంతాలు ఉండాలనే వివాదం కూడా తలెత్తింది. భారత బడాబూర్జువావర్గం భారతదేశపు పారిశ్రామిక, వాణిజ్య రాజధానిఐన బొంబాయిని తన అధీనంలో ఉంచుకోవాలనే పట్టుదలతో ఉండింది. ఈ అధికారాన్ని మహారాష్ట్ర భూస్వామ్య, బూర్జువావర్గాలతో పంచుకునేందుకు వాళ్ళు సిద్ధంగాలేరు. కనుక బొంబాయిలేకుండా మహారాష్ట్ర ఏర్పాటు సూచన వచ్చింది. కాని అలా ఏర్పాటయ్యేరాష్ట్రం ఆర్థికంగా వెనుకబడిఉంటుంది. ఇప్పటికే బొంబాయి తప్ప మహారాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఎంతో వెనుక బడేఉంది. కాంగ్రెస్ ప్రభుత్వం 1947 లో నియమించిన భాషా రాష్ట్రాల కమిషన్ 1948 లో మరాటీ భాషా రాష్ట్రాలు రెండు ఏర్పాటు చేయాలని సిఫారసు చేసింది. సంయుక్త

మహారాష్ట్ర ఏర్పాటుకు స్పష్టమైన కోరికలేదనేది గుర్తించినకమీషన్ బొంబాయితో దక్కన్, విదర్భ వేరువేరు రాష్ట్రాలుగా ఉండాలని సిఫారసు చేసింది. ప్రాంతీయ కాంగ్రెస్ నాయకత్వంలోని ఒకసెక్షన్ సమావేశాలద్వారా, ప్రతినిధి బృందాలద్వారా సభలద్వారా ప్రత్యేక విదర్భ డిమాండ్‌ను వెల్లడిచేస్తూనేఉన్నది. కాని ఈ సమయానికే కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకవిదర్భ ఆలోచనను మానుకున్నది.

1948 తర్వాతికాలంలో మరాటీ జాతిసమస్య ముఖ్యంగా ముందుకువచ్చి ప్రత్యేక విదర్భ డిమాండ్ మరుగునపడిపోయింది. ప్రజాఉద్యమం ఫలితంగా మొట్టమొదటి సారిగా ఆంధ్రప్రదేశ్‌ను 1953లో భాషారాష్ట్రంగా ఏర్పాటుచేశాక బొంబాయితో కలిసిన సంయుక్త మహారాష్ట్ర డిమాండ్‌కు బలంవచ్చింది. మహాగుజరాత్ ఉద్యమం కూడా ప్రారంభమైంది. ఈ సమయానికే కాంగ్రెస్ భాషారాష్ట్రాల డిమాండ్‌కు వ్యతిరేకంగా అధికారికంగా బయటపడిపోయింది. సిపిఐతోసహా అన్ని ప్రతిపక్షపార్టీలు మహారాష్ట్ర డిమాండ్‌ను బలపరిచాయి. బొంబాయిరాష్ట్రంలో బొంబాయిపై అధికారం గురించి మహారాష్ట్ర, గుజరాత్ బూర్జువావర్గాలకు ఒకరితో ఒకరికి వైరుధ్యంఉండేది, దళారీ బూర్జువావర్గంతోనూ వైరుధ్యంఉండేది. 1955లో రాష్ట్రాల పునర్నిర్మాణ కమీషన్ వివిధజాతుల ఆకాంక్షలను గుర్తిస్తూ భాషారాష్ట్రాల విధానాన్ని అంగీకరించింది. కాని పశ్చిమ భారతానికొచ్చేసరికి కమిషన్ బొంబాయిని మహారాష్ట్రకో గుజరాత్‌కో ఇవ్వకుండా ఒక రెండుభాషల బొంబాయిరాష్ట్రం, ఒక ప్రత్యేక విదర్భ రాష్ట్రం ఉండాలని సిఫార్సుచేసింది. కేంద్రప్రభుత్వం ప్రత్యేకవిదర్భ సూచనను ఆమోదించకుండా విదర్భను బొంబాయిరాష్ట్రంలో భాగంగామార్చింది. బహుశా ఈ ప్రాంతంలోని విలువైన ఖనిజనిలువలవల్లా, ఇతరవనరులవల్లా ప్రాంతీయపెట్టుబడిదార్లకూ, భూస్వాములకూ ఈ ప్రాంతాన్ని వదలకపోయిఉండవచ్చు.

మరింత శక్తివంతంగా వెలువడిన ప్రత్యేక విదర్భడిమాండ్ ఇంకావిస్తృతమైన సంయుక్త మహారాష్ట్ర పోరాటంలో కలిసిపోయింది. కాంగ్రెస్‌సభ్యులు కొంతమందితోసహా అన్ని ప్రతిపక్ష పార్టీలు ఈ ఉద్యమాన్ని సమర్థించాయి; పాల్గొన్నాయి. దళారీ, బడాబూర్జువాలకు ప్రాతినిధ్యం వహించే బొంబాయి కాంగ్రెస్‌నాయకులు ఉద్యమాన్ని వ్యతిరేకించగా బియానీ, ఆనీ, కన్నమ్వార్‌వంటి విదర్భ కాంగ్రెస్ నాయకులు ప్రత్యేక విదర్భ డిమాండ్‌ను సమర్థించారు. ఏర్పడబోయే కొత్తరాష్ట్రంలో బొంబాయికోసంవిదర్భ నిర్లక్ష్యం చేయబడుతుందని, నాగపూర్ ప్రాముఖ్యత తగ్గిపోతుందని భయపడ్డారు. కాని ఆదశలో వాళ్ళ ప్రత్యేకరాష్ట్ర డిమాండ్ ప్రజాందోళనా

రూపంతీసుకోలేదు. సంయుక్త మహారాష్ట్రకోసం సాగిన ప్రజాందోళనలో ఈడిమాండ్
చివరిస్థానాన్నే పొందింది. ఈ ఆందోళనల్లో పోలీసుకాల్పుల్లో 105 మంది తమప్రాణాల్ని
పోగొట్టుకున్నారు. బొంబాయి రాష్ట్రాన్ని విడదీసి బొంబాయిని మహారాష్ట్రకు ఇవ్వవల
సిన స్థితికి ప్రభుత్వం నెట్టబడింది.

ఈ విభజన జరిగిన మే 1, 1960 నాటికి విదర్భలో ప్రత్యేకరాష్ట్రంకోసం
హింసాయుత అల్లర్లు సాగుతున్నాయి. ప్రత్యేకరాష్ట్ర ప్రతిపత్తి నిరాకరణకు వ్యతి
రేకంగా ఉద్యమం ప్రారంభించిన నేరానికి నాగవిదర్భ ఆందోళన సమితినాయకులు
రెండునెలలక్రితమే అరెస్టుచేయబడ్డారు. ఏప్రిల్ 25న వాళ్ళువిడుదలయి, మే 1న ఈ
నిర్ణయంరాగానే పెద్దఎత్తున అల్లర్లు చెలరేగాయి. పోస్ట్ ఆఫీసులు, పోలీసుస్టేషన్లు
మొదలైన ప్రభుత్వఆస్తులపై దాడులుజరిగాయి. కాని నాయకత్వం కాంగ్రెస్‌చేతిలో
ఉండడంవల్ల వాళ్ళు త్వరగానే రాజీపడ్డారు. ఆందోళన చల్లారిపోయింది.

1960 తర్వాత : మహారాష్ట్ర ఏర్పాటులో విదర్భ భావనను జోకొట్టడానికీ,
దళారీల, సామ్రాజ్యవాదుల ప్రయోజనాల్ని కాపాడడానికీ అవసరమైన చర్యలన్నీ
తీసుకోబడ్డాయి. నాగపూర్ ఒప్పందం ప్రకారం బొంబాయినగర స్థాయిని అలాగే
ఉంచి నాగపూర్ ప్రాముఖ్యతను పరిరక్షించాలనే నిర్ణయం తీసుకోవడం జరిగింది.
ఇందుకై నాగపూర్‌లో ఒక విడత శాసనసభా సమావేశాలు జరగాలనీ, ఒక హైకోర్టు
బెంచి ఏర్పాటుచేయాలనీ, ప్రతిఏటా కొంతకాలంపాటు మంత్రివర్గాన్ని నాగపూర్‌కు
తరలించాలని సూచనలు వచ్చాయి. ఆఖరి సూచనతప్ప మిగిలినవన్నీ అమలుపరచ
బడ్డాయి ఒక్క మహారాష్ట్రలోనే శాసనసభ రెండు నగరాల్లో సమావేశమవుతుంది.
ఇక్కడి కాంగ్రెస్ నిర్మాణాన్నిబట్టి- ఒక్క రాష్ట్రంలోనే రెండు ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీలు
ఉండడాన్నిబట్టి- దళారీవర్గ ప్రయోజనాల్ని కాపాడడం ఎంతగా జరిగిందో తెలుస్తుంది.
బొంబాయిపిసిసి, మహారాష్ట్ర పిసిసి వేరువేరుగా వున్నాయి.

1962 లో ప్రత్యేక రాష్ట్రడిమాండ్ మళ్ళీ ముందుకువచ్చింది. అయితేకాంగ్రెస్
నాయకుడు కన్నమ్వార్‌కు ముఖ్యమంత్రిపదవి ఇవ్వడంతో అది ఆందోళనారూపం తీసు
కోకముందే అడ్డుకోబడింది.

పశ్చిమ మహారాష్ట్రలోని రాహులిలో వ్యవసాయ విశ్వవిద్యాలయం స్థాపించా
లనే ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా విదర్భ అంతటా జులై 1968 లో పెద్దఎత్తున
ఆందోళనలు చెలరేగాయి. నిర్లక్ష్యం చేయబడిన విదర్భ ప్రాంతంలో ఈ విశ్వవిద్యా
లయం తెరవాలని డిమాండ్ చేయడం జరిగింది. ఈ ఉద్యమాన్ని ప్రారంభించింది

విద్యార్థులు, మూడునెలలపాటు ఉద్యమాన్ని కొనసాగించడంలోను విద్యార్థులే ప్రధాన శక్తిగా ఉన్నారు. నాగపూర్, అమరావతి, అకోలా కాలేజీల్లో ప్రారంభమైన సమ్మె మిగతా ప్రాంతమంతటికీ వ్యాపించింది. నాగపూర్ శాసనసభా సమావేశంజరిగే నవంబర్ 1968 నాటికి ఈ ఉద్యమాన్ని ప్రత్యేకరాష్ట్ర ఆందోళనగా మార్చాలనే ప్రయత్నం జరిగింది. అప్పుడు ఆజాద్‌విదర్భసేన, నాగవిదర్భ ఆందోళన సమితిల క్రియాశీల నాయకత్వంలో ఈ ఉద్యమం సాగింది. ఫార్వర్డ్‌బ్లాక్ నాయకుడు జంబు వంతరావుధోపే కూడా అగ్రభాగాన నిలిచాడు.

మే 1970 లో ఆందోళన తిరిగి ప్రారంభమైంది. మహారాష్ట్ర అవతరణదినమైన మే 1న విదర్భ అంతటా పూర్తిబంద్ జరిగింది. నాగపూర్ దగ్గరలో పూల్‌గాంవ్ అనేచోట ఒక పెద్దప్రదర్శనమీద కాల్పులుకూడా జరిగాయి. నిరసనగా మళ్ళీ పెద్ద ఎత్తున బంద్‌లు జరిగాయి. ఇట్లాగే ఈ ఆందోళన ఊగిసలాడే తీవ్రతతో కొంతకాలం పాటు సాగింది. ఆ నవంబరు నాగపూర్‌లో జరగవలసిన శాసనసభా సమావేశాలు ఆందోళన తీవ్రస్థాయికి చేరుతుందేమోననే భయంతో రద్దుచేయబడ్డాయి.

సెప్టెంబర్ 1971లో నాగపూర్లో ఒక బ్రహ్మాండమైన ప్రదర్శనతో ఆందోళన తిరిగి ప్రారంభమైంది. పోలీసుకాల్పుల్లో ఆరుగురు మరణించడంతో తిరిగి విదర్భ అంతటా నిరసన ప్రదర్శనలు ఉవ్వెత్తునలేచాయి. ఈ సంఘటన మీద ప్రభుత్వం న్యాయవిచారణ ప్రారంభించడంతో ఉద్యమం ఆగిపోయింది. నవంబర్ 1972 లో కూడా చిన్నగా ఆందోళన పొడసూపింది. మే 1973 లో ఆందోళన మళ్ళీప్రారంభమై బ్రహ్మాండమైన ప్రదర్శనలు, బంద్‌లు జరిగాయి. ఇవి పోలీసుకాల్పులకూ, సామూహిక అరెస్టులకూ దారితీశాయి. ఈ ఆందోళనల్లో నాగపూర్ కార్మికవర్గం పాలుపంచుకోలేదు. ఈ ఆందోళనలను బలపరిచింది, వాట్లోపాల్గొన్నదీ ఎక్కువగా విద్యార్థులూ, పట్టణ ప్రజలూ.

ఎమర్జెన్సీ ఎత్తివేసిన తర్వాత జనతా, ఆర్‌పిఐ లాంటి ప్రతిపక్ష పార్టీలు ఈ డిమాండ్‌ను ముందుకు తెచ్చాయి. 1977 తర్వాత ధోపేవిదర్భ బంద్‌కు ఇచ్చిన పిలుపు లేవీ విజయవంతంకాలేదు. కారణం కొంతవరకు ధోపేకూ అతని మిత్రులకూ మంచి పేరు తగ్గిపోయింది. ధోపే 1979 లో ఇందిరా కాంగ్రెస్‌లో చేరాడు. ఇక అప్పటినుంచి ఆయనా, వసంత్‌సాఠే ఎక్కడ సభల్లోనైనా ఈ సమస్యను లేవనెత్తుతూనే ఉన్నారు. గత సంవత్సరం విదర్భలో ఒక పెట్రో-కెమికల్ కాంప్లెక్స్ నెలకొల్పాలని కూడా డిమాండ్ చేయడం జరిగింది.

ప్రత్యేక విదర్భ డిమాండ్ ఎంతోకాలంకింద వచ్చినా, సాధారణ ప్రజానీకంలో ప్రాంతీయ వ్యక్తిత్వభావన బలంగాఉన్నా ఉద్యమం ఎప్పుడూ కొనసాగించబడలేదు, లేదా తెలంగాణ, ఆంధ్ర, జార్ఖండ్‌లలో లాగా క్రియాశీలంగానూ, దృఢంగానూకూడా జరగలేదు.

ఆర్థికనేపథ్యం: ప్రత్యేకరాష్ట్ర డిమాండ్‌కు బీజాలు పాక్షికంగా ఈ ప్రాంతపు ఆర్థిక పరిస్థితిలోనే ఉన్నాయి. మరాట్వాడాలాగా, పశ్చిమ మహారాష్ట్రలోని కొన్ని ప్రాంతాలలాగా విదర్భ కరువుప్రాంతం కాదు. నీటిపారుదల సౌకర్యాలు ఎంతో వెనుకబడిఉన్నప్పటికీ వ్యవసాయ ఉత్పాదకశక్తి గణనీయంగానే ఉంది. వ్యవసాయ ఉత్పత్తి ఎక్కువగానే ఉంది. పత్తి, నూనెగింజల లాంటి వాణిజ్యపంటలు విస్తారంగా సాగుచేయబడుతున్నాయి. మొత్తం మహారాష్ట్రలోని ఖనిజవనరుల్లో మూడింటరెండు వంతులు, అటవీసంపదలో నాల్గింట మూడువంతులు విదర్భలోనే ఉన్నాయి. బొగ్గు, ఇనుపఖనిజం, మాంగనీస్, సున్నపురాలు, కావ్‌లిన్, డోలమైట్, క్రోమైట్, లాంటి ఎన్నో ఖనిజాలు విదర్భలోని అనేక ప్రాంతాల్లో కనుక్కోబడ్డాయి. ఇవన్నీ ఆధునిక పరిశ్రమలకు అవసరమైన ఖనిజాలు కావడంవల్ల ఈ ప్రాంతానికి విపరీతమైన పారిశ్రామిక ఉత్పాదకశక్తి ఉంది.

మహారాష్ట్ర ఏర్పాటుతర్వాత ఈ ప్రాంతంలో స్వేచ్ఛాయుతమైన, సంపూర్ణమైన పారిశ్రామికాభివృద్ధి జరిగిఉన్నట్లయితే బహుశా ప్రత్యేకరాష్ట్ర డిమాండ్ నిలిచి ఉండేదికాదు. ఆవిధంగా ఈ ప్రాంతీయ ఆర్థికవ్యవస్థ రాష్ట్ర ఆర్థికవ్యవస్థలో సవ్యంగా సమ్మిళితమైఉండేది.

కాని మహారాష్ట్ర ఏర్పాటుతర్వాత దళారీ బూర్జువావర్గం బొంబాయిమీద అధికారాన్ని హస్తగతంచేసుకొని, సుస్థిరంచేసుకొని థానే-పూనా ప్రాంతానికి విస్తరించింది. మిగిలిన ప్రాంతమంతా నిర్లక్ష్యంచేయబడి ఈప్రాంతం విపరీతమైన పారిశ్రామికాభివృద్ధి సాధించింది. కొంతవరకు మరాట్వాడాలో ఔరంగాబాద్, విదర్భలో చంద్రపూర్, నాగపూర్‌లాంటి ఎంపికచేసుకున్న స్థలాల్లోమాత్రం పారిశ్రామికాభివృద్ధి జరిగింది. మొత్తానికి మరాట్వాడా, విదర్భ ప్రాంతాల్లో సాంప్రదాయిక పరిశ్రమలు దెబ్బతినడమేగాక, ప్రత్యామ్నాయమేదీ అభివృద్ధికానిస్థితి ఏర్పడింది.

వ్యవసాయరంగంలోకూడా పశ్చిమమహారాష్ట్ర - పూనా ప్రాంతంమాత్రమే అభివృద్ధిని చవిచూసింది. చెరకుసాగు, చక్కెరఉత్పత్తికై చెరకు సహకారసంఘాలు

రాష్ట్రంలో ఈ ప్రాంతపు ఫ్యూడల్, కులక్ వర్గాల ఆర్థిక రాజకీయాధికారం పెరగడానికి తోడ్పడ్డాయి.

ఈక్రమం 1960ల్లో విస్తృతంగా జరిగినందువల్లనే మరాట్వాడాలోనూ, విదర్భలోనూ 1960ల చివరిభాగంలో ఆందోళనలు చెలరేగాయి.

ముగింపు : వివిధ చారిత్రిక, ఆర్థిక కారణాలఫలితంగా, దేశంలోని వివిధ ప్రాంతాల్లో పెట్టుబడిదారీ విధానపు అసమాభివృద్ధి ఫలితంగా ప్రత్యేకవిదర్భ ఉద్యమం వచ్చింది. భారత రాజకీయార్థిక జీవనంపై దళారీ బూర్జువావర్గపు అధికారం వాళ్ళ ప్రయోజనాలకూ, వివిధజాతుల, ప్రాంతాల బూర్జువా, వ్యాపార, ఫ్యూడల్‌వర్గాల ప్రయోజనాలకూమధ్య వైరుధ్యాన్ని సృష్టించింది. బొంబాయివంటి రక్షితప్రాంతాల్లో పారిశ్రామికీకరణను కేంద్రీకరించి, కొన్నిప్రాంతాలను వెనుకబాటుతనంలోనేఉంచి ఆ ప్రాంతాల ముడిసరుకులనూ, శ్రమశక్తినీ దోపిడీచేయాలనే దళారీ బూర్జువావర్గపు ప్రయత్నాలు ఈ వైరుధ్యాన్ని తీవ్రతరంచేశాయి. అదేసమయంలో ఉన్నత విద్యావ్యాప్తివల్ల గణనీయంగా రూపొందిన పెటీబూర్జువావర్గం తమప్రాంతాల్లో ఆర్థిక వ్యవస్థ మందకొడితనంవల్ల నిరాశకు గురికావడం మొదలయింది. ఈరకమైన వైరుధ్యాలవల్లా, నైరాశ్యంవల్లా విదర్భఉద్యమం ఉద్భవించింది. కనుకనే అది ప్రజా సహకారం పొందింది.

కాని ఈ ఉద్యమం ఎప్పుడూ పాలకపార్టీ (కాంగ్రెస్)తో మిలాఖతైన స్థానిక వ్యాపార, బూర్జువావర్గాల నాయకత్వంలోనే జరిగింది. అందువల్ల నాయకత్వం ఉద్యమానికి ఎప్పుడూ వెన్నుపోటు పొడిచింది, డిమాండ్‌ను బలంగా ముందుకుతేలేదు. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు చూపిన ఎరలతో రాజీపడింది. ఈ ఆందోళనలను ముందుకు తీసుకుపోయేంత ప్రజాబలం మరే రాజకీయ పార్టీకీలేదు. కనుకనే ఈ ఈ ఉద్యమం ఇలాంటివే అయిన అస్సాం, తెలంగాణ ఉద్యమాలంత తీవ్రతను ఎప్పుడూ అనుభవించలేదు.

[ఇంగ్లీషు నుంచి స్వేచ్ఛానువాదం]

పుస్తక స్వీకారం

1. నా కవిత సమత- బి. దామోదరరావు కవితాసంపుటి [1981], పేజీలు 34+vi 1/8 క్రౌన్, వెల రు. 4-00 ప్రతులకు : బి దామోదరరావు, 6-3-73, ఇమిలీపురా, హనుమకొండ.
2. కెరటం- ఆధునిక సాహిత్య బులెటిన్ 1, 2, 3, మరో కెరటం - 1 ప్రచురణ : సాహితీమిత్రులు, విజయనగరం, పేజీలు : ఒక్కొక్కటి 12, 1/8 డెమీ,

సంవత్సరచందా 5 రు. ప్రతులకు: ఏ. రాంబాబు, కేరాఫ్ పాన్‌షాప్, న్యూపూర్ణా వద్ద, విజయనగరం 531 202

3. కవితాదిక్సూచి, వర్తమాన కవితావేదిక నెం. 1, నవంబర్/డిసెంబర్ 81, నిర్వహణ సాహితీమిత్రులు, సిరిసిల్ల, పేజీలు : 8, వెల : లేదు, ప్రతులకు : 1 2-63, సిరిసిల్ల 505 301

4. ఉషఃకిరణాలు, కరీంనగర్ ప్రభుత్వ వైజ్ఞానిక జూనియర్ కళాశాల విద్యార్థుల కవితాసంకలనం, సంపాదకులు : జి. లింగారెడ్డి, ప్రచురణ : వికాససాహితి, కరీంనగర్ [జులై 1981] పేజీలు 28+vi 1/8 డెమ్మీ వెల రు. 2.00 ప్రతులకు డా. జి. లింగారెడ్డి, లెక్చరర్, 3/7-1-4/సి2 మంకమ్మతోట, కరీంనగర్-505 002

5. సాహిత్యంలోస్త్రీ - వ్యాససంకలనం పేజీలు : 154 1/8 క్రౌన్, వెల రు 6.00

6. స్త్రీ కవితాసంకలనం పేజీలు : 35+8, 1/8 క్రౌన్ వెల రు. 6.00 ఈ రెండు పుస్తకాలు సంకలనకర్త జాతశ్రీ, ఖమ్మంజిల్లా అరసం ప్రచురణ [మార్చి 1981] ప్రతులకు: జాతశ్రీ, సృజనాలయం, ఇల్లెందు, ఖమ్మం 507 123

7. వాడినమల్లెలు కథలు సొదుం జయరాం, యుగసాహితి, ప్రొద్దుటూరు ప్రచురణ [సెప్టెంబరు 1981], పేజీలు 80+viii +2, 1/8 క్రౌన్. వెల రు 3.00 ప్రతులకు యుగసాహితి, 3/533, హోమస్‌పేట, ప్రొద్దుటూరు 516 361.

8. గుండెమండింది కవితాసంకలనం తోటమహదేవ్, నూతనసాహితి పబ్లికేషన్స్, సిరిసిల్ల [ఆగస్టు 1981] పేజీలు 24+iv వెల రు. 3.00

9. ఉదుములు - మినీసంకలనం బుస్సా బాలచందర్, తోటమహదేవ్, నూతన సాహితి పబ్లికేషన్స్, సిరిసిల్ల [జనవరి 82] పేజీలు 16, వెల: 50 పైసలు ఈ రెండు పుస్తకాలు ప్రతులకు తోటమహదేవ్, 10-3-116, గచ్చుబౌలి, సిరిసిల్ల - 505 301

10. విద్యుద్వీణలూ - వెన్నెలతీగలూ, డాక్టర్ మిరియాలరామకృష్ణ కవిత్వం, సామ్యవాద సాహితి ప్రచురణ [డిసెంబరు 1981], పేజీలు: 256+xiv, 1/8 డెమ్మీ వెల రు. 21.00 ప్రతులకు శ్రీమతి ఎం లక్ష్మీదేవి 10-4-23, ఆర్. ఆర్. పేట కాకినాడ 533 004

11. స్పృహ - సాహిత్యపత్రిక సంవత్సరచందా 6 రూపాయలు, ప్రతులకు రమేష్ రాజు, ఆకులవీధి, బరంపురం 760 001

12. గోదావరిలోయ కవితలు, పాటలు, 'నమ్ము', ఉదయసాహితి ప్రచురణ [డిసెంబరు 1981] పేజీలు 72+xx 1/8 డెమ్మీ, వెల రు. 3.50, ప్రతులకు : నమ్ము సి-85 వనస్థలిపురం, హైదరాబాద్.

1981 సూచిక

ఎదురు చూడండి !   వెలువడబోతోంది !

కారల్ మార్క్స్

పెట్టుబడి

సంక్షిప్తీకరణ: జూలియస్ బొర్చార్డ్ట్   అనువాదం: ఇంగువ మల్లికార్జునశర్మ

మూడు సంపుటాలలో, వేలకొలది పేజీలలో విస్తరించిన మార్క్స్ మహా విశ్లేషణకు ఒకే చిన్నపుస్తకంగా జూలియస్ బొర్చార్డ్ట్, చేసిన విశిష్ట సంక్షిప్తీకరణ. మార్క్స్ సొంతమాటల్లోనే, 'పెట్టుబడి' మూలగ్రంథంలోని వివిధ భాగాలనుండి ఉల్లేఖనలిస్తూనే ఎంతో సమర్థవంతంగా ఆయన రూపొందించిన మేలిసంక్షిప్త పాఠం. అదే యిప్పుడు తేట తెలుగులో, నలభై ఏళ్ల కమ్యూనిస్టు ఉద్యమ చరిత్రలో మొట్టమొదటి సారిగా పుస్తకరూపంలో వెలువడబోతోంది. తెలుగు పాఠకలోకానికి ప్రామాణిక మార్క్సిస్టు రచనలు, విశిష్ట రాజకీయ డాక్యుమెంట్లు అచ్చేసి అందజేయ కంకణంకట్టుకున్న మార్క్సిస్టు అధ్యయనవేదిక తొలికృషిగా వెలువడబోతోంది.

1982 మే 1వ తేదీనాటికి రంచన్‌గా పాఠకులకీ మేలిపొత్తాన్ని అంద జేయాలనే దృఢసంకల్పంతో వున్న మాకు తామే వర్గానికి చెందినా, లేక స్వతంత్రులుగా వున్నా కమ్యూనిస్టులు, సోషలిస్టులు, ఇతర ప్రగతిశీలులు అందరూ తమ శాయశక్తులా విరాళాల ద్వారానో, లేక ప్రచురణపూర్వచెల్లింపుల (ప్రీపబ్లికేషన్ అడ్వాన్సెస్) ద్వారానో సహకరించవలసిందని విజ్ఞప్తి.

ప్రీ పబ్లికేషన్ అడ్వాన్సు — 15 రూ. మాత్రమే

పెట్టుబడి ప్రచురణకు పెట్టుబడి సమకూర్చండి !

సోషలిజం ప్రయోజనాలు పెంపొందించండి !

మార్క్సిస్టు అధ్యయన వేదిక

వివరాలకు : ఇంగువ మల్లికార్జున శర్మ

6.3-1243/114,

హైదరాబాదు - 500 482

SRJANA Telugu Monthly Jan. '82 H/WL-10
Regd. No. with Registrar of Newspapers 10953/67.

ఆముఖ్

1965 చివరి రోజుల్లో తిరుగబడే స్వభావంతో రచనలు చేస్తున్న కళాకారులకు వేదికగా వారణాసి నుంచి ఆముఖ్ పత్రిక ప్రారంభమైంది. 67లో నక్సల్బరీ పోరాటానికి తర్వాతికాలంలో దేశవ్యాప్తంగా చెలరేగిన ప్రజా పోరాటాలకు కళారూప ప్రతిస్పందనగా ఆముఖ్ హిందీ సాహిత్యంలో గణనీయమైన స్థానాన్ని ఏర్పరచుకుంది. 1965 నుంచి 75లో అత్యయిక పరిస్థితి దాకా 16 సంచికలు వెలువడిన ఆముఖ్ రెండుసార్లు నిషేధానికి గురయింది. సంపాదకుడు ప్రముఖ కవి కంచన్ కుమార్ ఒకసారి నిర్బంధానికి గురయ్యారు.

ఏడుసంవత్సరాల నిశ్శబ్ద ఆత్మాలోచన తర్వాత ఆముఖ్ మరోసారి హిందీ సాహిత్యంలో సంచలనాన్ని సృష్టిస్తూ ఇటీవల పునః ప్రారంభమైంది. గతంలో తెలుగు విప్లవ సాహిత్యాన్ని హిందీ పాఠకలోకానికి మొదటిసారి పరిచయం చేసిన స్నేహిత గా ఆముఖ్ సృజన పాఠకుల సహకారాన్ని కోరుతున్నది. తెలుగు సాహిత్యాన్ని హిందీలోకి అనువదించగల రచయితలందర్నీ తన కృషిలో భాగం పంచుకోవాల్సిందిగా విజ్ఞప్తి చేస్తోంది. హిందీ చదవగల పాఠకుల్ని చందాలుకట్టి సాహిత్యాన్ని సమిష్టిగా అనుభవించే సాంప్రదాయానికి బలాన్నివ్వవలసిందిగా కోరుతోంది. చందా రు. 10.

చందాలు, రచనలు పంపవలసిన చిరునామా

Kanchan Kumar
45, Jor Bagh
NEW DELHI
110 009.

SRJANA
Hanamkonda-506001

Single copy Rs. 2-00
Yearly Subscription Rs. 20-00